
రైతులోకం

సంపుటి : 48 ✻ సంచిక : 1 ✻ విజయవాడ ✻ సెప్టెంబర్ 2016 ✻ వెల : రూ. 15/-





గిట్టుబాటు ధరలేక నేలపాలైన టమోట పంట






రైతుసంఘం రాష్ట్ర స్థాయి వర్క్‌షాపులో ప్రసంగిస్తున్న వ్యవసాయ ఉపసంచాలకులు జెడ్. వెంకటేశ్వర్లు మరియు నాబార్డు ఏజీయం బి. శ్రీనివాసులు

అమరావతిలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయానికి

10 సెంట్ల స్థలం విరాళం



రాష్ట్ర రాజధాని అమరావతిలోని పెనుమాక గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర కార్యాలయం నిర్మించుకునేందుకు రూ. 50 లక్షలు విలువ చేసే 10 సెంట్ల స్థలాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా, మంగళగిరి నియోజకవర్గ గౌరవాధ్యక్షులు, పెనుమాక సొసైటీ డైరెక్టర్ గుంటక సాంబిరెడ్డిగారు విరాళంగా ఇచ్చారు. కడపలో ఆగస్టు 29-31 తేదీలలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో గుంటక సాంబిరెడ్డిగారు పాల్గొన్నారు. పైపేర్కొన్న స్థలాన్ని సంఘం రాష్ట్ర కార్యాలయం కోసం ఇస్తున్నట్టు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, పెనుమాక గ్రామంలో 1946వ సంవత్సరంలో గుంటక వీరారెడ్డి, సామ్రాజ్యం దంపతులకు సాంబిరెడ్డిగారు జన్మించారు. చిన్ననాటి నుంచి వామపక్ష భావాలతో పెరిగారు. 1969వ సంవత్సరం నుంచి కమ్యూనిస్టు పార్టీలో పని చేస్తున్నారు. ఆనాటి నుంచి రైతు సంఘంలో చురుకైన కార్యకర్తగా, నాయకునిగా ఎదిగారు. 1970లో అన్నపూర్ణమ్మను వివాహమాడారు. వీరికి అఖిల భారత కిసాన్‌సభ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. రామచంద్రయ్య, కె.వి.వి. ప్రసాద్‌లు కృతజ్ఞతలు తెలియచేశారు.

సంపాదకీయం

కరువు కోరల్లో చిక్కుకున్న ఉభయ తెలుగు రాష్ట్రాలు

దేశంలో రుతుపవనాలు ప్రారంభమైన తరువాత 87% మాత్రమే వర్షపాతం నమోదు అయినది. రెండు తెలుగు రాష్ట్రాల్లో వర్షపాతం మామూలుగా పడేదానికన్నా ఖరీఫ్‌లో తక్కువగా కురిసినది. ఏరువాక ప్రారంభంలో తొలకరి జల్లులతో రైతులను ఊరించాయి. ఈ సంవత్సరం వర్షాలు బాగా ఉంటాయని వాతావరణ శాస్త్రవేత్తలు సెలవిచ్చారు. దానికి ప్రభుత్వాలు కూడా బాగా ప్రచార బాకాలు ఊదాయి. జూన్, జూలై నెలల్లో కురిసిన వర్షాల వలన రైతులు సంతోషంతో నాట్లు ప్రారంభించారు. ఇప్పటి వరకు తెలంగాణాలో 51%, ఆంధ్రప్రదేశ్‌లో 36% వరి నాట్లు పడ్డాయి. ఎ.పి.లో 16 లక్షల హెక్టార్లకు గాను 8 లక్షల హెక్టార్లలో వరి నాట్లు పూర్తయినాయి. తెలంగాణాలో 9.86 లక్షల హెక్టారులకు గాను 30% మాత్రమే పూర్తయినాయి. తెలంగాణాలో ప్రత్తి సాగు 17.09 లక్షల హెక్టార్లలో సాగు చేస్తారు. ఇది దేశంలోనే అన్ని రాష్ట్రాలకన్నా అత్యధికం. ఈ సంవత్సరం అపరాల సాగు పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో వరి తరువాత ఎక్కువ సాగు వేరుశెనగ ఉంటుంది. 9.3 లక్షల హెక్టార్లలో ప్రతి సంవత్సరం వేస్తారు. ఇప్పటి వరకు 5.88 లక్షల హెక్టార్లలో మాత్రమే సాగు అయినది. ఎ.పి.లో అపరాలు 2.53 లక్షల హెక్టార్లకు గాను 65% మాత్రమే సాగు అయినది. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ, విజయనగరం, తూర్పు గోదావరి మినహా మిగిలిన పది జిల్లాల్లో పడాల్సిన వర్షంకన్నా తక్కువ నమోదు అయినది. ఆగస్టు చివరికి వచ్చినా వర్షాలు పూర్తిగా ముఖం చాటేశాయి. ఎండలు మే నెలల రోహిణి కార్తెను మరిపిస్తున్నాయి. పొలం నెర్రెలువారింది. పైర్లు మల మల మాడిపోవటం మొదలైంది. రైతులు ఆకాశం వైపు మోరలు ఎత్తుకొని చూస్తున్నారు. వర్షాలు పడకపోతే ఏమి చేయాలో తెలియక రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వరి పైర్లు ఎండిపోతున్నాయి. మొక్కజొన్న, ప్రత్తి, కంది, పెసర మొక్కలు వాడిపోతున్నాయి. కృష్ణా డెల్టా క్రింద సాగు అవుతున్న కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాల రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

గత సంవత్సరం పట్టిసీమ ద్వారా నీళ్ళు తెస్తున్నామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించినప్పటికీ ఆశించిన మేర నీరు రాలేదు. పట్టిసీమ ప్రవహిస్తున్న ప్రాంతంలో కూడా కాలువకు ఇరుప్రక్కల పశ్చిమ గోదావరి జిల్లాలో వరి పైర్లు ఎండిపోతున్నాయి. కృష్ణా డెల్టాలో బోర్ల క్రింద నానా ఇబ్బందులు పడి పైర్లు బ్రతికించుకుంటున్నారు. పట్టిసీమ ఒట్టిసీమగా మారుతుందేమోనని రైతులు భయపడుతున్నారు. అనంతపురంలో ఈ సీజన్‌లో 88.7 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా, ఇప్పటి వరకు 3.7 మి.మీ. వర్షపాతం మాత్రమే నమోదయినది. అల్పపీడనం వలన గత రెండు రోజుల నుండి ఒకమేర వర్షాలు పడుతుండడం వలన ఆశాజనకమైన పరిస్థితి ఏర్పడుతున్నప్పటికీ, ఇది పూర్తిగా పరిష్కారం కాదు.

ఈ సంవత్సరం ప్రాజెక్టులలో ముందుగానే నిండుతాయని ఆశలు రేకెత్తించారు. ఆలమట్టి, జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులు నిండి పొర్లిపోయి క్రిందకు నీరు వదులుతున్నట్లు వార్తలు వచ్చాయి. ఆశలు కాస్త అడియాశలుగా మారిపోయాయి. రెండు తెలుగు రాష్ట్రాలకు జీవనాధారమైన నాగార్జున సాగర్ ప్రాజెక్టు డెడ్ స్టోరేజిని దాటలేదు. ఈ ప్రాజెక్టు క్రింద కుడి, ఎడమ కాలువల ద్వారా 22 లక్షల ఎకరాలకు సాగునీరు రావాల్సి ఉంది. ఇప్పుడు సాగునీరు కాదు కదా, త్రాగునీరుకు కూడా కటకటలాడాల్సి వచ్చింది. ఎట్టకేలకు త్రాగునీటికి నీరు విడుదల చేస్తున్నారు. గత రెండు సంవత్సరాల నుంచి సాగునీరు వదలక పైర్లు వేయలేని పరిస్థితి ఏర్పడింది. ముచ్చటగా మూడోసారి కూడా అదే పరిస్థితి ఏర్పడుతుందేమోనని రైతులు భయాందోళనలకు గురవుతున్నారు.

కరువు ఇంత విలయతాండవం చేస్తుంటే, దేవాదాయ శాఖవారు వరుణ యాగాల పేరుతో ఈ నెల 26 నుండి 28 వరకు కార్యక్రమం ప్రకటించారు. గ్రామాల్లో కప్పల ఊరేగింపులు, గాడిదల పెళ్ళిళ్ళు చేస్తున్నారు. దేశంలో 450 నదులు ప్రవహిస్తున్నాయి. మన రాష్ట్రంలో కృష్ణా, గోదావరి, పెన్నా లాంటి జీవనదులు ఉన్నాయి. గోదావరిలో ప్రతి సంవత్సరం 2000ల నుండి 3000ల టి.ఎం.సి.ల వరకు నీరు వృధాగా సముద్రంలో కలుస్తోంది. దానిమీద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సరైన జల విధానం' లేనేలేదు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు నీరు-మీరు, ఇంకుడుగుంతలు, చెక్‌డ్యామ్‌లు నిర్మించాలంటూ కాలక్షేపం చేస్తున్నారు. పెద్ద ప్రాజెక్టుల మీద ముఖ్యమంత్రికి ఆసక్తి లేదు. అవి తెల్ల ఏనుగులు అని నామకరణం చేశారు. పంట సంజీవని క్రింద ఒక లక్షకు పైగా కుంటలు త్రవ్వాలని ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటివరకు 40% కూడా పూర్తికాలేదు. ఇప్పుడు రెయిన్ గన్స్ (జల ఫిరంగులు), బిందు సేద్యం, తుంపర సేద్యం చేయాలంటున్నారు. రెయిన్ గన్స్‌కు ఏకంగా 160 కోట్లు ఈ సంవత్సరం ఖర్చు పెట్టడం జరిగింది. గత ప్రభుత్వం కూడా "మేఘమథనం" పేరుతో కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేసిన సంగతి అందరికీ తెలిసిందే. అసలు భూగర్భ జలాలు మెరుగుపడకుండా, కుంటల్లో, చెరువుల్లో నీళ్ళు ఉంటేనే కదా, రెయిన్ గన్స్, బిందు సేద్యం, తుంపర సేద్యం ఉపయోగపడేది?

ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్ళు తెరిచి కరువు నివారణ చర్యలు చేపట్టాలి. కరువు నివారణ కోసం ప్రభుత్వానికి సరైన ప్రణాళికలు లేవు. ఉన్నా వాటిని కూడా సరిగా అమలుజరిపే చిత్తశుద్ధి లేదు. ఇప్పటికీ కాలంచెల్లిన బ్రిటీష్‌వాళ్ళు ప్రవేశపెట్టిన చట్టాలను పట్టుకు వేలాడుతున్నారు. "డ్రవుట్‌కోడ్" నవలించిన పాపాన పోలేదు. యుద్ధప్రాతిపదికన కరువు నివారణ చర్యలు, సహాయక చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలి. దీనికోసం రైతులంతా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉంది.

రావుల వెంకయ్య

ప్రధాన సంపాదకులు

రైతులోకం

సెప్టెంబర్ 2016
సంపుటి - 48 సంచిక - 1
వెల రూ. 15/-
పేజీలు : 44

చిరునామా :
రైతులోకం, రైతు భవన్, 210, అమృత ఎస్టేట్స్
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500 029
Mail : ryotulokam@gmail.com

విషయ క్రమం ...

ఎడిటర్ పేరుతో రచనలు,
కన్వీనర్, రైతులోకం పేరుతో చెక్కులు, డి.డి.లు పంపాలి.

భారతదేశంలో వ్యవసాయం భవిష్యత్ ఏమిటి?




ఎం.సి. వెంకటేశ్వర్లు

విశ్వజీత్ చౌదరి, గురుచరన్‌సింగ్

ఆహార భద్రతపై కేంద్రీకరించిన వ్యవసాయాభివృద్ధిని పెంచాలి. తద్వారా రైతు యొక్క ఆదాయం భద్రతపై దృష్టి పెట్టాలి.

ఆర్థిక సర్వే 2015-16ని నిశితంగా పరిశీలిస్తే భారత వ్యవసాయ రంగం గత విజయానికి బాధితగా మిగిలింది. ప్రత్యేకించి ఆకుపచ్చ విప్లవానికి నేడు వ్యవసాయం ధ్వంసం అయిందన్న నిజాన్ని అంగీకరించలేం. ఆకుపచ్చ విప్లవం అంటే అధిక దిగుబడి వంగడాలు, ఎరువులు గురించి తరచుగా వర్ణిస్తుంటాం. అధికోత్పత్తి వచ్చిందనుటలో ఎలాంటి సందేహంలేదు. ఇటీవలి కాలంలో ఉత్పాదకత మందగించింది. ఫలితంగా రైతు ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది. భూగర్భజలాలు, భూమి కలుషితం కావడం, భూగర్భ జలాలు పడిపోవడం, విషవాయువులు వెలువడుటలో ప్రతికూల పర్యావరణ పరిస్థితులు ఏర్పడ్డాయి. వ్యవసాయం తీవ్ర దుస్థితిలో వుందని చెప్పనవసరం లేదు. తీవ్ర పరిస్థితులు ఎదుర్కొంటున్న రైతులు, చిన్నతరగతి రైతుల ప్రయోజనాలను కాపాడుటకు తక్షణం జోక్యం చేసుకోవలసిన అవసరం ఏర్పడింది.



మొదటగా ఉత్పాదకత తగ్గిపోవడాన్ని అధిగమించాలి. తృణ ధాన్యాల ఉత్పత్తి హెక్టారుకు 2013 లెక్కల ప్రకారం అనేక తక్కువ ఆదాయం కలిగిన దేశాలకంటే తక్కువ దిగుబడి వచ్చింది. చైనాతో పోల్చుకుంటే ఆ వ్యత్యాసం ఎక్కువ ఉన్నది. ఉదాహరణకు హెక్టారుకు సగటు దిగుబడి చైనాకంటే 39 శాతం తక్కువ. అదే వరి ధాన్యమయితే 46 శాతం తక్కువ. వరి ధాన్యంలో బంగ్లాదేశ్, వియత్నాం, ఇండోనేషియాలు సైతం భారతదేశం కంటే ఎక్కువ దిగుబడి పొందుతున్నాయి. అంతర్గతంగా గోధుమ, వరి ధాన్యం దిగుబడిలో ప్రాంతాల మధ్య తేడా వుంది. దేశంలోని ఇతర రాష్ట్రాల కంటే పంజాబ్, హర్యానాలలో ఎక్కువ ఉంటుంది. పడిపోతున్న ఉద్పాదకతను అధిగమించాలంటే గోధుమ, వరి పంటల స్థానంలో తృణధాన్యాలు, నూనెగింజల ఉత్పత్తి విత్తనాల పంటలవైపు వ్యవసాయాన్ని మళ్ళించాలి. వరి, గోధుమ పంటలకు కనీస మద్దతు ధర, వ్యవసాయ ఉపకరణాల మద్దతు ధర ఉంటుంది. మాగాణి ప్రాంత రైతులు ఈ పంటలను పండించడానికి అధిక రాయితీలను పొందుతున్నారు.

అయితే ఈ పంటలు అధిక రాయితీలు పొందడమే గాక ప్రతికూల పర్యావరణ పరిస్థితులకు కారణమవుతున్నాయి. ఈ పంటలు పండించడానికి రైతులకు రాయితీలలో కోత విధిస్తూ కనీస మద్దతు ధరను పెంచాలి. అది ఒక్కటే సరిపోదు. ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెంచాలి. భిన్నమైన రకాల వరిధాన్యాలను పండించ డానికి హర్యానా మిల్లర్లు స్థిర మార్కెట్‌ను ఏర్పాటు చేయుటతోపాటు రాయితీలు కల్పిస్తున్నారు.

బొట్టు నీటికి అధిక దిగుబడి రావాలి!

వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రధాన సహజ వనరులైన భూమి, నీరు కొరతకావడం. జనాభా పెరుగుదలతో తలసరి భూమి తరిగిపోవడమే గాక, వ్యవసాయ క్షేత్రాలు ముక్కలయిపోయాయి. వ్యవసాయరంగంలో ముందున్న దేశాల కంటే తలసరి నీటని లభ్యత భారతదేశంలో తక్కువ. నీటితో పండే పంటలను ఎగుమతి చేయడం ఈ సమస్యను మరింత దిగజారుస్తుంది. తిరిగి ఆ నీటని సమకూర్చడం సాధ్యం కాదు. ఒకసారి ఎగుమతి చేస్తే అది తిరిగిరాదు. వ్యవసాయ ఎగుమతుల రూపంలో భారతదేశం 25 క్యూబిక్ కిలోమీటర్ల నీటిని ఎగుమతి చేస్తున్నదని 2010లో ప్రశాంతి గోస్వామి, శివనారాయణ నిషాద్ నివేదిక తెలియజేసింది. అది ప్రతి సంవత్సరం మనకు లభ్యమయ్యే నీటిలో ఒక శాతం ఉంటుంది.

కొరతగా ఉన్న నీటి వనరులను న్యాయబద్ధంగా ఉపయోగపెట్టడానికి సూక్ష్మ సాగు నీటి పద్ధతులు అనుసరించవలసిన అవసరాన్ని ఈ పరిస్థితి తెలియజేస్తున్నది. సూక్ష్మసాగు నీటిపద్ధతులు తక్కువ ఎరువుల వాడకంపై "నేషనల్ మిషన్ సస్టైనబుల్ అగ్రికల్చర్" 13 రాష్ట్రాల్లో 64 జిల్లాల్లో చేసిన అధ్యయనం ప్రకారం గోధుమపంట 45 శాతం, కాయధాన్యం 20 శాతం, సోయాబీన్ 40 శాతం దిగుబడి పెరిగినట్లు తేలింది. అయినప్పటికీ ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడానికి ఖర్చు అధికంగా వుంటున్నందున రైతులను నిరుత్సాహ పరుస్తున్నది. అదే ధనిక రైతులు ఈ సాంకేతిక విజ్ఞానాన్ని తేలిగ్గా వినియోగించుకో గలుగుతారు.

కాబట్టి చిన్న, సన్నకారు రైతుల అభివృద్ధికి ప్రభుత్వం సబ్సిడీలు ఇవ్వాలి.

ప్రజాకర్షక విధానాలతో ప్రభుత్వం విద్యుత్‌ఛార్జీలు, డీజిల్ ధరలను అసలు ధరకంటే తగ్గించడంతో భూగర్భ జలాలను ఎక్కువగా వాడటానికి అవకాశం కలుగుతున్నదని ఎ. వైద్యనాథన్ తెలిపాడు. అసలు ఛార్జీలను వసూలు చేయాలని వైద్యనాథన్ చేసిన సూచనను అమలు చేయడం సాధ్యం కాదు. ఇది సున్నితమైన సమస్య. ఈ ప్రభావం ప్రత్యక్షంగా ఉత్పాదకత, రైతుల ఆదాయంపై పడుతుంది.

మార్కెట్‌లను ఏర్పాటు చేయాలి

సాంకేతిక విజ్ఞానాన్ని, పెట్టుబడుల ప్రవాహాన్ని ఉపయోగించడానికి వ్యవసాయరంగంలో కాంట్రాక్ట్, లీజ్ పద్ధతుల్లో ప్రైవేట్ రంగ భాగస్వామ్యం కలిగించాలని "ద నేషనల్ అగ్రికల్చర్ పాలసీ ఆఫ్ 2000" ప్రకటించింది. కాని వ్యవసాయ రంగంలో ప్రైవేట్ రంగం భాగస్వామ్యం చెప్పుకోదగిన స్థాయిలో లేదు. "వ్యవసాయ ఉత్పత్తుల మేనేజ్‌మెంట్ కమిటీ (ఎ.పి.ఎం.సి) యాక్ట్" నియంత్రణలో వుండే "హోల్‌సేల్" మార్కెట్ల సంస్కరణలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో వుండటం ప్రైవేట్‌రంగ పెట్టుబడులకు ఆటంకంగా వుంది. ఎ.ఎం.పి.సి. ఆధ్వర్యంలో ప్రభుత్వ నియంత్రణలో వుండే మార్కెట్ యార్డులో రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోవాలి. అది ప్రైవేటుం పెట్టుబడికి పెద్ద ఆటంకంగా వుంది.

కేంద్ర ప్రభుత్వం 2003లో ఎ.పి.ఎం.సి.ని ఏర్పాటు చేసినప్పటికీ నేడు "నీతిఅయోగ్" వ్యవసాయరంగంపై "టాస్క్‌ఫోర్స్"ను ఏర్పాటు చేసింది. ఇది అనేక రాష్ట్రాలలో ఏర్పాటు కాలేదు.

ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా తమ ఉత్పత్తులను దేశంలో ఎక్కడైనా అమ్ముకోవడానికి ప్రభుత్వం జాతీయ వ్యవసాయ మార్కెట్‌ను ప్రారంభించింది. అయినప్పటికీ రైతులు దానిద్వారా లబ్ధిపొందడం సుదూరస్వప్నం.

పరిశోధన, అభివృద్ధే భవిష్యత్

వ్యవసాయ ఉత్పత్తులను పెంచడానికి, లక్ష్యాలను బ్రద్దలు కొట్టడానికి ప్రధాన ఆటంకం శాస్త్ర పరిశోధనలు తగిన రీతిలో పెరగకపోవడం. ఆకుపచ్చ విప్లవంలో ప్రధాన పాత్ర పోషించిన జాతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ ఇటీవల కాలంలో నిస్తబ్ధత చోటు చేసుకున్నది. ఆసియాలో పరిశోధన, అభివృద్ధిపై జిడిపిలో పెట్టే ఖర్చుతో మనదేశాన్ని పోల్చి చూస్తే అసలు విషయం స్పష్టమవుతుంది. భారతదేశంలో 2010లో వ్యవసాయ రంగ జిడిపిలో పరిశోధనలకు, అభివృద్ధికి చేసిన ఖర్చు 31 శాతం కాగా, చైనా రెండింతలు ఖర్చు చేసింది. మన పొరుగుదేశం బంగ్లాదేశ్ ఆ దేశ వ్యవసాయ జి.డి.పిలో 38 శాతం ఖర్చు చేసింది. ఫలితంగా వనరులు తగ్గిపోయాయి. వ్యవసాయ నూతన అన్వేషణలు ఆవిష్కరించలేదు. ఆచరణలో ఉత్పత్తి పెరుగుదల లేకపోయింది.

. వ్యవసాయ పరిశోధనపై విద్యార్థులకు ఆసక్తి సన్నగిల్లింది. సాపేక్షకంగా వ్యవసాయం ప్రధానంగా ఉన్న రాష్ట్రాల్లో వ్యవసాయ విద్య నభ్యసించే విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. పరిశోధన, అభివృద్ధి ప్రైవేట్ రంగంసైతం చేసిందేమీ లేదు. ప్రైవేటు వ్యక్తులకు పెద్దఎత్తున రాయితీలు కల్పించడంలో ప్రభుత్వం అత్యంత ప్రేమను చూపిస్తున్నది.


ప్రభుత్వం 2022 నాటికి వ్యవసాయాదాయాన్ని రెండింతలు పెంచుతామని చేస్తున్న ప్రకటనపై అనేకమంది సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ కమిషన్ మాజీ ఛైర్మన్ అశోక్ గుల్హాటి వ్యవసాయాదాయాన్ని రెండింతలు చేస్తాననడం "వింతల్లో వింత" అని వ్యాఖ్యానించాడు. చక్రవడ్డీ మాదిరి సంవత్సరానికి గ్రోత్ రేటు 12% పెరగాలి. దశాబ్దకాలంలో (2003-13) రైతుల ఆదాయం సంవత్సరానికి 5 శాతం పెరగడం చూస్తే ప్రభుత్వ కోరిక నెరవేరుతుందనుకోవడం పేరాశే. రైతుల భవిష్యత్‌ను కాపాడాలనుకున్నా, వ్యవసాయానికి పట్టిన చీడను పూర్తిగా నయం చేయాలన్నా సాధ్యమైనంత తొందరగా భారీ విధాన నిర్ణయాలను ప్రభుత్వం తీసుకోవాలి. ✧

నీళ్ళలో కరిగే ఎరువులు

మొక్కలకు ఆకుల ద్వారా పోషకాలను అందించేందుకు వీలుగా నీటిలో కరిగే ఎరువులు ముఖ్యంగా నత్రజని, భాస్వరం, పొటాష్ కాంప్లెక్సు ఎరువులు విదేశాల నుండి దిగుమతి అయి మార్కెట్‌లో దొరుకుతున్నవి. ఎన్.పి.కె. 19:19:19, 20:20:20, 13:0:45, 28:28.0, 0:52:34, 0:0:50, 12:61:0, 24:24:0 ఇలా వివిధ నిష్పత్తుల మిశ్రమాలు మార్కెట్‌లో కిలో ప్యాకెట్లు పొడి రూపంలో లభ్యమవుతున్నాయి.

వీటిలో నత్రజని, భాస్వరం, పొటాష్ వున్న ఎరువులను పైరు పూతకొచ్చే ముందు వాడాలి. కాయ ఎదుగుదల దశలలో కేవలం నత్రజని పొటాష్ లేదా కేవలం పొటాష్ మాత్రమే గల ఎరువులను వాడాలి. ఎకరాకు ఏ ఎరువైనా ఒక కిలో 100 లీటర్ల నీటిలో కలిపి పైరుపై పిచికారి చేసుకోవాలి. ముఖ్యంగా చేలో తేమ ఎక్కువగా ఉన్నపుడు లేదా ముంపులో ఉన్నపుడు లేదా వర్షాభావ పరిస్థితులలోను మొక్క భూమి నుండి పోషకాలను తీసుకోలేదు. అలాంటి పరిస్థితులలో నీటిలో కరిగే ఎరువులను వాడవచ్చును. టొమాటో, పత్తి, మిరప, కూరగాయల పంటలలో మంచి ఫలితాలు లభిస్తాయి.


చిరుధాన్య పంటల ప్రయోజనాలు, ఆవశ్యకత



సంగిరెడ్డి హనుమంతరెడ్డి
గుంటూరు
సెల్ : 9490204545

చిన్న విత్తనాలు గల ధాన్యాలను చిరుధాన్యాలు అంటారు. జొన్నలు, రాగులు, కొర్రలు, సజ్జలు (సొద్దలు), సోములు, ఆరికెలు, వరిగెలు, ఊదలు, ఓట్లు, బార్లి మొదలైన ధాన్యాలన్నీ చిరుధాన్యాలే. తూర్పు ఆసియాలో ఈ పంటలు 10,000 సంవత్సరాల నుండి సాగులో ఉన్నాయి. ప్రపంచంలో మానవులు మొట్ట మొదట పండిం చిన చిరుధాన్యం కొర్రలు. ఈ పంట క్రీ.పూ. 5,000 సంవత్సరాల క్రితం చైనా నుండి ఐరోపా ఖండానికి వ్యాపించింది.

చిరు ధాన్యాలు పండే ప్రదేశాలు : ఇవి తక్కువ నీటితో అధిక ఉష్ణోగ్రతలు గల గరుకు, పొడి నేలల్లో పండుతాయి. చిరు ధాన్యాలు కరువు ప్రదేశాలు, సారహీన భూములలోనే గాక సారవంతమైన భూము లలో కూడా బాగా పండుతాయి. వీటి దిగుబడి కూడా ఎక్కువే. ప్రపంచ వ్యాపి తంగా పండినా ఆసియా, ఆఫ్రికా ఖండాల లోని అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఈ పంటలు ఎక్కువ. అమెరికాలో పక్షుల ఆహారం కొరకు వరిగెలు అధికంగా పండి స్తారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో 97% సజ్జలు పండిస్తాయి. మెరుగు పరచ బడిన చిరుధాన్యాల విత్తనాలు రోగ నిరోధక శక్తిని పెంచుకొని ఉత్పత్తిని కూడా గణనీయంగా పెంచాయి. ప్రపంచంలో భారతదేశం చిరుధాన్యాల ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉంది. 1970ల నుండి 2000 వరకు ఉత్పత్తి బాగా పెరిగింది. 1956 నుండి చిరుధాన్యాల పంట విస్తీర్ణం తగ్గిపోయింది. సజ్జ 23%, రాగి 49%, జొన్న 64%, ఇతర చిరుధాన్యాలు 85% సాగు నేల తగ్గింది. ఈ విస్తీర్ణం ఇంతకంటే కుంగిపోతే భారత ఉప ఖండంలో ప్రాధాన్యత సంతరించుకున్న చిరుధాన్య పంటలను భారత దేశం కోల్పోతుంది..



2010లో ప్రపంచ దేశాల చిరుధాన్యాల సగటు ఉత్పత్తి హెక్టారుకు (2.5 ఎకరాలకు) 0.83 టన్నులు. అత్యధిక చిరుధాన్యాల ఉత్పత్తినిచ్చే భూములు ఫ్రాన్స్‌లో ఉన్నాయి. 2010లో వాటి జాతీయ ఉత్పత్తి హెక్టారుకు (2.5 ఎకరాలకు) 3.33 టన్నులు. 2013లో,.ఉత్పత్తిలో, ప్రపంచంలో మొదటి 10 స్థానాలలో భారత్ (1,09,10,000 ట.), నైజీరియా (50,00,000 ట.), నైజర్ (29,55,000 ట.), చైనా (16,20,000 ట.), మాలి (11,52,331 ట.), బుర్కిన ఫాసో (11,09,000 ట.), సూడాన్ (10,90,000 ట.), ఇథోపియా (8,07,056 ట.), చాద్ (5,82,000 ట.), సెనెగల్ (5,72,155 ట.) దేశాలు ఉన్నాయి.

తగ్గిన చిరుధాన్యాల వినియోగం : 1960లలో, మన దేశంలో, దేశ వ్యాపితంగా మనిషికి సంవత్సరానికి సగటున 32.9 కిలోల జొన్న, చిరుధాన్యాలను తినేవారు. 2010కి ఈ వినియోగం, పట్టణ ప్రాంతాలతో కలిపి, 4.2 కిలోలకు పడిపోయింది. చిరుధాన్యాల వినియోగం మనదేశంలో 50% నుండి 75% వరకు పడిపోయింది. "ప్రజల పెరిగిన ఆదాయాలు, పట్టణీకరణ వలన గోధుమ ఉపయోగం పెరిగింది. ఇది శ్రేష్టమైన తిండిగా భావిస్తున్నారు. జొన్నలు, సజ్జలు (సొద్దలు), రాగులు, ఆరికెలు, కొర్రలు మొదలగు చిరుధాన్యాల వాడకం తగ్గింది. వీటిని నాసిరకం తిండిగా భావిస్తున్నారు" అని 2014లో మన దేశ 'అనువర్తిత ఆర్థిక పరిశోధన జాతీయ మండలి' తెలిపింది.

1960వ దశకం మధ్యలో ఒక భారతీయ పట్టణవాసి సగటున సంవత్స రానికి 27 కిలోల గోధుమలు తినేవాడు. ఇది 2010లో రెట్టింపై 52 కిలోలయింది. కొన్ని దశాబ్దాల నుండి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా గోధుమలు, బియ్యానికి రాయితీలిస్తున్నది. అందు వలన ప్రజలలో ప్రత్యేకించి పట్టణ జనాభాలో వీటి ఉపయోగం పెరిగింది. చిరుధాన్యాల వాడకం తగ్గింది. ఇప్పుడు తిరిగి చిరుధాన్యాల ఉపయోగాన్ని పెంచడం చాలా కష్టమైన పని. "2013 - ఆహార భద్రతా చట్టం' చేయక ముందు గోధుమలు, బియ్యాన్ని మాత్రమే ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ లో చేర్చింది. ఫలితంగా ముతక ధాన్యాల వినియోగం పడిపోయింది." అని ప్రభుత్వేతర సంస్థ 'ధన్' కార్యక్రమ నాయకుడు మునియప్పన్ కార్తికేయన్ అన్నారు.

చిరుధాన్యాల వలన ప్రయోజనాలు : జొన్నతో సహా చిరు ధాన్యాలన్నీ అతి తక్కువ నీటితో పండుతాయి. వరికి కావలసిన నీటిలో 28% నీరే వీటికి సరిపోతుంది. అందు వలన ప్రస్తుత కరువుకే కాక పెరగబోయే భవిష్యత్తు కరువులకు కూడా ఇవి పరిష్కారమవుతాయి. పోషకాహార లోపం వలన భారత దేశంలో ప్రతి సంవత్సరం 10 లక్షల మంది పిల్లలు 5 ఏండ్ల లోపే మరణిస్తున్నారు. మహిళలలో రక్తహీనత 48.1% దగ్గర స్థిరంగా

ఉంది. 185 ప్రపంచ దేశాలలో మనం 170వ స్థానంలో అతి దారుణమైన స్థితిలో ఉన్నాము. ఈ పంటల వలన మనుషులకు తిండి గింజలు, పశువులకు మేత లభిస్తాయి. వీటిలో ఆమ్ల శాతం తక్కువగా పీచు శాతం, పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి. ఊదలలో గోధుమల కంటే 531%, బియ్యం కంటే 1,033% ఇనుము ఎక్కువ. సజ్జలలో గోధుమల కంటే 314%, బియ్యం కంటే 611% ఇనుము ఎక్కువ. సామలలో గోధుమల కంటే 265%, బియ్యం కంటే 516% ఇనుము ఎక్కువ. సామలలో గోధుమల కంటే 839%, బియ్యం కంటే 3,440% సున్నము (క్యాల్షియం) ఎక్కువ. బియ్యంలో కంటే సజ్జలు, గోధుమల్లో 4 రెట్లు సున్నపు సాంద్రత ఎక్కువ. ఊదలలో గోధుమల కంటే 313%, బియ్యం కంటే 783% ఖనిజ లవణాలు ఎక్కువ. కొర్రల లో గోధుమల కంటే 220%, బియ్యం కంటే 550% ఖనిజ లవణాలు ఎక్కువ. గోధుమలు, బియ్యం కంటే ఈ చిరుధాన్యాలలో పోషక పదార్థాలు, నత్రజని అధికం. కేవలం బియ్యం తిన్న ఆడపిల్లల కంటే 60% జొన్నలు, 40% బియ్యం తిన్న ఆడపిల్లల పెరుగుదల రేటు అధికంగా ఉందని హైదరాబాదు లోని 'భారతీయ చిరుధాన్యాల పరిశోధక సంస్థ', 'జాతీయ పోషకాహార సంస్థ' తమ 2015 సంవత్సరపు అధ్యయనాలలో తెలిపాయి. చిరుధాన్యాల పంటలను పెంచితే బియ్యం, గోధుమల కంటే తక్కువ ఖర్చుతో వాటి కంటే ఎక్కువ పోషకాహార విలువలు గల ఆహారాన్ని పొందవచ్చు.

2005 తర్వాత చిరుధాన్యాల ఉత్పత్తిని పశువుల మేతకు, మద్యం తయారీకి వాడుతున్నారు. మద్యమే గాక చిరు ధాన్యాలతో అనేక రకాల తిండి పదార్థాలను కూడా తయారు చేస్తారు. ఇందులో ప్రధాన రూపమైన రొట్టెల తయారీలో జొన్న ప్రధానమైనది. తర్వాతి స్థానం కొర్రలు, రాగులది. మన దేశంలో అనేక రకాల పిండివంటలు కూడా చేస్తారు. రష్యా, జర్మనీ, చైనాలలో పాలు, పంచదారలతో కలిపి పలు రకాల తీపి పదార్థాలను చేసుకుంటారు. పశుగ్రాసంగా చిరుధాన్య పంటలు బాగా ఉపయోగపడతాయి. గింజలు రాల్చు కున్న తర్వాత మిగిలిన చెత్త, ఆకులు, పొట్టు, కంకులు మంచి పశుగ్రాసంగా ఉపయోగపడతాయి. ప్రత్యేకించి రాగి చెత్త, కొర్ర గడ్డి, అరికె గడ్డి, లేత చొప్ప (జొన్న గడ్డి)ను పశువులు చాలా ఇష్టంగా తింటాయి. పశుగ్రాసం పెరిగితే పశుపోషణలో ఉన్న కష్టాలు తొలగి పాడి పరిశ్రమకు, వ్యవసాయానికి ఊతం లభించగలదు.

నాకు తెలిసిన చిరు ధాన్య వ్యవసాయం: 1958 నుండి 1969 వరకు, 8 నుండి 18 సంవత్సరాల వయస్సులో, నాకు వ్యవసాయం తో కొంత ప్రత్యక్ష అనుభవం ఉంది. అది కూడా పులివెందులలోనే. ఇతర ప్రాంతాల వ్యవసాయం నాకు తెలియదు. మేము మెట్ట వ్యవసాయంలో తీగ వేరుశనగను కొర్ర, జొన్నలతో పంట మార్పిడిగా వేసేవాళ్ళం. ఒక ఏడాది తీగ వేరు శనగ పండిస్తే మరుసటి సంవత్సరం కొర్ర గాని, జొన్న గాని వేసేవాళ్ళం. వర్షాలు ఆలస్యమైన సంవత్సలో జులై నెలలో జొన్న వేసే వాళ్ళం. కొర్ర, వేరు శనగ అయితే జూన్ లోనే వేసేవాళ్ళం. నాలుగు గొర్రు సాళ్ల తర్వాత ఒక కంది సాలు (ఒకే ఒక లైను), అందులోనే పెసలు, అలసందలు, ఆముదాలు కలిపి వేసే వాళ్ళం. ఈ కందులు, పెసలు, అలసందలు, ఆముదాలు ఇంటి వాడకానికి సరి పోయేవి. ఇక వేరుశనగ లేదా కొర్ర పంట చుట్టూ నాలుగు గొర్రు సాళ్లు అరికెలు వేసేవాళ్ళం. ఇవి కూడా కొర్రలు, జొన్నలతో పాటు సంపూరకంగా ఇంటి వాడకానికి ఉపయోగపడేవి. జొన్నలలో ఎర్ర జొన్నలు, పసుపు పచ్చ జొన్నలు, తెల్ల జొన్నలు వేసే వాళ్ళం. ఆ రోజుల్లోనే సీతమ్మ జొన్న, హైబ్రిడ్ జొన్న అని కూడా పండించే వాళ్ళు. ఇది తెల్ల జొన్నయే. వీటి కంకులు పొడవుగా వదులుగా విరబోసుకుని ఉండేవి. మామూలు జొన్న కంకులు పొట్టిగా గట్టిగా ఉంటాయి. చిరుధాన్యాలతో వంటలు: కొర్రలతో అన్నం వండుతారు. ప్రత్యేకించి కొర్రలతోనూ. బియ్యం, కొర్ర బియ్యం సగం సగం కలిపి కూడా. కొర్రలతో అరిశలు, చక్కిలాలు చేస్తారు. జొన్నలతో సంగటి (ముద్ద) చేస్తారు. సంగటి నాలుగు రకాలుగా చేయవచ్చు. జొన్నలలో జొన్నపిండి కలిపి. జొన్నలల రాగి పిండి కలిపి. వరి బియ్యానికి రాగి పండి కలిపి. అచ్చం రాగి పిండితో. సంగటి వేరుశనగ, నల్లేరు, కుసుమల ఊరుమిండి (రోటి పచ్చడి) కలుపుకొని కాసింత నెయ్యి కలుపుకొని తింటే లేని స్వర్గం కూడా కళ్ళకు కనిపించేది. జొన్న రొట్టెలు ప్రసిద్ధి. ఎర్ర జొన్న, పచ్చ జొన్న రొట్టెలు చాలా వగరు. ఈ వగరుకు విరుగుడుగా పెసర పప్పులో బెల్లం కలిపి తీపి పప్పుతో ఈ రొట్టెలను తినేవాళ్ళం. సజ్జ రొట్టెల రుచే వేరు. ఈ రొట్టెలు నెలల తరబడి నిలవుంటాయి. ఇప్పటికీ కర్ణాటకలో - హుబ్బళ్ళి, ధార్వాడలలో పలుచటి సజ్జ, జొన్న రొట్టెలు మామూలు సరుకుల కొట్లలో కూడా అమ్ముతారు. సజ్జలతో ఇప్పటికీ బూరెలు చేస్తారు. రాగి పిండితో పలు రకాల రొట్టెలు, బూరెలు, లడ్లు కూడా చేయ వచ్చు. రాగి దోశలు గుంటూరు లో కూడా దొరుకుతాయి. అరికె అన్నంలో కంది పప్పు కలుపుకొని తింటే దేవతలను ఊరించే సుఖాలన్నీ మానవులకు దక్కుతాయి. ఒక్క మాటలో చెప్పాలంటే బియ్యానికి బదులు కొర్రలు, జొన్నలు, రాగులు, సజ్జలు మొద లయిన చిరు ధాన్యాలను వాడుకోవచ్చు.

చిరు ధాన్య పంటల ఆవశ్యకత : భారత దేశపు ఆహారపు అలవాట్లు బియ్యం, గోధుమలకే పరిమితమై ఉండేవి కావు. కొర్రలు, అరికెలు, సాములు, రాగులు, జొన్నలు, సజ్జలు (సొద్దలు) విపరీతంగా వాడేవారు. అయితే హరిత విప్లవం ప్రజల ఆహార అలవాట్లను మార్చివేసింది. 1970 నుండి 80 దశకాలలో గోధుమ వాడకం పెరిగింది. ప్రభుత్వ విధానాలు నూనె విత్తనాల పంటలను ప్రోత్సహించాయి. ఫలితంగా అనంతపురం లాంటి నీటి ఎద్దడి జిల్లాలలో కూడా, 1990 నాటికి, 90% రైతులు వేరుశనగ వైపు మళ్ళారు. వేరుశనగ కు చిరుధాన్యాల కంటే ఎక్కువ నీరు కావాలి. రైతులు ముందు తరాల తీగ శనగ నుండి గుత్తి శనగ వేయడం ప్రారంభించారు. గుత్తి శనగ నీడలో సరిగా పెరగదు. అందుకని రైతులు పొలాలలోని చెట్లను కొట్టేశారు. ఇది వర్షపాతాన్ని మరింత దిగజార్చింది. ఈ సమస్యలకు తక్కువ నీటితో పండే చిరుధాన్యాల

ఫర్టిగేషన్ ద్వారా చెఱకు, అరటిలో ఎరువుల యాజమాన్యం

వైశాలి కంతేటి, M.Sc (Ag) Pre, Agricultural Extension

డా॥ బి. ముకుందరావు, Associate Professor, Agricultural Extension, అగ్రికల్చర్ కాలేజి, బాపట్ల

వ్యవసాయరంగంలో ఆశించిన స్థాయిలో ఉత్పత్తిని మరియు ఉత్పాదకతలను సాధించే దిశగా ఏర్పరచుకున్న లక్ష్యాలతో అధిక ఉత్పత్తిని సాధించడమే కాకుండా ఉత్పాదక వ్యయాన్ని తగ్గించడం కూడా కీలకమైన అంశం. పర్యావరణ సమతుల్యాన్ని కాపాడుతూ వ్యవసాయ రంగంలో సుస్థిరమైన అభివృద్ధిని ఫర్టిగేషన్ సంతరించుకుంది.

సమగ్ర సాగునీరు మరియు పోషకాల యాజమాన్యంలో 'ఫర్టిగేషన్' పద్ధతి విప్లవాత్మక శకానికి నాంది పలికింది. ఈ పద్ధతిలో సాగు మరియు పంటలకు అవసరమయ్యే పోషకాలు ఒకేసారి సమాంతరంగా సూక్ష్మ నీటిపారుదల పద్ధతిలో మొక్కలకు అందించబడతాయి. ఈ పద్ధతి వల్ల పంటల దిగుబడులు పెరగడమే కాకుండా పర్యావరణంపై ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవు. బిందుసేద్య రైతుల్లో ఫర్టిగేషన్ వినియోగం ఎక్కువగా వుంటుంది.

ఫర్టిగేషన్ అనగా మొక్కలకు నీటితో పాటు కరిగే ఎరువులను అందించే పద్ధతి. దీనివల్ల పోషకాలను ఖచ్చితంగా మొక్క వేరు వ్యవస్థకు సూటిగా అందించే సౌలభ్యం వుంటుంది. బిందు సేద్యం పరికరాలను కొద్దిపాటి మార్పు చేర్పులతో ఫర్టిగేషన్ కూడా ఉపయోగించవచ్చుననే ఆలోచన వల్ల ఇటీవల రైతులు ఫర్టిగేషన్ వైపు ఆకర్షితులౌతున్నారు. భారతదేశంలో నీటిపారుదల క్రింద వున్న మొత్తం విస్తీర్ణంలో కేవలం 0.3 శాతం మాత్రమే సూక్ష్మసాగునీటి పద్ధతుల క్రింద వుంది. అందులో ఫర్టిగేషన్ వాడకం ఇంకా మొట్ట మొదటి దశలోనే వుంది. రైతులు ఇంకా ఎరువులు వాడకం సాంప్రదాయ పద్ధతుల్లోనే ఉంటే వెదజల్లడం లేదా మొక్కల మొదళ్ళలో వేయడం కాని చెప్తూ వుంటారు. కాని ఫర్టిగేషన్ ద్వారా పోషకాలు ఖచ్చితంగా మొక్క వేరు వ్యవస్థకు చేరుతాయి. మొక్క ఎదుగుదల బాగా వుంటుంది. ఎందుకంటే ఎదుగుదల దశలకు అనుగుణంగా వాటి అవసరాలకు తగిన దశల్లో సిఫార్సు చేసిన పోషకాలను అశించే అవకాశం వుంటుంది.

పంటలే పరిష్కారం. చిరుధాన్యాలు తక్కువ నీటితో పండుతాయి. ఎక్కువ పోషకవిలువలను అందిస్తాయి. ఆదాయం కూడా పెరుగుతుంది. మన దేశంలో 60% వ్యవసాయం వర్షాల మీద ఆధారపడి ఉంది. ఈ వర్షాధారిత వ్యవసాయమే 40% ఆహారాన్ని అందిస్తుంది. వర్షాధారిత పొలాలు నీటి సౌకర్యం ఉన్న పొలాలకంటే 30% తక్కువ దిగుబడినిస్తాయి. 1% ఉత్పత్తి పెరిగినా 0.65% పేదరికం తగ్గుతుందని 2011లో 'అనువర్తిత ఆర్థిక పరిశోధన జాతీయ మండలి' నివేదికలు తెలిపాయి. ఈ పరిస్థితులలో చిరుధాన్యాల పంటలు ఎంత ఉపయోగకరమో చెప్పనక్కర లేదు. చిరుధాన్యాల పునరుద్ధరణ పోషకాహార లోపాన్ని పరిష్కరించ గలదు. రైతులకు ఆర్థికంగా ఉపయోగపడ గలదు. అంతేకాదు ఇతర పంటలతో పోల్చితే ఇవి పర్యావరణానికి తక్కువ హాని కలిగిస్తాయి. అందుకే చిరుధాన్యాల పంటలను ప్రోత్సహించుదాం. వ్యవసాయాన్ని గిట్టుబాటు చేసుకుందాం. ఆర్థికంగా బాగుపడదాం. ✧

ఫర్టిగేషన్ పద్ధతి యాజమాన్యంలో కీలక అంశాలు :

ప్రతిరోజు ఫర్టిగేషన్ ద్వారా పోషకాలను అందించడం అత్యంత శ్రేయస్కరం. వీలుకాకపోతే వారానికి రెండుసార్లయినా ఫర్టిగేషన్ పెట్టుకోవాలి.

ఎంపిక చేసే రసాయనిక ఎరువు సాగునీటి నాణ్యతకు అనువుగా ఉండాలి. లేకుంటే అవక్షేపాలు ఏర్పడి డ్రిప్పర్లు మూసుకుపోతాయి.

సాగునీటిలో ఎక్కువ మోతాదు కాల్షియం, మెగ్నీషియం, సల్ఫేట్, ఇనుము లేదా మాంగనీసు గనక ఉంటే అవి ఎరువులతో చర్య జరిపి ఎరువుల సామర్థ్యాన్ని తగ్గిస్తాయని రైతులు గుర్తుంచుకోవాలి.

పంట యొక్క పోషకాల అవసరాల దృష్ట్యా సరైన ఎరువులను ఎంపిక చేసుకోవాలి. ఎంపిక చేసుకొనే ఎరువు పోషకాలను అందించడమే కాకుండా అవసరమైతే నీటి ఉదజని సూచికను కూడా సవరించేదిగా ఉండాలి.

ఒకే ట్యాంకులో కలిపిన వివిధ రసాయనిక ఎరువులు ఒక దానితో మరొకటి తేలికగా కలిసిపోయే స్వభావాన్ని కలిగి వుండాలి. మంచి దిగుబడులు సాధించడానికి క్లోరైడ్‌లు లేనటువంటి ఎరువులు ఎంపిక చేసుకోవాలి.

ఫర్టిగేషన్ పరికరం కంట్రోల్ హెడ్ యొక్క అంతర్భాగంగా నిర్మింపబడి వుంటుంది. ఇది సాధారణంగా రెండు ప్రధానమైన విడిభాగాలు - బైపాస్ ట్యాంక్ మరియు వెంచురీ ఇంజెక్టర్‌లను కలిగి ఉంటుంది. మధ్యస్థం నుండి లోతైన రేగడి భూముల్లో ఫర్టిలైజరు ట్యాంక్ పరికరాన్ని వాడుకోవాలి. తేలికపాటి భూముల్లో వెంచురీ ఇంజెక్టర్‌ను వాడుకోవాలి.

ఎరువుల వాడకం 15 నుండి 40 శాతం వరకు, రసాయనిక మందుల వాడకం 20 నుండి 30 శాతం వరకు, కూలీల అవసరం 10 నుండి 15 శాతం వరకు అలాగే 20 నుండి 23 శాతం యాంత్రిక శక్తి ఖర్చులు తగ్గుతాయి.

పంటకు సిఫార్సు చేసిన మొత్తం పోషకాలను పూర్తి పంట కాలంలో అందించే విధంగా రోజువారి మోతాదు లెక్కగట్టుకోవాలి.

నీటిలో కరిగే రసాయనిక ఎరువులు

నత్రజని : యూరియా (96-0-0)
అమ్మోనియా నైట్రేట్ (34-0-0)
అమ్మోనియం సల్ఫేట్ (20-6-0-0)
కాల్షియం నైట్రేట్ (16-0-0)
యూరియా అమ్మోనియా నైట్రేట్ (32-0-0)
పొటాషియం నైట్రేట్ (13-0-46)
మెగ్నీషియం నైట్రేట్ (11-0-0)
యం.ఐ.పి. (మోనో అమ్మోనియం ఫాస్ఫేట్ (12-61-0)

పొటాష్ : పొటాషియం క్లోరైడ్ (0-0-60)
పొటాషియం నైట్రేట్ (13-0-46)
పొటాషియం సల్ఫేట్ (0-0-50)
పొటాషియం థయోసల్ఫేట్ (0-0-25)
యం.కె.పి. (0-52-34) (మోనో పొటాషియం ఫాస్ఫేట్)

భాస్వరం :యూరియా ఫాస్ఫేట్ (17-44-0)
యం.ఎ.పి. (మోనో అమ్మోనియం ఫాస్ఫేట్) (12-61-0)
యం.కె.పి. (మోనో పొటాషియం ఫాస్ఫేట్) (0-52-34)
పాస్ఫారిక్ ఆసిడ్ (0-52-0)

	ఎరువుల వినియోగ సామర్థ్యం (శాతం)	
	సాంప్రదాయపద్ధతిశాతం	ఫర్టిగేషన్ శాతం
నత్రజని	30-50	95
భాస్వరం	20	45
పొటాష్	50	80

సూక్ష్మ పోషకాలు : FE EDTA (13%), Fe EDHA (6%), Fe DTPA (12%), 7n EDTA (9.1%), Ca EDTA (9.7%).

ఎన్.పి.కె. (19-19-19) కి మరియు (20-20-20)

ఈ సిఫార్సులను పాటించేటప్పుడు భూసారం, సాగునీరు, వేసుకున్న పంట రకం మరియు వాతావరణ పరిస్థితులకు సంబంధించిన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.

అరటి పంటకు ఫర్టిగేషన్ ద్వారా రోజువారి ఎరువుల యాజమాన్యానికి సిఫారసులు

ఎన్.పి.కె. (19-19-19) 200 కె.జి., మోనో పొటాషియం ఫాస్ఫేట్ (0:52:34) - 40కె.జి., పొటాషియం నైట్రేట్ (13:0:46) - 640 కె.జి., యూరియా (46:0:0) - 170 కె.జి.

అరటిలో రోజువారి ఎరువుల యాజమాన్యం : ఒక ఎకరా అరటి(గ్రాండ్ నైన్ వెరైటికి కావాల్సిన ఎరువులు మోతాదు.

చెరకు పంటకు ఫర్టిగేషన్ ద్వారా రోజువారి ఎరువుల యాజమాన్యం సిఫారసు			
	నీటిలో కరిగే రసాయనిక ఎరువుల మోతాదు (కి / ఎ / రోజుకు)		
	యూరియా (46-0-0)	యూరియా ఫాస్ఫేట్ (17-44-0)	మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (0.0-60)
నాటిన 20 నుండి 80 రోజులకు	0.2	0.5	-
నాటిన 81 నుండి 160 రోజులకు	0.2	0.5	0.1
నాటిన 161 నుండి 210 రోజులకు	0.24	-	0.3

	కావాల్సిన ఎరువులు	మొత్తం (కేజి /ఎకరం)	కేజీ/రోజుకి/ఎకరాకి
నాటిన 1 నుండి 45 రోజులకు	19:19:19	100	2.22
	13:0:46	80	1.77
	యూరియా	40	0.88
46 నుండి 90 రోజులకు	19:19:19	120	2.66
	18:0:46	80	1.77
	యూరియా	40	0.88
91 నుండి 135 రోజులకు	0:52:34	40	0.88
	13:0:46	12 లేదా 100	2.66 లేదా 2.22
	యూరియా	50	1.11
136 నుండి 180 రోజులకు	13:0:46	140 లేదా 100	3.11 లేదా 2.22
	యూరియా	40	0.88
181 నుండి 226 రోజులకు	13:0:46	140 లేదా 120	3.11 లేదా 2.22
227 నుండి 270 రోజులకు	13:0:46	12.లేదా 100	2.66 లేదా 2.22
271 నుండి 300 రోజులకు	13:0:46	80	2.66

పైన సూచించిన విధంగా ఎరువుల యాజమాన్యం ఆచరించి అరటిలో అధిక దిగుబడులను పొందవచ్చు. ఎరువులపై ఖర్చు తగ్గించుకునే భాగంగా మొత్తం భాస్వరాన్ని బేసల్, టాప్ డ్రసింగ్ ద్వారా మట్టికి అందించాలి. కావాల్సిన యూరియా, అమ్మోనియం సల్ఫేట్, పొటాష్‌ను ఫర్టిగేషన్ ద్వారా మొక్కకు అందించవచ్చు. ✧

పశుపోషణ రంగంలో
"జాతీయ పోషకాహారపు వారోత్సవాల" ప్రాముఖ్యత

సంకలనం: డా|| పూనూరు రవికాంత్‌రెడ్డి, ఎన్.టి.ఆర్. కాలేజ్ ఆఫ్ వెటరినరీ సైన్స్, గన్నవరం
డా||జక్కుల రాజు, పి.వి.ఎన్.ఆర్. యూనివర్శిటీ, హైదరాబాద్
డా|| డి. శ్రీనివాసకుమార్, సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్, కె.వి.కె. గుంటూరు, ఫోన్ : 7386247618 & 9701107022

సరైన ఆరోగ్యానికి మరియు శరీర దృఢత్వానికి సమతుల్య పోషణ అనేది చాలా అవసరం. ఆవులు, గేదెలలో అధిక పాల ఉత్పాదక సామర్థ్యానికి, గొర్రెలు మరియు మేకలు ఏపుగా పెరగడానికి వాటికి సరైన మేపు అందించాల్సివుంటుంది. ఎటువంటి జీవి జీవితంలోనైనా పోషణ అనే అంశం చాలా ముఖ్యమైనది. మనదేశంలో అటు మనుషులు, ఇటు పశువులు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న సంగతి విదితమే. దీన్ని దృష్టిలో పెట్టుకొనే భారత ప్రభుత్వం ప్రతీ సంవత్సరంలో సెప్టెంబరు మొదటివారాన్ని "జాతీయ పోషకాహారపు వారం"గా ప్రకటించింది. ఇందులో భాగంగా ప్రభుత్వం దేశ ప్రజలకు సమతుల్యపోషణ యొక్క ప్రాముఖ్యత తెలియజేయాలని వైద్యులను, పోషణాధికారులను మరియు వివిధ ఎన్.జి.ఓ. సంస్థలను కోరింది. ఈ దిశగా మనం మేపులోని మెళుకువలను మరియు దాని విశిష్టతను తెలుసుకోవడం చాలా అవసరం.


పశువుల శరీరాభివృద్ధి మరియు త్పాదక శక్తి నీరు, పీచు పదార్థం, పిండిపదార్థాలు, మాంసాకృత్తులు, కొవ్వు పదార్థాలు, విటమిన్లు మరియు ధాతువుల మీద ఆధారపడి వుంటుంది.

నీరు : పశువుల మొత్తం శరీరబరువులో 70 నుండి 80 శాతం వరకు నీరే వుంటుంది. నీరు శరీరంలోని అన్ని జీవక్రియలకు చాలా అవసరం. నీరు తక్కువైనపుడు వాటిలో నిర్జలీకరణ జరిగి ఆహారం తీసుకునే సామర్థ్యం గణనీయంగా తగ్గిపోవడమే కాకుండా శరీరంలోని ముఖ్యమైన విధులు విఫలమవుతాయి.

పీచు పదార్థం : తీసుకునే మేపులో పీచు పదార్థం ఆవులలో, గేదెలలో కనీసం 16 శాతం వరకు గొర్రెలు, మేకలలో అయితే కనీసం 14 శాతం వరకు ఉండాలి. లేకపోతే రక్తంలో ఆమ్లధర్మం పెరిగి ఆమ్లతత్వ జీర్ణ వ్యవస్థ సమస్యలు కలుగుతాయి. పీచు పదార్థం సూచించిన పాళ్ళలో గడ్డిని మేపడం వలన అందుతుంది.

పిండి పదార్థాలు : పశువులు తమకు కావాల్సిన శక్తిని 50 శాతం వరకు పిండి పదార్థాల జీవక్రియ నుండే సమకూర్చు కుంటాయి. ఒక గ్రాము పిండి పదార్థం ఒక పశువుకు 4 కిలోల కాలరీల శక్తిని అందిస్తుంది. వీటిలోపం కలిగితే పశువులలో శరీర బరువు తగ్గి, నీరసపడిపోవడమే కాకుండా, పాల ఉత్పత్తి తగ్గుతుంది. పిండి పదార్థాలు జొన్న, మొక్కజొన్న, రాగి, వరి, సజ్జలు, తవుడు మరియు మిగతా ధాన్యపు గింజలలో అధికంగా వుంటాయి.

మాంసకృత్తులు : శరీర నిర్మాణానికి, ఎదుగుదలకు, పాల ఉత్పత్తికి, రోగ నిరోధక శక్తి పెంపొందడానికి మాంసకృత్తులు దోహదపడతాయి. వీటి లోపం వలన పశువులు బక్కచిక్కిపోవడం, ఎదగక పోవడం, ఎదకు ఆలస్యంగా రావడం, వ్యాధుల ప్రాబల్యం పెరగడం జరుగు తాయి. మాంసకృత్తులు సోయా, చిక్కుడు, ఉలవలు, శనగలు మొద లగు పప్పుజాతి గింజల్లో మరియు నూనె తీసేసిన ప్రొద్దుతిరుగుడు, శనగ, సోయా, నువ్వులు, ఆవపు, పత్తి చెక్కలలో అధికపాళ్ళలో వుంటుంది.



క్రొవ్వు పదార్థాలు : పశువుల శరీరానికి కావాల్సిన శక్తిని అందిస్తూ, శరీరంలోని విటమిన్ 'ఎ' సరిగ్గా వినియోగపడడానికి దోహదపడతాయి. ఒకగ్రాము క్రొవ్వు పదార్థం 9 కిలో కాలరీల శక్తిని అంది స్తుంది. నీటిలోపం వలన నరాలకు

సంబంధిత వ్యాధులతో పాటు క్రొవ్వులో కరిగే విటమిన్లలోపం కలుగుతుంది. క్రొవ్వు పదార్థాలు ఎక్కువగా ప్రొద్దుతిరుగుడు, శనగ, సోయా, నువ్వులు ఆవ మరియు పత్తి చెక్కలలో లభ్యమవుతాయి. అలాగే ఉపమార్గము ద్వారా వెళ్ళే క్రొవ్వు పదార్థాలు మేపులో చేర్చడం ద్వారా పశువులలో పాల ఉత్పత్తి పెరుగుతుంది.

విటమిన్లు : కొవ్వులో కరిగే విటమిన్లు (ఎ.డి.ఈ.కె) మరియు నీటిలో కరిగే విటమిన్లు (బి-కాంప్లెక్స్, సి) శరీర జీవక్రియకు తోడ్పడతాయి. వాటి లోపం వలన పశువులు సరిగ్గా తినకపోవడం, బక్కచిక్కిపోవడం, చూపు మందగించడం లాంటి అనేక సమస్యలు కలుగుతాయి. వీటి లోపాన్ని సరైన పాళ్ళలో పశుగ్రాసాలు, కాయజాతి మరియు పప్పుజాతి ధాన్యాలు మేపులో అందేట్లు చూసుకోవడం మరియు పశువులను ఎండలో రోజుకు కొంతసేపు తిరిగేట్లు చెయ్యడం ద్వారా సరి చేసుకోవచ్చు.

ధాతువులు : పశువుల శరీరంలో జరిగే వివిధ జీవన క్రియలకు, స్రావాలకు (ఎంజైములకు) మధ్యవర్తిగా పనిచేస్తూ రసాయనిక సమతుల్యాన్ని నిలిపే 22 రకాల ఖనిజలవణాలు పశువులకు ఎక్కువ అవసరం ఉంటాయి. మేపులో ఉప్పు మరియు లవణ మిశ్రమము అందించడం ద్వారా వీటిలోపాన్ని సరిచేసుకోవచ్చు. అన్ని పశువులకి ఒకే రకమైన మేపు అందించకుండా శరీర బరువు ఆధారంగా నిర్వాహక మేపును మరియు ఉత్పాదక సామర్థ్యం ఆధారంగా ఉత్పాదక మేపును శాస్త్రీయ పద్ధతుల్లో అందించాలి.

మేపు పదార్థాలు	పొడి పదార్థము శాతం	జీర్ణమగు మాంసకృత్తులు	మొత్తం జీర్ణయోగ్యమైన పదార్థాల శాతం	కాల్షియం శాతం
ధాన్యాలు				
1. జొన్నలు	90	6.0	75.0	0.02
2. మొక్కజొన్నలు	90	7.0	80.0	0.02
3. చిరుధాన్యములు	90	7.0	75.0	0.02
నూనె చెక్కలు				
1. వేరుశనగ చెక్క	90	45.0	75.0	0.02
2. పత్తిగింజల చెక్క	90	25.0	75.0	0.28
3. నువ్వుల చెక్క	90	42.0	80.0	1.00
4. పొద్దుతిరుగుడు చెక్క	90	23.0	70.0	0.1
5. కొబ్బరి చెక్క	90	24.0	70.0	0.09
పరిశ్రమల ఉత్పత్తులు				
1. వరితవుడు	90	8.0	70.0	0.2
2. గోధుమ తవుడు	90	10.0	72.0	0.2
3. నూనె తీసిన వరి తవుడు	90	9.0	49.0	0.2
4. దాల్ చున్ని	90	7.0	64.0	0.4
పప్పుజాతి మేతలు				
1. బర్సీం, లూసెర్న్	15	14	65	2.0
2. జనుము, పిల్లిపిసర, అలసంద, అనుము	20	12	65	1.5
3. స్టైలో (హేమతా, స్కాబ్రసిరాట్రో)	20	12	65	1.5
4. సుబాబుల్, హెడ్జ్ లూసర్న్	25	15	60	1.5
ధాన్యపు జాతి పచ్చిమేతలు				
మొక్కజొన్న, జొన్న, సజ్జ మొ॥	20	4	55	0.5
బహువార్షిక పచ్చిమేతలు				
హైబ్రిడ్ నేపియర్, గినిగడ్డి, పారాగడ్డి	25	4	50	03
ఎండుమేతలు				
1. జొన్నదొప్ప	90	3	50	0.3
2. వరిగడ్డి	90	-	40	-

పశువుల మేతలో ఉపయోగించే పదార్థాల పోషక విలువల పట్టిక

వరిపంటను ఆశించే పురుగులు, తెగుళ్ళు మరియు కలుపు యాజమాన్యం

డాక్టర్ యన్. కృష్ణప్రియ, అగ్రి. పి.హెచ్.డి. వ్యవసాయ విస్తరణ విభాగం, యమ్. చంద్రశేఖర్ రెడ్డి, సైంటిస్ట్, లాం ఫారం, గుంటూరు.

పురుగుల యాజమాన్యం :

కాండం తొలిచే పురుగు

పురుగు సోకిన పిలకలు చనిపోతాయి. వెన్నులు తెల్ల కంకులుగా మారుతాయి. 5% మొవ్వులు చనిపోయిన ఎడల నస్యరక్షణ చేవట్టాలి. క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఫాస్ఫామిడాన్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా కార్బామ్ హైడ్రోక్లోరైడ్ 2.0 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

ఉల్లికోడు

నాటిన 10 నుంచి 15 రోజులకు ఎకరాకు 10 కిలోలు కార్బోఫ్యూడాన్ లేదా 5 కిలోలు ఫోరేట్ గుళికలు వేయాలి.

ఆకుముడత లేదా తెల్లతెగులు

క్లోరోపైరిఫాస్ 2 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా కార్బాన్ హైడ్రోక్లోరైడ్ 20 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. లేదా కార్బామ్ హైడ్రోక్లోరైడ్ 4 గుళికలు ఎకరాకు 10 కిలోలు వేయాలి.

సుడిదోమ / దోమపోటు

గోధుమవర్ణపు దోమ మరియు తెల్లమచ్చ దోమ వరిపైరును ఆశిస్తాయి. పిల్ల, పెద్ద దోమలు దుబ్బులు మొదళ్ళ దగ్గరవుండి రసం పీల్చుట వలన పైరు సుడులు సుడులుగా ఎండిపోతుంది. ప్రతి 2 మీటర్లకు 20 సెం.మీ. బాటలువదలాలి. ఇతోపిన్‌ప్రాక్స్ 1.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఇమిడాక్రోప్రిడ్ 0.25 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 22 మి.లీ. నీటికి కలిపి పిచికారి చేయాలి. లేదా ఎకరానికి కార్బోఫ్యూడాన్ 3డి గుళికలు 10 కి.లు వేయాలి.

కురి కంపనపల్లి / ఆకు నల్లి, / కంకినల్లి

ఆకునల్లి ఆశించినపుడు ఆకులలోని పత్రహరితాన్ని గోకి తినివేయుట వలన ఆకులు పాలిపోయి తెల్లని పిండి ఏర్పడుతుంది. కంకినల్లి వెన్ను అభివృద్ధి చెందే దశలో అండాశయాన్ని, పుప్పొడిని నష్టపరచుట వలన తాలుగింజలు ఏర్పడతాయి. ఈ పురుగును సస్యరక్షణ చర్యలు చేపట్టిన నష్టాన్ని చాలా వరకు తగ్గించవచ్చును. ఎండోసల్ఫాన్ 2 మి.లీ. లేదా క్లోరోపైరిఫాస్ టి2.5 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పచ్చదీపపు పురుగులు

ఇతోపిన్ ప్రాక్స్ 1.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఇమిడోక్లోప్రిడ్ (1.2 మి.లీ. లేదా ఎకరానికి కార్బోఫ్యూడాన్ 3డి గుళికలు 10 కిలోలు వేయాలి.


తెగుళ్ళ యాజమాన్యం :

అగ్గి తెగులు

ఆకులపై నూలు కండె ఆకారం గల గోధుమరంగు మచ్చలు ఏర్పడి, చివరి ఆకుల వరకు పూర్తిగా ఎండిపోయి తగులబడినట్లుగా కనిపించును. పైరు పూతదశలో వున్నపుడు వెన్ను, మెడభాగంలో ఈ తెగులు ఆశిస్తే మెడ విరిగి తాలు గింజలు ఏర్పడతాయి. కిలో విత్తనానికి 4 గ్రాముల కార్బండెజిమ్ -ఇ కలిపి విత్తనశుద్ధి చేయాలి. ట్రైసైక్లోజోల్ 75 శాతం 0.6 గ్రాములు లేదా ఎడిఫెన్ ఫాస్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పైరుపై పిచికారీ చేయాలి.

కాండం కుళ్ళు తెగులు

ఈ తెగులు అంకురమేర్పడే దశనుండి పైరు పాలు పోసుకొనే దశ వరకు వ్యాప్తి చెందే అవకాశముంది. ముందుగా దుబ్బులోని ఒక కర్ర లేదా పిలకలోని క్రింద వరుస ఆకులు పసుపురంగుకి మారుతాయి. మొదలు వద్దనున్న కణుపు లోపలి భాగం కుళ్ళిపోవుట వలన పైరు పాలు పోసుకొని గింజ గట్టిపడేదశలో కుళ్ళిన కాండం బలహీనపడి విరిగిపోతుంది. తెగులు సోకిన పొలంలో పరిశుభ్రత పాటించాలి. విత్తన శుద్ధి చేయాలి. తెగులు లక్షణాలను గుర్తించి వాలిడామైసిన్ (2 మి.లీ.) లేదా హెక్సాకొనజోల్ (2మి.లీ) లీటరు నీటికి కలిపిన ద్రావణాన్ని 15 రోజుల కొకసారి రెండుసార్లు పిచికారి చేయాలి.



టుంగ్రో వైరస్

ఈ తెగులు ఆశించిన మొక్కలను గుర్తించిన వెంటనే పెరికి నాశనం చేయాలి. రోగ వ్యాప్తికి కారణమైన పచ్చదీపపు పురుగులను నివారించాలి.

పొట్టకుళ్ళు తెగులు

ఈ తెగులు అంకురమేర్పడే దశనుండి పైరు పాలుపోసుకొనే దశ వరకు వ్యాప్తి చెందే అవకాశముంది. ముందుగా దుబ్బులోని ఒక కర్ర లేదా పిలకలోని క్రింద వరుస ఆకులు పసుపు రంగుకి మారతాయి. మొదలు వద్దనున్న కణుపు లోపలి భాగం కుళ్ళిపోవుట వలన పైరు పాలు పోసుకొని గింజ గట్టిపడే దశలో కుళ్ళిన కాండం బలహీనపడి విరిగిపోతుంది. తెగులు సోకిన పొలంలో పరిశుభ్రత పాటించాలి. విత్తనశుద్ధి చేయాలి. తెగులు లక్షణాలను గుర్తించి వాలిడామైసిన్ (2మి.లీ.) లేదా హెక్సాకొనజోల్ (2 మి.లీ.) లీ. నీటికి కలిపిన ద్రావణాన్ని 15 రోజులకొకసారి రెండుసార్లు పిచికారి చేయాలి.

టుంగ్రో వైరస్

ఈ తెగులు ఆశించిన మొక్కలను గుర్తించిన వెంటనే పెరికి నాశనం చేయాలి. రోగ వ్యాప్తికి కారణమైన పచ్చదీపపు పురుగులను నివారించాలి.

పొట్టకుళ్ళు తెగులు

పొట్టదశలో ఒకసారి 15 రోజుల తరువాత రెండవసారి లీటరు నీటికి 1 గ్రాము కార్బండజిమ్ కలిపి పిచికారి చేయాలి.

ఆకు ఎండు తెగులు


ఆకు అంచుల వెంబడి పసుపురంగు మచ్చలు ప్రారంభమై చివరకు ఆకులు పూర్తిగా ఎండిపోతాయి. మొక్కల క్రింద భాగాన ఆకులపై గోధుమరంగు కలిగిన మచ్చలు ఏర్పడి క్రమేపి పెద్దవై పాము పొడ వంటి మచ్చలుగా ఏర్పడతాయి. వ్యాధి సోకని పంట నుండి విత్తన సేకరణ, నత్రజని సిఫార్సు మోతాదులో ఎక్కువ దఫాలుగా విభజించి వేసుకోవడం, అవసరమైతే తెగులు తగ్గేవరకు నత్రజని వాడకాన్ని తాత్కాలికంగా నిలుపు చేయడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. నివారణకు ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా వాలిడామైసిన్ 2 మి.లీ. ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ + టెబుకొనజోల్ 0.4 ఒక లీటరు నీటికి కలిపి పొలంలో నీరు తీసివేసి మొదళ్ళ దగ్గర బాగా తడిచేటట్లు పిచికారి చేయాలి.

పొడ తెగులు / మానిపండు తెగులు

పైరు పుష్పించు దశలో ఆశిస్తుంది. అండాశయం ఆకుపచ్చరంగు ముద్దగా మారి, తర్వాత గింజలన్నీ పసుపురంగు ఉండలాగా మారి దిగుబడి తగ్గుతుంది. హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా వాలిడామైసిన్ 2 మి.లీ.ఒక లీటరు నీటికి కలిపి చల్లాక, మోనోక్రొటోఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

కలుపు యాజమాన్యం

✧ నారుమడిలో ఊద నిర్మూలనకు ఎకరా నారుమడికి బుటాక్లోర్



1.5 లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి,విత్తన 7 లేక 8వ రోజున మడిలో నీటిని తీసివేసి పిచికారి చేయాలి లేదా విత్తన 14, 15 రోజులప్పుడు సైహాలోఫాప్ బ్యుటైల్ 10% 400 మి.లీ. 200 లీటర్లు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

✧ మాగాణి వరిలో ఊద మొదలైన ఏకవార్షిక గడ్డిజాతి మొక్కలు ఉన్నపుడు బ్యుటాక్లోర్ 50% 1 నుండి 1.5 లీ. లేదా అనిలోఫాస్ 30% 500 మి.లీ. లేదా ప్రిటిలాక్లోర్ 50% 500 మి.లీ. లలో ఏదో ఒకదానిని ఎకరాకు 25 కిలోల పొడి ఇసుకలో కలిపి నాటిన 3 నుండి 5 రోజులలో పలుచగా నీరు పెట్టి సమానంగా వెదజల్లాలి. ఎకరాకు 35 నుండి 50 గ్రా. ఆక్సాడయార్జిల్ 80% పొడి మందును 500 మి.లీ. నీటిలో కలిపి, ఆ ద్రావణాన్ని ఎకరాకు 20 కిలోల పొడి ఇసుకలో కలిపి నాటిన 3 నుండి 5 రోజుల్లో పలుచగా నీరు ఉంచి సమానంగా వెదజల్లాలి.

✧ గడ్డి, తుంగ, వెడల్పాటి ఆకు మొక్కలు సమపాళ్లలో ఉన్నప్పుడు ఎకరాకు 4 కిలోల బ్యుటాక్లోర్ 5% గుళికలు మరియు 4 కిలోల 2,4-డి ఇథైల్ ఎస్టర్ 4 % గుళికలు, 20 కిలోల పొడి ఇసుకలో కలిపి నాటిన 3 నుండి 5 రోజుల్లో పలుచగా నీరు వుంచి సమానంగా వెదజల్లాలి.

✧ వరినాట్లు వేసిన 8-10 రోజుల తర్వాత కూడా పైరజోసల్ఫ్యూరాన్ 5% డబ్ల్యు.పి. ఎకరాకు 80 గ్రాములు లేదా 15 రోజుల తర్వాత కూడా ఇథాక్సి సల్ఫ్యూరాన్ 15% డబ్ల్యు.డి.జి. ఎకరాకు 50 గ్రా. చొప్పున 200 లీటర్ల నీటికి కలిపి పొలంలో నీటిని తీసివేసి సమానంగా పిచికారి చేసి కలుపు నివారణ చేయవచ్చును.

✧ నాటిన 25-30 రోజులప్పుడు పొలంలో వెడల్పాటి కలుపు మొక్కల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఎకరాకు 400 గ్రా. 2.4-డి సోడియం సాల్ట్ 80% పొడి మందును 200 లీ. నీటిలో కలిపి పొలంలో నీటిని తీసివేసి కలుపుపై పడేటట్లు పిచికారి చేయాలి. ✧

గ్రామీణ మహిళలకు పెరటితోటల పెంపకం విశిష్టత మరియు ఉపయోగాలు

టి. ఆశాలత, డా॥ సిహెచ్. వరప్రసాదరావు మరియు రవి వెంకన్నబాబు, కృషి విజ్ఞాన కేంద్రం, దరిశి

పెరటి మొక్కలు అంటే? ఏమిటంటే మన పెరడులో లేక ఇంటి ప్రక్కన వదిలేసిన స్థలంలో ఆరోగ్యకరమైన కూరగాయలు మరియు ఇంటికి అవసరం అయ్యేవి పెంచడం.

సామాన్యంగా ఇంటిలో మొక్కలు పెంచడం అనేది ప్రతీ మహిళలకు ఆశక్తికరమైన విషయం, కానీ సరైన అవగాహన లేక ఏ మొక్కలు ఎక్కడ వేయాలో, ఎక్కడవేస్తే మంచి దిగుబడి వస్తాయో, ఎలాంటి పోషక పదార్థాలు అందించాలో తెలియక ఇబ్బంది పడతారు మరియు ఎలాంటి మొక్కలు వేస్తే మన ఆరోగ్యం కాపాడుకోవచ్చో, వాటి వలన ఎలాంటి ఆదాయం పొందవచ్చు అనేది కూడా తెలుసుకోవాలి.

గ్రామీణ ప్రాంతాలలో తక్కువ ఆదాయం వున్న కుటుంబాల వారు పోషకాహార లోపాల వలన రోగాలు పాలవుతున్నారు. కాబట్టి ప్రతీ వ్యక్తి కనీసం 85 గ్రా. పండ్లు, 75-125 గ్రా. ఆకుకూరలు, 85 గ్రాం. ఇతర కూరగాయలు, 85గ్రా. దుంపకూరలు ప్రతీరోజూ తీసుకుంటే మన శరీరానికి అవసరమయ్యే పోషకపదార్థాలన్నీ సమకూర్చుకోవచ్చు. మనదేశ జనాభాలో అధికశాతం మంది తీసుకోవలసిన మోతాదుకంటే తక్కువ తీసుకుంటున్నారు. దీని వలన విటమిన్ 'ఎ' లోపం వలన రే చీకటి మరియు పూర్తి అంధత్వం రావచ్చు. ఇనుము లోపం వల్ల రక్తహీనత, విటమిన్ 'బి' లోపం వల్ల ఆకలి మందగించడం, జీర్ణశక్తి నశించడం, నాలుకపై పూత లాంటివి ఏర్పడడం జరుగుతూ వుంటుంది.


ఇక గర్భిణీ స్త్రీలలో పోషకాహార లోపాలు సాదారణంగా కనిపిస్తుంటాయి. ఇవన్నీ కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు తగిన మోతాదులో తీసుకోవడం ద్వారా వాటిని నివారించవచ్చు. అదే మన ఇంటి పెరటిలో కూరగాయలు వేసుకుంటే ఎప్పుడూ మనకు అందుబాటులో వుంటాయి, ఇక మందులు ప్రభావం లేని స్వచ్ఛమైన ఆహారం తినవచ్చు. మరియు ఖర్చు కూడా తగ్గుతుంది.



పెరటితోట వేయవలసిన మొక్కలు మరియు స్థల విభజన :

ముందుగా ఎలాంటి కూరయగాలు ఇంటిలో ఇష్టపడి తింటారో ఆలోచించి కూరగాయలు అనుసారంగా స్థలాన్ని వివిధ మడులుగా విభజించుకోవాలి. మొక్కలు వేశాక స్థలం అందరికీ నడిచే వీలుగా వుంటుందా, నీటి సరఫరా బాగుందా కూడా ఆలోచించి మడులు ఏర్పాటు చేసుకోవాలి. మంచినీటిని పొదుపు చేస్తూ వంటగది నీరు, మరియు స్నానపు వృధా నీరు మన ఇంటిపెరటికి మళ్ళించవచ్చు. స్థలం చుట్టూ ముళ్లకంచెలు ఏర్పాటు చేసుకుంటే మంచిది.

కూరగాయలు అనుసారంగా స్థల విభజన :



స్థల విభజన కూరగాయలు పెరిగే కాలాన్ని బట్టి, మరియు ఎత్తు, గుబురును బట్టి విభజించుకోవాలి.

తీగజాతి కూరగాయలు : కాకరా, చిక్కుడు, సొర, దోస, దొండ, వగైరా వంటివి కంచె/మిద్దెపైన ప్రాకించవచ్చు.

దుంపజాతి కూరగాయలు : క్యారెట్, ముల్లంగి, బీట్‌రూట్, చామగడ్డ, బంగాళదుంపలు లాంటివి బెడ్‌లు/ మడులు లాంటివి తయారు చేసి మధ్యలో లేక అనువైన స్థలంలో నాటుకోవాలి.

ఎత్తుగా, ఎక్కువకాలం మొక్కలు : మునగ, కరివేపాకు, మామిడి, అరటి, బొప్పాయి, నిమ్మలాంటివి పెరటిలో ఒక ప్రక్కగా, చివరలో నాటుకోవాలి. వాటినీడ ప్రక్కనవున్న చిన్న మొక్కల ఎదుగుదలపై పడకుండా వుంటుంది.

ఆకుకూరలు మరియు కూరగాయలు : 3-4 వారాల మొక్కలు

మొక్కలపై జరుగుతున్న పరిశోధనలు



సైన్స్ చక్రవర్తి
సి.వి. సర్వేశ్వరశర్మ

మనం 'టచ్-మీ-నాట్' అనే పేరు గల మొక్కను వేలితో ముట్టుకుంటే చాలు తమాషాగా దాని ఆకులు ముడుచుకు పోతాయి. అందుకే దాన్ని 'నన్ను ముట్టుకోకు' అనే అర్థం వచ్చే పేరు పెట్టారనిపిస్తుంది.

ఒక్క ఆకును ముట్టుకుంటే చాలు ఆకుతోపాటు ఆరెమ్మలోని ఆకులన్నీ ముడుచుకుపోతాయి. పైగా మొక్క అంతా చైతన్యం కోల్పోయినట్లు వాలిపోతుంది. ఇలా ఎందుకు జరుగుతుంది? అనేది ప్రశ్న.

ఒక ఆకునుండి మరొక ఆకుకు ఇవి ఎలా సందేశాలు పంపుతున్నాయి? అనేది పరిశోధకులకు ఒక మిస్టరీగా ఉండేది. కొంతమంది పరిశోధకుల అభిప్రాయం ప్రకారం ఇవి ఒక ఆకు నుండి మరొక ఆకుకు విద్యుత్ సంకేతాలు పంపుతున్నాయని, కాని ఇటువంటి లక్షణం వాటికి ఎలా వచ్చింది? అనేది మరొక ప్రశ్న.

'బహుశా మొక్కలన్నింటిలోనూ సిగ్నలింగ్ సిస్టమ్ ఉంటుం దని దాని కారణంగానే ఆకులు ముడుచుకుపోతూ వుంటాయి' అనికొంతమంది పరిశోధకులు భావన. అయితే "కొన్ని మొక్కలు మాత్రమే ఈ సిస్టమ్ ప్రభావాన్ని బహిర్గతంగా చూపుతాయని మిగిలిన మొక్కల్లో ఇది అంతర్గతంగానే వుండిపోతుందని' వారి భావజాలానికి వివరణలు ఇచ్చారు.

ఈ సిగ్నలింగ్ సిస్టమ్‌ను 'యాక్షన్ పొటన్షియల్' అని అంటారని కూడా స్పష్టం చేశారు. ఇటువంటి భావనలకు ఆధారాలు కూడా వున్నాయి.

పరిశోధనలు :

పరిశోధకుల పరిశోధనల ఫలితాలు శాస్త్రవేత్తల భావనలకు దారి తీశాయి. అతి సాధారణంగా కన్పించే టొమాటో మొక్కలో ఒక అసాధారణ గుణం శాస్త్రవేత్తలు గుర్తించారు.

టొమాటో మొక్కమీద ఒక ఆకుపై క్రిమికీటకం ఏదైనా వాలి దానిని ఆశించి ఆ ఆకును తింటున్నట్లయితే,ఆ మొక్క వెంటనే ప్రతిస్పందిస్తుంది. మొక్కలోని ఇతర ఆకులన్నింటికి హెచ్చరిక సంకేతాలు పంపిస్తుంది.

దానితో క్రిమికీటకాల దాడికి గురికాని ఆకులు ఆ సంకేతాలు అందుకుని, కొన్ని రసాయన పదార్థాలు ఉత్పత్తి చేస్తాయి. ఈ రసాయన పదార్థాలే కదలలేని ఆ మొక్కలకు ఆత్మరక్షణ దళాలు అవుతాయి. పొరబాటున ఇటువంటి ఆకుల్ని ఆ క్రిమికీటకాలు తిన్నాయంటే ఆ ఆకుల్ని అవి జీర్ణం చేసుకోలేవు. ఫలితంగా వాటిదాడి నిష్ప్రయోజనం అవుతుంది. ఈ పరిశోధన ఫలితంగా జంతువులకు మొక్కలకు చాలా సన్నిహిత పోలికలు వున్నాయని తెలుసుకున్నారు.

మొక్కలు - జంతువులు :

మొక్కలకు- జంతువులకు పోలికలు వున్నాయని చాలాకాలంగా పరిశోధకుల దృష్టిలో వున్న విషయమే. ఎందుకంటే

అంటే పొదీనా, కొత్తిమీర, తోటకూర, గోంగూర, మెంతికూర, టొమాటో, వంగ, మిరప, క్యాబేజీ, కాలీఫ్లవర్ వంటివి స్థలముకు నడిచే దోవలో లేదా మధ్యలో వేసుకొనవచ్చును.

కంపోస్ట్ విభాగము : ఒక ప్రక్కన చివర్లలో ఒక గుంతను ఏర్పాటు చేసి, ఎండుటాకులు, మరియు ఇంటిలో పడవేసిన తినే వ్యర్థపదార్థాలను ఈ గుంతలో వేసి రెండు వారాల పాటు నీరు చల్లుతూ కుళ్ళనిచ్చి, వాటిలోకి వానపాములను వదిలి స్వచ్ఛమైన సేంద్రీయ ఎరువును తయారు చేసుకోవాలి. వాటిని నెలకు ఒకసారి చెట్ల మొదలులో వేస్తే మొక్కలు ఆరోగ్యంగా, మంచి పూలు, పండ్లు మరియు కూరగాయలను మనకు అందిస్తాయి.

పెరటితోటల పెంపకం ఉపయోగాలు :

✧ ధరలు విపరీతంగా పెరుగుతున్న ఈ సమయంలో ఇలా కూరగాయలు పెరటితోటలో పండించుకోవడం వలన ఖర్చు తగ్గించుకొని మిగులు కూరలను అమ్మడం ద్వారా అధిక ఆదాయం / స్వయం ఉపాధి పొందవచ్చు.

✧ కుటుంబ సభ్యులందరూ కలిసి పెరటితోటలో పనిచేయడం ద్వారా వ్యాయామం, మానసిక ఉల్లాసం, పనిఒత్తిడి తగ్గి ప్రశాంతత లభిస్తుంది.

✧ మన కుటుంబ సభ్యులకు పురుగుమందుల అవశేషాలు లేనివంటి పోషక విలువలు కలిగివున్న రుచికరమైన కూరగాలయనుమన పెరటిలోనే పెంచి, వండి వడ్డించవచ్చు.

✧ మన ఇంటి దగ్గర వున్న ఖాళీ స్థలాన్ని ఉపయోగించుకొని మన ఇంటి దగ్గర వున్న ఖాళీ స్థలాన్ని ఉపయోగించుకొని మన ఇంటి పనులకు ఉపయోగించిన నీరు వృధాగా పోనివ్వక, మడులకు మరలించడం ద్వారా మంచి నీరు పొదుపు చేయవచ్చు.

✧ పెరటితోటల్లో గత సంవత్సరం పండించిన పంటలోని విత్తనాలను దాచి, వాటిని జాగ్రత్తగా భద్రపరచి ప్రస్తుత సంవత్సరానికి వాడుకోవచ్చును.

ఇది ప్రతీరోజు ఇంటిల్లపాది ఒక క్రమబద్ధమైన అలవాటు తెస్తుంది. మరియు ఆరోగ్యం, ఆనందాన్ని ఇస్తుంది. ✧

జంతువుల్లో ఒక పద్ధతిని గమనించి దానికోసం మొక్కల్లో వెతుకుతుంటే అదికూడా గుర్తించగల్గుతున్నారు.

జంతువుల్లో వుండే 'నెర్వస్ ఇంపల్స్' వంటివి మొక్కల్లో అంతవేగవంతంగా వుండవు. అంటే జంతువుకు శత్రువు ఎదురయితే తక్షణమే స్పందించి అది కాలికి పనిచెప్పి వేగంగా పరుగులు తీస్తుంది. మొక్కల్లో ఇటువంటి ప్రతిస్పందన వుంటుంది కాని చాలా ఆలస్యంగా వుంటుంది.

మొక్కల్లోని జీవకణాల మధ్య సమాచార బంధాలు ఎలా ఏర్పడతాయి? ఈ అంశంమీద పరిశోధనలు కొత్త పుంతలు తొక్కుతోంది. ఇంతకుపూర్వం మొక్కల్లో 'విద్యుత్ సంకేతాలు' గురించి పరిశోధనలు దాదాపు లేవనే చెప్పుకోవాలి.

మొక్కల్లో సంకేతాలు ప్రయాణం గురించి పరిశోధకులకు ఎక్కువ సమాచారం తెలియదు. ఆ దిశలో పరిశోధనలు చేయడానికి అంత సుముఖంగా కూడా వుండేవారు కాదు. కాని క్రమంగా పరిస్థితి మారుతోంది.

దాదాపు నలభయి అయిదు సంవత్సరాల క్రితమే మొక్కల్లో ఉండే ఆత్మరక్షణ శక్తుల గురించి పరిశోధనలు చేయడం మొదలు పెట్టారు. ఆరోజుల్లోనే ఒక శాస్త్రవేత్త టొమాటో మొక్కల మీద పరిశోధనలు చేసి వాటిలో 'ప్రొటీనేజ్ ఇన్‌హిబిటర్స్' అనే రక్షణ అణువులు వుంటాయని గుర్తించాడు.

ఒక కీటకంటొమాటో మొక్కమీద దాడిచేస్తే దూరంగా ఉండే ఆకుల్లో ఈ అణువులు ఉత్పత్తి అవుతాయి. ఆ క్రిమికీటకం గనుక ఈ ఆకుల్ని తింటే, ఇవి ఆ కీటకం కడుపులో జీర్ణ సంబంధమైన ఎంజైములకు అతుక్కుపోతాయి. దీనివల్ల ఆక్రిమి ఈ ఆకులను జీర్ణం చేసుకోలేదు. దానితో ఆ క్రిమి జీవనానికి కావలసిన పోషకాలు అందవు.

ఇంతవరకు బాగానే వుంది. కాని ఆకునుండి ఆకుకు అణువుల ఉత్పత్తిని గురించి సందేశం ఎలా అందుతోంది? అనేది ఎవరికి తెలియరావటం లేదు.

ఆమోదించడం లేదు!

మొక్కలపై పరిశోధనలు చేసేవారికి 'ఎలక్ట్రికల్ సిగ్నలింగ్' పై సదభిప్రాయం లేదు. 'మొక్కలకు గల ఈ ధర్మాల'పై పరిశోధనలు చేసేందుకు పెద్దగా మక్కువ చూపించడం లేదు.

ఖగోళ శాస్త్రవేత్తలకు ఖగోళశాస్త్రం అంటే ఎంతో ఇష్టం. కాని జ్యోతిష్యం అంటే వారికి అసలు పడదు. అదేవిధంగా వృక్షవిజ్ఞాన శాస్త్రవేత్తలకు 'ఎలక్ట్రికల్ సిగ్నలింగ్' అంటే జ్యోతిష్యం లాంటిదే అనే భావన వుంది.

ఇటీవల కాలంలో ఎలక్ట్రికల్ సిగ్నలింగ్ ఏఏ మొక్కల్లో కానవస్తున్నది పరిశోధనలు మొదలు పెట్టారు. జంతువుల్లో అతిదిగువస్థాయిలో వున్న హైడ్రా, జెల్లీఫిష్ వంటి వాటిలో కానవచ్చే 'నాన్-నెర్వ్‌సిగ్నలింగ్' వంటిదే బహుశా టొమాటో మొక్కల్లో కాన వచ్చే ఎలక్ట్రికల్ సిగ్నలింగ్ కావచ్చునని కొంతమంది అభిప్రాయం.

విశిష్టమైన గుణాలు :

మొక్కల్లో కొన్ని విశిష్టమైన గుణాలు వున్నాయి. ఇవి వాటి రోగ- నిరోధక శక్తికి సంబంధించినవి. కొన్ని రకాల మొక్కలు ఒక రకమైన తెగులు లేదా చీడ, పీడలకు లోనయి దెబ్బతింటే మరికొన్ని రకాల మొక్కలకు అసలు అవి సోకడమేలేదు. ఇదొక ఆశ్చర్యకరమైన విషయం.

సాధారణంగా తెగుళ్ళు, చీడలు పీడలు వంటి వాటికి అవి సోకడానికి ఆమొక్కా, ఈ మొక్కా అనే విచక్షణ వాటికి ఉండదు. అవి అన్నింటిని ఆశించడానికి ప్రయత్నిస్తాయి. అంటే కొన్ని మొక్కలకు ఈ తెగుళ్ళు, చీడ, పీడలను తట్టుకొనే శక్తి వుంటుంది.

కొంచెం వివరంగా చెప్పుకోవాలంటే ఒక పియర్ చెట్టును నాశనం చేయగల శక్తి వుండే బ్యాక్టీరియా, పొగాకు మొక్కల మీద ఏ ప్రభావం చూపలేకపోవడం విశేషం.

పొగాకు మొక్కలు :


పొగాకుకు ఎన్నో అంశాలు మేలయినవి వున్నాయి. మొక్కల శక్తియుక్తుల గురించి పరిశోధనలు చేసేవారికి పొగాకు మొక్కలంటే ఎక్కువ మక్కువ చూపుతారు. ఎన్నోరకాల తెగుళ్ళు, చీడపీడలను అది తట్టుకోగలదు.

విల్ట్ తెగులుకు కారణం అయ్యే ఒక బ్యాక్టీరియా మీద ప్రయోగాలు చేస్తుండగా పరిశోధకులు ఆ బ్యాక్టీరియాలో 'శక్తివంతమైన పరిమళాలు' వున్నట్లు గుర్తించారు. ఇవి మనం మామూలుగా భావించే పరిమళాలు కావు. ఇవన్నీ ఒకరకమైన రసాయన పదార్థాలు.

ఈ బ్యాక్టీరియా ఏదైనా ఒక మొక్కను ఆశించగానే అది 'ఇక్కడ తగినంత ఆహారం వుంది అందరూ ఇక్కడికి రండి' అని తన వారికి సందేశం పంపించే విధంగా విడుదలచేసే పరిమళాలు వుంటాయి.

పరిశోధకులు 'ఎర్విసియా అమిలోవోరా' అనే బ్యాక్టీరియాలో ఒక మాలిక్యూల్‌ను వేరు చేయగలిగారు. ఈ మాలిక్యూల్‌ను 'హుర్టిన్'గా పిలుస్తున్నారు. ఈ మాలిక్యూల్ ఒకటి ఉంటేచాలు. అది ఆ బ్యాక్టీరియా కనుచూపుమేరలో లేకున్నా కూడా దానిని ఎదుర్కొనడానికి వీలుగా, ఆ మొక్కకణంలో ఆ భాగాన్ని ఆత్మరక్షణ ప్రక్రియగా నాశనం అయిపోమని ఆజ్ఞాపిస్తుందని తేలింది.

ఈ 'ఎర్విసియా అమెలోవోరా' బ్యాక్టీరియాకు, మనుషుల్లో ప్లేగు, డయేరియా వంటివి కలుగజేసే బ్యాక్టీరియాకు సంబంధం వుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. గతంలో మనుషులకు సంక్రమించే వ్యాధుల్ని కలుగజేసే బ్యాక్టీరియాకు, మొక్కలకు తెగుళ్ళు, చీడపీడల్ని కలుగజేసే బ్యాక్టీరియాకు ఏ సంబంధం లేదని భావిస్తున్నదంతా అర్థరహితమని తేలింది. పైగా మొక్కలనుండి మనుషులకు కూడా కొన్ని వ్యాధులు సంక్రమించే ప్రమాదం వుందని స్పష్ట మవుతోంది. తక్కువ జాతి జీవుల్లోంచి పైజాతి జీవుల్లోకి వ్యాధులు సంక్రమించేం దుకు జన్యు పరమైన అడ్డుకట్టలు వున్నా కొన్ని రకాల బ్యాక్టీరియా లకు వాటిని అధిగమించే శక్తి వుందని స్పష్టమవుతోంది. ✧



యన్.వి.యస్. వర్మ
వ్యవసాయ సహాయ సంచాలకులు (రిటైర్డ్)
నరసాపురం


ఔషధకారిణిగా బెల్లం ప్రత్యేకత

బెల్లం ఆహార పదార్థములకు రుచి నివ్వడంతో పాటు ఆరోగ్యానికి కూడా మేలు కలుగజేస్తుంది. ఆరోగ్యపరంగా పంచదార కన్న బెల్లం శ్రేష్టం అని పరిశోధనలు తెలియజేస్తున్నవి. వాణిజ్య పరంగానూ మరియు ఆరోగ్యపరం గానూ బెల్లంను మెడిసినల్ చక్కెర అంటారు. పంచదార వలె బెల్లంలో ఎక్కువ పరిమాణము, హానికర రసాయనాలు అందుబాటులో వుండవు. బెల్లంతో అందుబాటులో వున్న పోషకముల వలన పిల్లలలో జీర్ణ సంబంధిత సమస్యలు మరియు రక్తహీనత అదుపులో వుంటాయి.

బెల్లంలో అందుబాటులో వున్న ఇనుము రక్తంలో హిమోగ్లోబిన్ శాతం తక్కువ కాకుండా నియంత్రించ గలుగుతుంది.

బెల్లం తినడం వలన పసిపిల్లలలో జీర్ణక్రియ మెరుగవుతుంది. బెల్లంలో అందుబాటులో వున్న మినరల్స్ జీర్ణక్రియకు తోడ్పడే ఎంజైముల ఉత్పత్తికి సహాయపడతాయి. వ్యాధి నిరోధక శక్తికి తోడ్పడే యాంటీ ఆక్సిడెంట్లు పెరుగుదలకు సహాయపడతాయి.

బెల్లంలో అందుబాటులో వుండే జింకు మరియు సెలీనియం వంటి పోషకములు ఎక్కువగా ఉంటాయి.



పోషకములు :

ప్రతి 100 గ్రాములు బరువుగల బెల్లంలో మినరల్ సాల్ట్ 28 మిల్లీగ్రాములు, శక్తి 383 కేలరీల వరకు అందుబాటులో వుంటుంది. ముడిపదార్థములు 95 గ్రాముల వరకు అందు బాటులో వుంటాయి.

ప్రతి 100 గ్రాముల బరువుగల బెల్లంలో, కాల్షియం 80 మి.లీ. గ్రాములు, భాస్వరం 40 మి.లీ. గ్రాములు, ఇనుము 2.6 మి.లీ. గ్రాముల వరకు అందుబాటులో వుంటాయి.

బెల్లంలో అందుబాటులో వున్న కాల్షియం మరియు భాస్వరం పిల్లల ఎదుగుదల మరియు ఎముకలు బలంగా ఉండటానికి సహాయపడతాయి. బెల్లంలో అందుబాటులో వున్న మెగ్నీషియం నాడీవ్యవస్థను బలోపేతం చేస్తుంది.

బెల్లంలో అందుబాటులో ఉన్న పొటాషియం కణాలలోని ఆమ్లత్వమును నియంత్రించగలవు. బెల్లంలో అందుబాటులో వున్న పొటాషియం కణాలలో ఏర్పడిన అసిటాన్లు మరియు ఆమ్లములపై దాడిచేసి ఆమ్ల సమానత్వానికంతవరకూ నియంత్రించగలుగుతుంది. భోజనం తిన్న వెంటనే కొద్దిగా బెల్లం ముక్క తినడం వలన శరీరంలో అధికంగా వున్న అసిడిటీని చాలా వరకు నియంత్రించ గలదు. అటువంటి ప్రయోజనాల వలన బెల్లంను మెడిసినల్ సుగరుగా వ్యవహరిస్తారు. ప్రత్యామ్నాయంగా గ్లాసుపాలలో కొద్దిగా పంచదార బదులు బెల్లంముక్క కలిపి ప్రతిదినం ఉదయంపూట పరగడుపున త్రాగితే బహిష్టు సమస్యలతో బాటు నెలసరి సమస్యలు చాలా వరకు తగ్గుతాయని పరిశోధనలు తెలియజేయుచున్నవి.

బెల్లం మరియు నెయ్యి సమపాళ్ళలో కలిపి ప్రతిదినం ఉదయం పూట తినడంవలన తలనొప్పి సమస్యలు చాలావరకు నియంత్రించబడుతాయి. ముక్కునుండి నీరు కారి బాధపడే మహిళలు ప్రతిదినం ఉదయం మరియు సాయంత్రం సమయంలో భోజనం చేసినవెంటనే తినడం వలన కొంతవరకూ ఉపశమనం కలుగుతుంది. వివిధ శరీర భాగాలలో నొప్పితో బాధ పడే మహిళలు నెయ్యి మరియు బెల్లం సమ పాళ్ళలో కలిపి వేడి చేయాలి. చల్లారిన తరువాత పైపూతగా నొప్పిగా ఉన్న ప్రదేశంలో పైపూతగా లేపనం చేయడం వలన కొంతవరకూ బాధనుండి ఉపశమనం కలుగుతుంది.

బెల్లం శరీరంలో ఆమ్లత్వ పరిస్థితులు ఎక్కువగా ఉన్నప్పుడు లేదా కడుపులో మంటగా వున్నప్పుడు, బెల్లంతో తయారు చేసిన వంటకాలు తినడం ఆరోగ్య రీత్యా మంచిది. పొడిదగ్గుతో ఇబ్బందిపడినపుడు గ్లాసు బెల్లం పానకంలో కొద్దిగా (4 నుండి 5) తులసి ఆకులు కలిపి ప్రతిరోజా ఉదయం మరియు సాయంత్రం పూట త్రాగితే వెంటనే ఉపశమనం కలుగుతుంది. అజీర్తి సమస్యలు ఎక్కువగా వున్నపుడు భోజనం చేసిన తరువాత చిన్న బెల్లంముక్క నోట్లో వేసుకుని చప్పరిస్తే జీర్ణవ్యవస్థ మెరుగు పడుతుంది. అజీర్తి సమస్యల నుండి ఉపశమనం కలిగించి జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది.

కాకర ఆకులు 4, వెల్లుల్లి రెబ్బల రెక్కల 4, మిరియాల గింజలు 4 చిన్న బెల్లంముక్క సుమారు 10 గ్రాములతో కలిపి గ్రైండు చేసిన మిశ్రమాన్ని ప్రతిదినం ఉదయం మరియు సాయంత్రం పూట వారం రోజులు తినాలి.

బెల్లంతో అందుబాటులో వున్న రకాలు :

సాధారణ పరిస్థితులలో చెరకురసం నుండి మొలాసిస్‌ను బయటకు తీసిన తరువాత బెల్లం తయారు చేయబడుతుంది. సాధారణ పరిస్థితులలో ఇటువంటి బెల్లం ఎక్కువగా ఉపయోగించుట ఆరోగ్యరీత్యా మంచిది. ప్రత్యామ్నాయంగా తాటికల్లు, ఈతకల్లు లేదా ఖర్జూరం నుండి బెల్లం తయారు చేయబడుతున్నది.

పురుగు మందుల అవశేషాలను తగ్గించుకోవడంలో మెళకువలు

దుమాల శ్రావణి (కీటక విభాగ శాస్త్రవేత్త), సిహెచ్. వరప్రసాదరావు (ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్), కృషి విజ్ఞాన కేంద్రం, దరిశి

పురుగు, తెగులు మరియు కలుపు నివారణ మందులు విచక్షణా రహితంగా పంటలపై వాడటం మూలాన వాటి అవశేషాలు కొన్ని సంవత్సరాల వరకు విచ్ఛిన్నం కాకుండా వుంటాయి. మనం తినే వ్యవసాయ ఉత్పత్తులలో వీటి అవశేషాలు వుండటం వల్ల ప్రతిరోజూ కొంత సూక్ష్మ మొత్తాల్లో మన శరీరంలోకి ప్రవేశిస్తాయి. అంతేకాకుండా పర్యావరణంలో అన్ని రకాల ప్రాణులపై కూడా ఈ అవశేషాలు రక్తము మరియు కొవ్వు పదార్థాలతో పేరుకుపోవటం వల్ల అనేక రకాల దీర్ఘకాలిక రుగ్మతలను కలగజేస్తాయని పరిశోధనల్లో తేలింది. ముఖ్యంగా క్యాన్సర్, శిశుమరణాలు, గుండె జబ్బులు, అంగవైకల్యం లాంటి విషప్రభావాలు ప్రపంచ వ్యాప్తంగా గమనించడం జరిగింది. పర్యావరణంలో వివిధ రకాల ప్రాణులు ముఖ్యంగా పక్షులు ఈ అవశేషాల బారినపడి అంతరించి పోవటం కూడా విదితమే. అందుచేత ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ పురుగు నివారణ శక్తి కలిగి తక్కువ రోజులు పర్యావరణంలో వుండి, మానవ ఆరోగ్యంపై తక్కువ ప్రభావం గల పురుగు మందుల అన్వేషణలో భాగంగానే ఈమధ్యకాలంలో అతి తక్కువ మోతాదుల్లో పనిచేసే కీటక మరియు శిలీంధ్ర నాశకాలు మార్కెట్లో అందుబాటులో వున్నాయి. కొత్తగా అనేక రకాల మందులు మార్కెట్‌లోకి వస్తున్నాయి. వాటి వాడకం కూడా విస్తృతంగా ముఖ్యంగా కూరగాయల్లో అధికంగా వుంటున్నది. భారత ప్రభుత్వం వారి ద్వారా కొన్ని పురుగు మందులు కొన్ని పంటలకు మాత్రమే వాడకానికి అనుమతినిచ్చినప్పటికీ ఇతర సిఫార్సు చేయని పంటలపై కూడా వాడటం జరుగుతున్నది. ప్రపంచ వాణిజ్యకరణ నేపథ్యంలో ముఖ్యంగా మనదేశం నుండి జరుగుతున్న ఎగుమతుల్లో సస్యరక్షణ మందుల అవశేషాలు పరిమితికి మించిఉండటం వల్ల ఎన్నో రకాల ముఖ్య ఎగుమతులు తిరస్కరించబడతాయి. మనదేశం నుండి ఎగుమతి అయిన మిర్చి, తేనె, ద్రాక్ష, వరి మరియు కరివేపాకు వివిధ దేశాల వారు ముఖ్యంగా ఐరోపా, దుబాయి దేశాల వారు అవశేషాలున్నాయని తిరస్కరించడం జరిగింది. అందువలన సస్యరక్షణ మందుల అవశేషాలను మన వ్యవసాయ ఉత్పత్తుల్లో లేకుండా వుండాలంటే కొన్ని ముఖ్య జాగ్రత్తలను పాటించాల్సిన అవసరం వుంది.

1. సస్యరక్షణ మందులు పిచికారి చేసిన తరువాత పంటను కోయటానికి కొంత సమయం వేచి వుంటే అవే అవశేషాలు నిర్థారించిన పరిమితులకు మించవు.
2. సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించి, సిఫారసు చేయబడిన సస్యరక్షణ మందులను అవసరాన్నిబట్టి మాత్రమే వాడాలి.
3. ఎరుపు రంగు త్రిభుజం వున్న (ఉదా: మిథోమిల్, మోనోక్రోటోఫాస్) సస్యరక్షణ మందులను సిఫారసు చేయబడిన పంటలపై మాత్రమే పిచికారి చేయాలి.
4. సాధ్యమైనంత వరకు తక్కువ కాలంలో విషప్రభావం కోల్పోయే కొత్త రకాల సస్యరక్షణ మందులు మరియు బయోపెస్టిసైడ్స్ వాడాలి.
5. నిర్థారించిన మోతాదుల్లో సరియైన స్ప్రేయర్‌ను ఉపయోగించి నిర్థారించిన సమయాల్లో మాత్రమే పిచికారి చేయాలి.
6. పంటను కోయటానికి ముందు సాధ్యమైనంత వరకు సస్యరక్షణ మందులను పిచికారి చేయరాదు.
7. పురుగు మందుల చట్టం ప్రకారం భారత ప్రభుత్వం కూరగాయల్లో మోనోక్రోటోఫాస్, క్వినాల్‌ఫాస్ వాడకాన్ని పూర్తిగా నిషేధించారు.
8. గృహంలో వినియోగించే కూరగాయలను మరియు పండ్లను 2 శాతం ఉప్పు ద్రావణంలో 20 నిమిషాలుంచి కడిగినట్లయితే కూర గాయలను ఉప్పునీటి ద్రావణంతో శుభ్రపరచి ప్రెషర్‌కుక్కర్‌తో ఉడికించినట్లయితే కొన్ని అవశేషాలు పూర్తిగా తొలగించడానికి ఆస్కారం వుంటుంది. ✧

చెరకురసం నుండి తయారు చేపసిన బెల్లం భారతదేశంలో ఎక్కువగా ఉపయోగించబడుతుంది. చెరకురసం వేడి చేయదు. తద్వారా దీనిని ఎక్కువగా తయారు చేయుచున్నారు. ఇది ఎక్కువగా బంగారు బ్రౌను కలరునుండి డార్కు బ్రౌనుకలరులో అందుబాటులో వుంటుంది. తాటిబెల్లం పలుచని తెలుపురంగునుండి పసుపురంగులో ఉంటుంది. తాటిరసం మరిగించడం ద్వారా దీనిని తయారు చేయుచున్నారు. ఇది కొన్ని రకాలు చాక్లెటు రుచిలో కూడా వుంటుంది.

ఈతబెల్లంను ఈతకల్లు మరగించడం ద్వారా తయారు చేయుచున్నారు. ఈ రకం ఎక్కువగా గోల్డెన్ బ్రౌన్ కలరులో అందుబాటులో వుంటుంది. ఈ రకాన్ని ఎక్కువగా మయన్మార్ దేశంలో ఉపయోగించుచున్నారు. కొబ్బరిబెల్లంను ఎక్కువగా కొబ్బరినీటిలో కొన్ని రసాయనాలు కలిపి మరిగించడం ద్వారా తయారు చేయుచున్నారు. దీనిరంగు ఎక్కువగా గోల్డెన్ బ్రౌనుకలరు నుండి డార్కు బ్రౌన్ కలరు వరకూ అందుబాటులో వుంటుంది. దీనిని తయారు చేయడం చాలా తక్కువగా వుంటుంది.

బెల్లంతో అందుబాటులో వివిధ రకాలలో వివిధ పోషకములు అందుబాటులో వున్నప్పటికీ ఆరోగ్యరీత్యా చెరకు రసం నుండి తీసిన బెల్లం ఎక్కువగా ఉపయోగించాలి. చెరకు రసం నుండి తీసిన బెల్లంలో గ్లూకోజు మరియు సుక్రోజు పంచదారలా అందుబాటు వున్న వానికన్న ఆరోగ్యరీత్యా మంచిది.

బెల్లంతో చేసిన వంటకాలు ముఖ్యంగా అరిశెలు, బూరెలలో పూర్ణం, బొబ్బట్లు మరియు పరమాన్నం వంటివి పిల్లలచే తినిపించడం వలన రక్తంలోని విషపూరిత పదార్థములు తొలగించబడతాయి. కీళ్ళనొప్పులు పిల్లలకు తక్కువగా వుంటాయి. ఆరోగ్యరీత్యా మంచిది. ✧

నీటి ఆదా కోసం...

వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు

రైతులకు విశ్వసనీయమైన న్యాయోచితమైన పద్ధతిలో బోదె కాలువ తూముల వద్ద నీరందించాలంటే సమగ్రమైన కార్యవర్తన ప్రణాళిక, సకాలంలో చాలినన్ని మరమ్మతులు, సాగునీటి నిర్వహణలో నీటి వినియోగదారులకు సముచిత విధాన నిర్ణాయక పాత్ర ఎంతో ముఖ్యం.

ఈ మూడింటిలో ఏ ఒక్కటి లోపించినా, నీటిపారుదల వ్యవస్థ క్రమంగా పనిచేసి ఆశించిన ఫలితాలనీయజాలదు. 1997లో క్రొత్త నీటి పారుల చట్టం అమలులోకి వచ్చి రైతు సంఘాలేర్పడి నీటిపారుదల నిర్వహణలో రైతులకు నిర్ణయాత్మకమైన ప్రాతినిధ్యం కల్పించడానికి చర్యలు తీసుకున్నారు. ఆ సంస్థల ద్వారా అనేక పథకాలకు మరమ్మతులు కూడా నిర్వహిస్తున్నారు. కాని నీటి పంపిణీలో అసమానతలను తొలగించడానికి ఉద్దేశింపబడిన కార్యవర్తన ప్రణాళిక తయారుచేసి, అమలు పరచడంలో ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అంతేకాక, నీటిపారుదల పథకాల ప్రణాళిక రచనలోని కొన్ని లోపాలు కూడా సాగునీటి పంపిణీలో ఎన్నో ఇబ్బందులను కలగజేస్తున్నాయి.

అనేక సందర్భాలలో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడిపెట్టి, రాత్రింబవళ్ళు కష్టించి, వ్యవసాయం చేసి రైతు తన పెట్టుబడికి తగిన రాబడినిచ్చే పంటలను వేయాలనుకోవడం సహజం. అందువల్ల తక్కువ పెట్టుబడితో ప్రకృతి వైపరీత్యాలకు తట్టుకుని నిలబడే సహనం గల ఎల్లప్పుడూ గిరాకీ వుండే పంటనే వేయాలని రైతు సహజంగా కోరుకుంటాడు. అందువల్ల ఈ లక్షణాలన్నీ ఉండి, ముఖ్యమైన ఆహారపంటగా చలామణి అయ్యే వరిపంటనే వేయాలని రైతు ఎప్పుడూ ప్రయత్నిస్తున్నాడు. ఆరుతడి పంటతో పోల్చినపుడు వరి పంటపై వచ్చే రాబడి సగంకంటే తక్కువే అయినా, వరిపంటకు పెట్టుబడి తక్కువ. ఏవైనా తుఫానులు చీడపీడల వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే పొగాకు పంటలలాగా వరిపంట మొత్తం పాడైపోదు. అవసరానికి అమ్ముకోవాలన్నా ఆరుతడి పంటలవలె గాక వరి ధాన్యానికి ఎప్పుడూ మార్కెట్‌లో గిరాకీ వుంటుంది. పైగా వరిధాన్యం రేటులో పెద్దగా హెచ్చుతగ్గులుండవు.

ముఖ్యంగా వరి ఆహారపంట. వాణిజ్యపంటల మాదిరి ఆదాయం ఎక్కువ రాకపోయినా వరిపంటలో ఒడిదుడుకులు తక్కువ. ఈ కారణాల వల్ల పంట రాబడి ఎక్కువగా వుంటుంది కూడా. ఎక్కువ పెట్టుబడి, తక్కువ సహనం కలిగి వుండటం, స్థిరమైన మార్కెట్‌రేటు, గిరాకీ లేకపోవడం వల్ల ఆరుతడి పంటలకు బదులు అన్నిటికిని చాలా సురక్షితమైన వరిపంటనే వేయాలని రైతు కోరుకుంటున్నాడు.

ఆరుతడి పంటల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహక చర్యలు :

మనకు వరిపంట ఎంత అవసరమో, ఆరుతడి పంటలు (పప్పుధాన్యాలు, నూనెగింజలు, ప్రత్తి, మిరప మొదలైనవి) కూడా అంతే అవసరం. ప్రతిరైతు వరిపంటనే వేయడం మొదలెడితే మనకవసరమైన వేరుశనగ, నువ్వులు, ప్రొద్దు తిరుగుడు మొదలైన నూనెగింజలు, పెసర, కంది, మినుము మొదలైన పప్పు ధాన్యాలు, జొన్న, సజ్జ, రాగి మొదలైన చిరుధాన్యాలు, బట్టనేతకు కావలసిన ప్రత్తి కొరత ఏర్పడి మనం ఎక్కువ డబ్బు ఖర్చు పెట్టి వాటిని బయటనుండి దిగుబడి చేసుకోవలసి వస్తుంది. దానివల్ల రాష్ట్ర ప్రజలపై మిక్కుటమైన ఆర్థికభారం పడుతుంది. కాబట్టి ప్రభుత్వం ఆరుతడి పంటలను వేసి రైతులకు కొన్ని ప్రోత్సాహకాలను ప్రకటించాల్సి వుంటుంది.

పంటకాలానికి తగినంత ముందుగానే ముఖ్యమైన ఆరుతడి పంటలకు ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించింది, మార్కెట్‌లో గిరాకీ తక్కువగా వున్నప్పుడు మద్దతు ధరకు ఆ పంటలను కొనడానికి రైతులకు హామీ ఇవ్వాలి. రైతులు ఎంతెంత విస్తీర్ణంలో ఆరుతడి పంటలు వేయాలో ప్రభుత్వం ముందుగానే వారికి తెలియజేసి ఆ పండిన పంటనంతటినీ తామే కొనడానికి కూడా హామీ ఇవ్వాలి. పంటల భీమా పథకాన్ని ప్రవేశపెట్టి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటనష్టం జరిగినప్పుడు ఆ మేరకు రైతులకు నష్టపరిహారం చెల్లించాలి. అలా హామీలనిచ్చి, వానిని నెరవేర్చనప్పుడు ప్రభుత్వం నిర్ణయించిన ఏ పంటనైనా వేయడానికి రైతులు వెనకాడరు. ఆరుతడి పంటల వల్ల వారికి రాబడి ఎక్కువగా వుంటుంది. కాబట్టి, ఆ పంటలను వేయడం వారికి ప్రోత్సాహకరంగానే వుంటుంది. అలాకాకుండా, ఊరికే లోకలైజేషన్ చేసిన పంటలనే వేసి తీరాలంటే వారు అంగీకరించక ప్రభుత్వ ఆదేశాలు ఉల్లంఘించి, తమకు ఇష్టం వచ్చిన పంటలనే వేస్తారు కాబట్టి ప్రభుత్వం పంట నమూనా నిర్ణయంలో తగిన మార్పులు చేయాలి.

జి.ఎస్.టి - వ్యవసాయోత్పత్తులపై ప్రభావం



మర్ల సోమసుందర్
ప్రధాన శాస్త్రవేత్త (బయోటెక్నాలజీ)
ఇండియన్ కౌన్సిల్ ఫర్
అగ్రికల్చరల్ రీసెర్చ్, న్యూఢిల్లీ

మనదేశ ఆర్థిక వ్యవస్థ నస్థూల జాతీయ ఆదాయం విలువ దాదాపు రు.134 లక్షల కోట్లు. (2.3 ట్రిలియన్ డాలర్లు, వినియోగదారుల సంఖ్య 125 కోట్లకు పైనే వుంది. ఆర్థిక వ్యత్యాసాలలో, అభివృద్ధిలో, వస్తూత్పత్తి, మార్కెటింగ్‌ల విషయంలో దేశంలోని అన్ని రాష్ట్రాలు సమానంగా లేవు. వాటిమధ్య తీవ్రమైన ఆర్థిక వ్యత్యాసాలు వున్నాయి. ఈరోజు ఒక రాష్ట్రంలో ఉత్పత్తి అయిన సరుకును వేరొక రాష్ట్రానికి చేరవేసి మార్కెటింగ్ చేసుకోవడానికి ఎన్నో అవరోధాలున్నాయి. ప్రతీ రాష్ట్రం తన రాష్ట్ర పరిధిలో ఆరు రకాల సుంకాలు (అక్ట్రయి, ఎంట్రీటాక్సు, వేల్యూలేటెడ్ టాక్స్, పర్చేజ్‌టాక్స్, సెస్సులు, సర్చార్జీలు, లక్జరీటాక్సు, వినోదపు పన్ను వగైరా) మరియు, ఇవి కాకుండా కేంద్రం విధించే సెంట్రల్ ఎక్సైజ్ టాక్స్, సర్వీస్ టాక్సు, కస్టమ్స్ సుంకాల సెంట్రల్ సేల్స్ టాక్సు వగైరా ఎనిమిది రకాల పన్నులు కలిపి వినియోగదారుడు మార్కెట్‌లో కొనే ప్రతీవస్తువు పొందే సేవ (సర్వీస్), సరుకు పైనా చెల్లించవల్సి వస్తున్నది. ఈనెల 3వ తేదీన రాజ్యసభలో ఆమోదించబడిన జి.ఎస్.టి. (ఏకవస్తు, సేవా పన్ను) వివిధ రకాలుగా వసూలు కాబడుతున్న (పైన పేర్కొన్న) పన్నులను రద్దు చేసి ఏకపన్నుగా ఈ సంవత్సరం నుండి అమలులోకి రానున్నది.

ఇప్పటివరకూ ఈ మొత్తం రాష్ట్ర, కేంద్రం విధించే వివిధ పన్నులభారం 18 శాతానికి మించకుండా జి.ఎస్.టి. కేంద్ర ప్రభుత్వంచే వస్తువు తయారీ స్థానంలోనే వసూలు చేయబడుతుంది. ఉదాహరణకు గుంటూరు నుండి వారణాసికి లారీల్లో ఎగుమతయ్యే ఎండుమిర్చిపై గుంటూరు మార్కెట్ యార్డులోకి జి.ఎస్.టి. వసూలు చెయ్యబడుతుంది. గుంటూరు నుండి వారణాసి వరకూ మార్గమధ్యంలో అక్ట్రాయి, ఎక్సైజు, ఎంట్రీటాక్సులు, సరిహద్దుల్లో చెక్‌పోస్టుల వద్ద వేచి వుండటం పూర్తిగా తొలగించబడుతుంది. జి.ఎస్.టి.లో పాన్‌కార్డు నెంబరు, ఆదాయకార్డు నెంబరు, వస్తువుల వివరాలు కంప్యూటర్ ద్వారా సాఫ్ట్‌వేర్‌లో అనుసంధానం చేయటం వలన అంతిమంగా కిరాణా దుకాణంలో వినియోగదారుడు చెల్లించే ధరతో ఈ వివరాలు జోడింపబడతాయి. ప్రస్తుతం మార్కెటింగ్ చేరే మొత్తం వస్తువుల్లో కేవలం 20 నుండి 30 శాతం వస్తూత్పత్తి (మాన్యూఫ్యాక్చరింగ్ లేదా పంట పండించే) వాటా కాగా మిగిలిన 70 నుండి 80 శాతం వరకు వివిధ దొంతరల్లో ప్రత్యక్షమయ్యే డీలర్లు, కమీషన్, మార్కెట్ బ్రోకర్లు పాత్ర వుండటంతో సేల్స్‌టాక్స్, ఎక్సయిజ్ టాక్సు, ఎంట్రీ టాక్సులను అధికభాగం ఎగవేసి, బిల్లులు చెల్లించక లెక్కల్లో చూపెట్టకపోవడం వలన వేలకోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు చేరకుండా నల్లధనంగా మారుతూ అవినీతి అక్రమార్జనకు అవకాశంగా మారింది. ఒకే పన్ను చెల్లింపు రూపంలో రానున్న జి.ఎస్.టి. ద్వారా సరుకుల పరిమాణం, విలువ ప్రారంభంలో (ఉత్పత్తి స్థానంలోకి) నమోదు కావటం వలన, వివిధ దొంతర్ల ద్వారా పనిచేసే డీలర్లు, బ్రోకర్లు, వ్యాపారుల దొంగ లెక్కలకు తావులేకుండా, కంప్యూటరు సాఫ్ట్‌వేర్ ద్వారా మొత్తం సరుకుల వివరాలు నమోదు కాబడతాయని భావింపబడుతున్నది. తదనుగుణంగా జాతీయాదాయం 0.7 నుండి 1.3 శాతం వరకు పెరగవచ్చని, వినియోగదారుడు చెల్లించే ధర 1.5 నుండి 2.0 శాతానికి తగ్గవచ్చునని ఆర్థిక నిపుణుల అంచనా.

వ్యవసాయోత్పత్తులపై జి.ఎస్.టి. ప్రభావం

మొత్తం ఆర్థిక వ్యవస్థలో (జిడిపి 134 లక్షల కోట్లు) వ్యవసాయోత్పత్తుల సాలీన విలువ దాదాపు 18 లక్షల కోట్ల రూ.గా అంచనా వేయబడుతున్నది. ధాన్యం, గోధుమలు, పప్పు, నూనెదినుసులు, పళ్ళు, కూరగాయల ఉత్పత్తులను పండించాలి. 80శాతం చిన్న, సన్నకారు రైతులవటం వలన వీరివద్దనుండి కొనుగోలు చేసే వ్యాపార్లు, మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారస్థులు దాదాపుగా ఈ వ్యవసాయోత్పత్తుల వివరాలు సరైనవిగా తెలుపక, వివిధ పన్నుల చెల్లింపుల నుండి తప్పించుకుంటూ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించడం జరుగుతున్నది. కేవలం మార్కెట్ యార్డులకు, ఇతర రాష్ట్రాలకు, దేశాలకు రవాణా కాబడే వ్యవసాయోత్పత్తులు తప్ప అధికభాగం ప్రభుత్వ పన్నుల సుంకాలు చెల్లింపక, నల్లధనంగా ప్రక్కదారి పడుతున్నది. ఉదాహరణకు మార్కెట్‌లో 200 రూ. కిలోగా వినియోగదారుడు చెల్లిస్తున్నా, పండించే రైతుకు కేవలం 50 రూ. లభించి, మిగిలినదంతా రవాణా, నిల్వ ఖర్చుల పోను అధికశాతం పన్నులు చెల్లించే వ్యాపారస్థులచే స్వాహా చేయబడుతున్నది.

వ్యవసాయోత్పత్తులపై విధించే ఏకీకృత జి.ఎస్.టి. పన్ను ఈ సంవత్సర ప్రారంభంలో బడ్జెట్‌లో ప్రతిపాదింపబడిన జాతీయ వ్యవసాయ మార్కెట్ (ఇమండీ)తో అనుసంధానింప బడుతుంది. జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానంద్వారా ఆ జిల్లాల్లోని మార్కెట్ యార్డులకు రైతు తీసుకొని వచ్చిన పంట పరిమాణం, క్వాలిటీ గ్రేడ్ చెయ్యబడి, ఈ వివరాలు మార్కెట్ యార్డులోని కంప్యూటర్‌లో నమోదు చెయ్యబడతాయి. దీని ద్వారా దేశం మొత్తంగానున్న మార్కెట్ యార్డులకు తీసుకురాబడిన పంటల పరిమాణం, క్వాలిటీ గ్రేడు, అనుసంధానం చేయబడ్తాయి. దీనివలన దేశంలోని ఏ ప్రాంతంలో నుండయినా వ్యాపారులు వివిధ ప్రాంతాల్లోని పంటల లభ్యత గురించి సమాచారం పొందగలుగుతారు. తద్వారా రైతుకు అధికధర లభించి లాభసాటి కాగలరని ప్రభుత్వ వాదన.

కానీ వాస్తవంగా జి.ఎస్.టి. ఏకపన్ను విధానం, ఈ మండి చిన్న, మధ్యంతర దళార్లు, కమీషను వ్యాపారస్తుల, డీలర్ల పాత్రను తగ్గించి పన్ను ఎగవేతను కొంతవరకు తగ్గించగలిగే అవకాశం ఉన్నా, అది ప్రస్తుత సరళీకృత ఆర్థిక విధానాల్లో భాగమైన గ్లోబలైజేషన్, డిజిటల్ కంప్యూటీకరణకు తద్వారా జాతీయ స్టాక్‌మార్కెట్ల అనుసంధానం చేయబడి పెద్దపెద్ద టోకు వ్యాపారులకు, వాల్‌మార్ట్, టాటా, రిలయన్సు పెద్ద గోడౌన్ నిల్వ సామర్థ్యం కలిగిన దేశ వ్యాప్తంగా గొలుసు వ్యాపారం నిర్వహించగలిగిన పెద్ద పెద్ద సూపర్ మార్కెట్లు, బహుళజాతి సంస్థల ఆధీనంలోకి వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్, పంపిణీ అవకాశం కలుగుతుంది. అంటే స్థానికంగా వుండి చిన్న చేపల స్థానంలో పెద్ద చేపలు అవతరిస్తాయన్నమాట.

జి.ఎస్.టి. పన్ను విధానం ఇ-మండీ పథకం కొంతవరకు స్థానికంగా మార్కెటింగ్ అక్రమాలకు పాల్పడి, అటు రైతులకు కనీస మద్దతు ధర చెల్లించక మరొకవైపు లెక్కల్లో చూపక, ప్రభుత్వ పన్నుల ఎగవేతను కొంతవరకు నియంత్రించగలిగినా, రైతులకు (ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు) దక్కే ప్రయోజనం నామ మాత్రమే. పంజాబు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు, కేరళ, కర్ణాటక, హర్యానా రాష్ట్రాలను మినహాయిస్తే ఎఫ్.సి.ఐ. (ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా), సి.సి.ఐ. (కాటన్ కార్పొరేషన్), మార్కెట్‌యార్డుల ఉనికి దేశవ్యాప్తంగా అతిస్వల్పం. (కేవలం 10శాతం) రైతులకు కూడా అందుబాటులో లేదు.

మార్కెట్ యార్డులలో, మార్కెట్‌లలో పలు దొంతర్లుగా వున్న మిల్లర్లు, వ్యాపారులు, కమీషన్ బ్రోకర్ల దోపిడీ కారణంగా వినియోగదారుడు చెల్లించే ధరలో రైతువాటా 30 నుండి 40 శాతానికి మించటం లేదు. ఈదిశలో జి.ఎస్.టి. పన్ను విధానం, కొంతవరకు రైతులకు మేలు కలిగించినా, రైతులకు పూర్తి ప్రయోజనం కేవలం ఉత్పత్తి ఖర్చులతో జోడించిన మద్దతు ధరలను ప్రకటించి, వాటి సక్రమ అమలుకు చట్టపరమైన హక్కులను కలిగిన ప్రభుత్వ పర్యవేక్షక యంత్రాంగాన్ని నియమించినప్పుడే ఫలితం రైతుకు దక్కగలదు. ప్రభుత్వం నిత్యావసర వస్తువుల మార్కెటింగ్‌ను (ధాన్యం, పప్పుదినుసులు, నూనెగింజలు, పంచదార వగైరా) జాతీయం చేసి రిటైలు మార్కెట్‌లో నున్న టోకు ధరల సూచి ఆధారంగా మద్దతు ధరలను నిర్ణయించి తదనుగుణంగా రైతుకు చెల్లించినప్పుడే రైతుకు ప్రయోజనం కలుగగలదు.

కేంద్ర పన్నులు :

సెంట్రల్ ఎక్సైజ్ టాక్సు
సర్వీస్ టాక్సు
కస్టమ్స్ సుంకాలు
సెంట్రల్ సేల్స్ టాక్సు
సెంట్రల్ సర్‌చార్జీలు, సెస్సులు

రాష్ట్ర పన్నులు :

వాల్యూయేటెడ్ టాక్సు
అక్ట్రామ్ మరియు ఎంట్రీటాక్సు
పర్చేస్ టాక్సు
వివిధ రాష్ట్ర సుంకాలు, సర్‌చార్జీలు
లక్జరీ టాక్స్
వినోదపు పన్ను

} ఏకీకృత లేదా ఏకసేవా పన్ను జిఎస్‌టి

జి.ఎస్.టి.ను రాజ్యసభ, లోక్‌సభ ఆమోదించిన, ఇంకా మిగిలిన సగం రాష్ట్రాలు ఆమోదం తెలిపిన తర్వాత బహుశా ఈ సం॥ డిసెంబరు నుండి చట్టరూపంలో మన ముందుకు రావచ్చును. కాగా జి.ఎస్.టి. పన్ను ద్వారా ఇటు రైతులకు, అటు వినియోగదారుడికి ప్రయోజనం కన్నా, ప్రభుత్వం సక్రమంగా పన్నులు వసూలు చేసుకోవడానికి, బడా వ్యాపారులకే మేలు కలిగిస్తుంది. ✧

వ్యవసాయరంగం - డబ్ల్యు.టి.ఓ. ఒప్పందం

ప్రపంచంలోని దేశాలు దిగుమతి సుంకాలు తగ్గించి వాణిజ్యాన్ని పెంచుకోవటానికి (జి.ఎ.టి.టి.) జనరల్ అగ్రిమెంట్ ఆన్ ట్రేడ్ అండ్ టారిఫ్ 1948లో రూపొందింది. అందులో మన దేశం కూడా సభ్యదేశమే. 1995 జనవరి నుండి అదే సంస్థ (డబ్ల్యు.టి.ఓ.) వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ లేదా ప్రపంచ వాణిజ్య సంస్థగా రూపొందగా, అందులో 138 దేశాలు చేరి వున్నాయి. స్థూలంగా మనకు అవసరమైన విషయాలకు వస్తే ప్రపంచ స్వేచ్ఛా వాణిజ్యానికి తలుపులు తెరుచుకున్నాయి. సభ్యదేశాలు ఈ ఒప్పందం ప్రకారం దిగుమతి సుంకాలు లాంటి అడ్డాలు పెట్టవచ్చునేమో కాని ఇతర వాణిజ్యపర అడ్డంకులు పెట్టరాదు. సభ్యదేశాలు స్వేచ్ఛా వాణిజ్యానికి అనుమతించాలి.

అభివృద్ధి చెందిన దేశాలకు, చెందుతున్న దేశాలకు వ్యవసాయ ఉత్పత్తుల వ్యయంలో, నాణ్యతలో తేడా వున్నది. మనది సాంప్రదాయ వ్యవసాయం. చిన్న కమతాలు, ఉత్పత్తి వ్యయం ఎక్కువ. ప్రాసెసింగ్‌లో అనుభవంలేక ఉత్పత్తుల నాణ్యత లోపం కనిపిస్తుంది. ప్రపంచ పోటీలో నిలువరించటం ప్రస్తుతం కష్టతరమైన విషయం. చేనేత వస్త్రాలు, మిల్లు వస్త్రాలతో పోటీపడటం ఎంత కష్టమో మన వ్యవసాయరంగ పరిస్థితి అంతే. స్వేచ్ఛా వాణిజ్యంలో మన దేశం కూడా నిలబడాలంటే ఉత్పాదక శక్తి, ఉత్పత్తి నాణ్యత పెంచుకోవటం, ఉత్పాదక ఖర్చు తగ్గించుకోవటం మినహా మనకు గత్యంతరం లేదు. ఈ పోటీ తత్వానికి రైతులను సమాయత్తపరచటానికి ప్రభుత్వపరంగా కొన్ని చర్యలు చేపట్టాలి.

ఈ రంగంపై సబ్సిడీలు పెంచటం, సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి, సత్వర వ్యాప్తికి చర్యలు, ప్రాసెసింగ్ రంగం అభివృద్ధి లాంటివి చేపట్టాలి.

చూడిపరీక్ష మరియు చూడిపశువుల యాజమాన్యంలో తీసుకోవలసిన జాగ్రత్తలు

డా॥ డి. రాంబాబు, పశు వైద్య సహాయ శస్త్ర చికిత్సకులు, [illegible]

పాడి పరిశ్రమలో విజయం సాధించాలంటే చక్కటి యాజమాన్య పద్ధతులు పాటించడం తప్పనిసరి. కృత్రిమ గర్భధారణ చేసిన 60 రోజులకు తప్పనిసరిగా చూడి పరీక్ష చేయించాలి. తిరిగి కట్టుకు రానంత మాత్రాన పశువు చూడిది అనుకొని పరీక్ష చేయించడం మరువకూడదు. ముందుగా చూడి పరీక్షలు నిర్వహించటం వలన ఒకవేళ చూడి లేకపోతే కారణాలు తెలుసుకొని చికిత్స చేయించుటకు వీలుపడుతుంది.

కృత్రిమ గర్భధారణ చేయించిన తేదిని కూడా రాసిపెట్టుకోవాలి. ఈ విధంగా గుర్తుంచుకోవడం వలన పశువు చూచాయిగా ఈనబోవు సమయాన్ని అంచనావేయవచ్చు. ఎందుకంటే ఆవులలో గర్భధారణకాలం 9 నెలలు లేదా 272 రోజులు (270-290) రోజులు అదే గేదెలలో 10 నెలలు లేదా 310 రోజులు (310-330 రోజులు) కాబట్టి నెలలు నిండిన తర్వాత ఆ పశువును జాగ్రత్తగా గమనించుటకు మరియు ఈనుటకు తగిన ఏర్పాట్లు చేయుటకు వీలవుతుంది.

చూడి పశువుల యాజమాన్యం

1. చూడి పశువులను ఎక్కువ దూరం నడిపించకూడదు. పరుగెత్తించకూడదు. ఎత్తు ప్రదేశాలకు వెళ్లనివ్వకూడదు.
2. చూడి పశువుల చేత బరువులు మోయించకూడదు మరియు ఇతర పనులు చేయించకూడదు. ఇలా చేయించినట్లయితే అబార్షన్ జరిగే అవకాశం వుంటుంది.
3. చూడి పశువుకు 3వ నెల మరియు 6వ నెల సమయంలో నట్టల నివారణ మందులు వాడాలి.
4. చూడి పశువు పొదుగును ఈనటానికి నెల ముందుగా మర్దనచేయాలి. దీని వలన పొదుగు బాగా పెరుగుతుంది. ముఖ్యంగా తొలి ఈత పశువులో మర్దన చేయడం వలన చాలా ఉపయోగం వుంటుంది.
5. చూడి పశువు ఈనడానికి 45-60 రోజుల ముందు పాలుపితకకుండా వదిలేయాలి. ఇట్లు చేయడం వలన పొదుగులోని పూర్ణకణజాలం నశించి, కొత్తకణజాలం ఏర్పడుతుంది. ఈనిన తర్వాత పాల ఉత్పత్తి కూడా పెరుగుతుంది.
6. పశువు నిండు చూలుతో ఉన్నపుడు మేతకు బయటకు పంపించకూడదు.
7. చూడితో ఉన్న పశువులను ఎదలో ఉన్న ఇతర పశువులుగాని ఆబోతులు గాని ఎక్కకుండా చూడాలి.
8. చూడి పశువులను ఇతర పశువులతో కలవకుండా విడిగా లేక వేరే పాకలో వుంచాలి. అక్కడ నేల జారుడుగా లేకుండా చూసుకోవాలి. బయటకు వదిలేటప్పుడు ఇరుకైన మార్గాలు లేకుండా చూసుకోవాలి.

చూడి పశువుల మేపు

చూడి పశువులకు సమృద్ధిగా పచ్చిమేత వేయాలి. చూడి దశలో పశువుకు దాని శరీర పోషణకు మరియు గర్భం లోని పిండము అభివృద్ధికి కూడా పోషక పదార్థాలు అవసరము. ఈ దశలో అదనముగా మేత, దాణా ఇవ్వవలసి వుంటుంది. చివరి రెండు మాసాల చూడిలో పశువుకు ఒక కిలో దాణా మరియు 30 గ్రా. ఖనిజ లవణ మిశ్రమం అదనంగా ఇవ్వాలి.

ఈనబోవు పశువు కనబర్చే లక్షణాలు :

1. నెలలు నిండిన పశువు చిన్నగా నడుస్తుంది.
2. పొదుగు బాగా పెరుగుతుంది. తొలిచూలు పశువులో పొదుగు 4 నెలల నుండే పెరగటం ప్రారంభం అవుతుంది. పొదుగును గమనించడం ద్వారా పశువు కట్టినదని గ్రహించవచ్చు. అదే ఈతల పశువులో ఈనటానికి రెండు వారాల ముందర మాత్రమే పొదుగు పెరుగుతుంది.
3. తొలి చూలు పశువులో 4వ నెల నుండే చన్నుల నుండి పిండినపుడు జిగురుగా తీగ వంటి ద్రవమును గమనించవచ్చు. పశువు ఈనే ముందర పసుపు పచ్చని ముర్రుపాలగా మారుతుంది.
4. పశువు ఈనటానికి కొద్ది రోజుల ముందర మడి పెరుగుతుంది. ఇతర పశువులతో కలవక ప్రశాంతమైన ప్రదేశాన్ని కోరుతుంది.
5. మేత తీసుకోవడం మందగిస్తుంది. శ్వాసక్రియ వేగంగా పెరుగుతుంది.
6. శరీర ఉష్ణోగ్రత 1^0 - 2^0 F పెరుగుతుంది.
7. హార్మోన్ల ప్రభావము వలన గర్భద్వారం మెత్తబడి తెరచుకొనుట మొదలవుతుంది.

పశువు ఈనేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు

1. నెలలు నిండిన పశువు సరిగ్గా ఏ రోజు ఏ సమయంలో ఈనుతుందో చెప్పలేము. కానీ సాధారణంగా పశువులు రాత్రివేళ లేదా తెల్లవారుఝామున ఈనడం గమనించవచ్చు. బహుశా ఆ సమయంలో ప్రశాంతముగా తక్కువ అలజడి, ఒత్తిడి ఉండటంవల్ల కావచ్చు.
2. ఈనే లక్షణాలు కనిపించిన వెంటనే పశువును వేరే పాకలో శుభ్రమైన వరిగడ్డితో పక్కవేసి ఉంచాలి.
3. రాత్రివేళలో తరచుగా గమనించుచుండాలి. లేనిచో అప్పుడే



పుట్టిన దూడను కానీ లేక మాయను కానీ కుక్కలు తీసుకెళ్ళే ప్రమాదం ఉంది. లేదా మాయను తల్లి కూడా తినే ప్రమాదం వుంది.

4. సాధారణంగా పశువులు ఈనేటప్పుడు ఎటువంటి సహాయం లేకుండానే ఈనతాయి. కాని కనిపెట్టుకుని ఉండడం వలన ఒకోసారి దూడ అడ్డం పడినపుడు లేదా వెనుక కాళ్లు వచ్చినపుడు వెంటనే పశువైద్యుల సహాయం తీసుకొని దూడకు తల్లికి ప్రాణాపాయము లేకుండా చూడవచ్చు.
5. ఈతల పశువు నొప్పులు మొదలైన 2 గంటల లోగా ఈను తుంది. అదే తొలి చూడు పశ్వ అయితే ఎక్కువ సమయం పడుతుంది. ఒకవేళ ఈనలేకపోతే డాక్టర్‌ను సంప్రదించాలి. అంతేకాక దూడను లాగటానికి ప్రయత్నించకూడదు. ఇతరులను చేతులు పెట్టనివ్వరాదు. ముందర కాళ్ళు, తల బయటికి వస్తే ఆందోళన పడనవసరం లేదు.
6. తల ఒక కాలు లేదా తల మాత్రమే లేదా కాళ్ళు మాత్రమే లేదా వెనుక కాళ్ళు మాత్రమే వస్తే ఈనటం కష్టం అటువంటి సమయంలో వెంటనే పశు వైద్యుల సహాయం పొందాలి.
7. ఈనిన వెంటనే దూడకు తల్లి దగ్గర జున్నుపాలు తాపాలి. దీని వలన ఆక్సీటోసిన్ అనే హార్మోన్ ఉత్పత్తి అయి మాయ సకాలంలో వేస్తుంది.
8. ఈనిన 24 గంటలలో మాయ వేయకుంటే పశువైద్యుల సహాయం పొందాలి.
9. ఈనిన తర్వాత మంచి పాడిసార కలిగిన పశువులకు పాలజ్వరం రాకుండా కాల్షియం ఇంజెక్షన్లు ఇప్పించాలి.

పశువులకు ఎప్పుడు చూడి పరీక్ష జరిపించాలి ?

పశువుకు కృత్రిమ గర్భధారణ జరిపించిన 60-90 రోజులకు చూడి పరీక్ష నిర్వహించవచ్చును. తరుపులలో 45 రోజులకే గర్భాశయము కొలతలో తేడాను గమనించవచ్చు. తిరిగి నెల రోజుల తర్వాత చూడి నిర్ధారణ వేయవచ్చు.

చూడి పరీక్ష చేయు విధానం

1. చేతుల గోర్లు కత్తిరించుకొని శుభ్రపరచుకోవాలి.
2. గమ్ బూట్లు, గ్లోవ్స్, ఏప్రాన్ ధరించాలి.
3. చేతికి సాఫ్ట్ సోప్ రాసుకోవాలి.
4. పశువుని ట్రెవిస్‌లో పెట్టి సురక్షితంగా ఉంచాలి.
5. ముందుగా పశువుకు ఎప్పుడు కృత్రిమ గర్భధారణ చేయించబడినది లేదా ఆబోతును దాటించినది తెలుసుకోవాలి. దీని వలన సుమారు ఎన్ని రోజుల చూడి అన్నది అంచనా వేయవచ్చు.
6. చేతివేళ్ళను ఒక చోట చేర్చి ముక్కోణపు ఆకారము చేసి నెమ్మదిగా రెక్టమ్ లోనికి పోనివ్వాలి.
7. ఎక్కువగా పేడ వుంటే తీసివేయాలి.
8. పశువు ముక్కుతుంటే పరీక్ష చేయకుండా చేతిని అలాగే ఉంచాలి. ముక్కడం ఆగిపోయిన తరువాత తిరిగి పరీక్ష చేయాలి.
9. పలుమార్లు చేతిని బయటికి తీసి మళ్ళీ పెడుతుంటే పేడ వచ్చే రంధ్రములో గాలి చేరుతుంది. అటువంటి సమయాలలో పరీక్ష చేయడం కష్టం.
10. చేతితో నెమ్మదిగా తొలుత గర్భాశయ ముఖద్వారాన్ని గుర్తించాలి.
11. తరువాత చేతిని కొంచెం ముందుకు పోనిచ్చి గర్భాశయాన్ని సున్నితముగా పరీక్షించాలి.
12. పశువు 2-2 1/2 మాసాల చూడిదయితే గర్భాశయ శృంగాలలో ఒకటి పెద్దదిగా ఉబ్బి ఉంటుంది. గర్భాశయపు శృంగాల మధ్య చీలికలో చూపుడువేలు పెట్టి ఒక్కొక్క శృంగాన్ని పరీక్షించిన ఈ తేడాను గమనించవచ్చును.
13. పశువు మూడు మాసాల చూడి దయితే గర్భము ఊపురుబుడ్డ వలె కటికుహరము మరియు ఉదరకుహమరము మధ్యలో వుండును.
14. నాలుగు మాసాల చూడిదయినపుడు దూడ బరువు, ఉమ్మ నీటి శాతము పెరిగి గర్భాశయం ఉదరకుహరము లోనికి జారును. గర్భాశయ ముఖద్వారము ఆ బరువుకు ముందుకు జరిగి కటికుహరము అంచు వద్ద ఉండును. ఈ దశలో కటికుహరానికి ఇరువైపులా గర్భాశయానికి రక్త ప్రసరణ చేయు ధమనిలో రక్త ప్రవాహపు ప్రకంపనలు గమనించ వచ్చును.
15. 5 నెలలు నుండి 6 నెలల మధ్య కాలంలో దూడ పరిమాణం మరియు బరువు పెరిగి ఉదరకుహరం క్రింది భాగములో చేతికి తగులుతుంది.
16. 6 నెలలు దాటిన తర్వాత దూడ పరిమాణం మరింత పెరిగి దూడ భాగాలు చేతికి తగులుతాయి.

మామిడి కోత అనంతరం


తోటలో చేపట్టవలసిన ముఖ్య యాజమాన్య పద్ధతులు

మామిడి తోటల్లో కోతల తర్వాత సీజన్‌లో పూత బాగా వచ్చి, పిందె నిలిచి, పురుగులు, తెగుళ్ళను అదుపులో వుంచి ఆరోగ్యమైన, నాణ్యమైన మామిడిపండ్లు రావాలంటే తోటలను సంరక్షించుట చాలా అవసరం.

ముఖ్యంగా రసం పీల్చు పురుగుల ద్వారా వచ్చు మసిమంగు రాతిమంగు, మామిడి ముడ్డిపుచ్చు పురుగు, ఆకులను ఆశించు ఆరుజల్లెడ పురుగు, ఇతర గొంగళి పురుగులు మరియు ఆకుపచ్చ తెగుళ్ళు మొదలైన వాటినుండి తోటలను రక్షించుకొనుటకు జూన్, జులై మాసాలు నుండే తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలి.

కొమ్మ కత్తిరింపులు :

పండిన, కాపుకాయని ముదురు కొమ్మలు, లోపల అడ్డదిడ్డంగా పెరుగుతున్న కొమ్మలు కత్తిరించాలి. ఈ విధంగా చేయటం వలన చెట్టులోపలికి గాలి, వెలుతురు సోకి కొత్త చిగురులు ఎక్కువగా వచ్చి వాటిపై పూత బాగా వస్తుంది. అంతేకాక మంగు కలిగించే తేనెమంచు పురుగులు నియంత్రించబడును. నరికిన కొమ్మలకు బోర్డోపేస్టును పూతగా పూయడం వలన కొమ్మ కోతల ద్వారా ఆశించే శిలీంధ్రాలను అరికట్టవచ్చు.



తోటలను దున్నుట :

తోటలను పదును చూసి దున్నుకోవాలి. ఈ విధంగా చెట్టు చుట్టూ కొమ్మలు విస్తరించి ఉన్నంతమేరా పాదులు లేదా పళ్ళాలు చేయాలి. తోటలను సకాలంలో దున్నటంవలన నేల, గాలి, నీటి సరఫరాకు అనువుగా వుంటుంది. అంతేగాక రసంపీల్చు పురుగులు, ఆకుతిను పురుగులు, ఆకుమచ్చ తెగుళ్ళకు కారకులైన శిలీంధ్రాలకు ఆశ్రయం ఇచ్చు కలుపు మొక్కలను నివారించవచ్చును.

సస్యరక్షణ :

లేత చిగుర్లను, ఆకులను కొరికి తినుపురుగులు, ఆకుగూడు పురుగులు, కాండం పగుళ్ళలో నివసించు తేనెమంచు పురుగులు మొదలైన వాటిని నివారించుటకు కార్బరిల్ 3గ్రా. లేదా థయోడికార్బ్‌ను 1.5-2.0 గ్రా. లేదా క్వినాల్‌ఫాస్ 2 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి ఆకులు మరియు కొమ్మలు, కాండపు మొదళ్ళపై పగుళ్ళు బాగా తడియున్నట్లుగా పిచికారి చేయాలి.

ముడ్డిపుచ్చు పురుగు ఆశించి రాలిన కాయలు, ఎండిన కాయలు తోటలో లేకుండా ఏరి కాల్చివేయాలి.

కాండం చుట్టూ 1.5-2 మీ. ఎత్తు వరకు క్లోరిపైరిఫాస్ 5 మి.లీ. లేదా వేపనూనె 50 మి.లీ. ఒక లీటరు నీటిలో కలిపిన ద్రావణాన్ని పూతగా పూయాలి.

దీనివలన కాండం పగుళ్ళలో దాగివున్న మామిడిపుచ్చు పురుగులను నివారించుటయేకాక, రాలిన కాయల్లో పండు ఈగల సంతతిని కూడా నాశనం చేయవచ్చు.

ఆంత్రక్నోస్ తెగులు సోకి రాలిన ఆకులను చెట్టుక్రింద లేకుండా ప్రోగుచేసి రాల్చడం వలన శిలీంధ్ర బీజాలు మరల చెట్టుపై ఆకులను ఆశించకుండా నాశనం చేయవచ్చు.

కొన్ని ప్రాంతాల్లో మామిడి ఆకులపై ఆంత్రాక్నోస్, బాక్టీరియా, ఆకు మచ్చ తెగుళ్ళు సోకినట్లు గమనించడమైనది. ఆకులు, పూత, కాయలపై ఈ తెగులు ఆశించడం వలన దిగుబడి తగ్గుతుంది. కనుక తెగులు సోకిన చెట్లకు వెంటనే బావిస్టిన్ 1 గ్రా. లేదా డైథేన్ ఎం-45, 25 గ్రా ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

బాక్టీరియా ఆకుమచ్చ తెలుగు సోకిన తోటల్లో స్ట్రెప్టోసైక్లిన్ మందును 0.6గ్రా. ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

సేంద్రియ ఎరువులు :

తొలకరి జల్లులతో దుక్కి దున్నిన వెంటనే పచ్చిరొట్ట విత్తనాలను చల్లుకొని 60 రోజుల్లో నేలలో కలియదున్నాలి. పశువుల ఎరువు 50 కిలోలు ఒక చెట్టుకు లేదా వర్మికంపోస్ట్ లేదా వేపపిండి 5-10 కిలోలు వేయాలి.

రసాయన ఎరువులు :

సేంద్రియ ఎరువులతో పాటు రసాయన ఎరువులు కూడా చెట్లకు చాలా అవసరం. కాబట్టి 10 సం॥లు దాటిన ప్రతి చెట్టుకు ఒక సం॥నికి 2.2 కిలోల యూరియా, 6 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 1.6 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి.

తోటలు దున్నిన తరువాత చెట్టు చుట్టూ పాదులు చేసి, ఎరువులు వేసి, నేలలో కలియదున్నాలి. ఎరువులు వేసిన వెంటనే నీరు పెట్టాలి. మంచి జడివానలు పడినపుడు నీరు పెట్టనవసరం లేదు.

ప్రధాన పోషకాలతో పాటు సూక్ష్మపోషకాలైన బోరాన్, జింక్,

పండ్ల తోటలు – తోట పంటలు

చీనీ/నిమ్మ

తీపి రకాలు : సాత్‌గుడి, బత్తాయి, చీనీ, పంపరపనస.

పులుపు రకాలు : కాగ్జినిమ్మ, బాలాజీ పెట్లూరి నిమ్మ.

జామ

అలహాబాద్ సఫేద్ (విత్తనం మెత్తన), సర్దార్ (లక్నో 49) కోహిర్ సఫేద్, సెలక్షన్ 8, ఇవన్నీ తెల్లకండ గల రకాలు.

ఎర్రకండ రకాలు : రెడ్‌ఫ్లష్, లలిత్.

ఎరుపు కండ గింజ మెత్తన : కిరణ్.

సపోట

పాలసపోటా : పండు చిన్నది, తీపి ఎక్కువ, ఎక్కువగా సాగులో వుంది.

క్రికెట్ బాల్ : కాయ పెద్దది, గుండ్రన, గింజలు ఎక్కువ.

ద్వారపూడి : పండ్లు చిన్నవి, గుండ్రన

కాలాపత్తి : కాయకు తోలు మందం, అధిక దిగుబడి.

కలకత్తా రౌండు : పెద్దవి, కండ మృదువు.

దానిమ్మ : బగువ, గణేష్, మస్కట్, జ్యోతి, జలోర్‌సీడ్‌లెస్, జోద్‌పూర్‌రెడ్, బగువ మార్కెట్ గిరాకీ రకం. చర్మం, గింజలు ముదురు పింక్ రంగు. చర్మం మందం, నిల్వ, రవాణాకు అనువైనది.

బొప్పాయి : హనీడ్యూ, కూర్గ్‌హనీ డ్యూ, వాషింగ్టన్, సోలో, కోతైవాన్ రెడ్‌లేడి -786, డెలిషియస్, ఈస్ట్‌వెస్ట్ రెడ్ రాయల్, సప్న-తైవాన్‌రెడ్ లేడి ఎక్కువ వ్యాప్తిలో వున్న తైవాన్ రకం, గుజ్జు నారింజ రంగు పూసాడ్వార్ఫ్ పొట్టిరకం. పెరటి తోటల్లో వేసుకోవచ్చును.

సీతాఫలం : బాలానగర్ : పిరమిడ్ ఆకృతి, కాయపైన గరుకు, గుజ్జు తెలుపు. వాషింగ్‌టన్ 107005 : గుండ్రన, లేత ఆకుపచ్చ తోలు గుజ్జు మెత్తన, తెలుపు. ఎర్ర సీతాఫలం : పండ్లు ఎరుపు, తోలు ఎర్రగులాబి, గుజ్జు గులాబిరంగు.

మామిడి

బంగినపల్లి : వాణిజ్యరకం, నిల్వకు తట్టుకొనును. నార తక్కువ. తీపి ఎక్కువ.

తోతాపురి : చిత్తూర్, కలెక్టర్.

బెంగుళూరు : తోలు మందం, కండ గట్టి నార లేదు. ఆలస్యంగా కోతకు వచ్చే రకం. టెంకె పెరుగు బెడద ఎక్కువ.

సువర్ణరేఖ : తూర్పు కోస్తా సాగు. పసుపువర్ణం, కండ మెత్తన, నార నీదు.

నీలం : ఆలస్యంగా కోతకు వచ్చే దక్షిణాంధ్ర రకం. చిన్నరసం, చెరుకురసం, నవనీతం.

పెద్దరసం : నార అధికం, రసం ఎక్కువ. నిల్వకు పనికిరావు.

పచ్చడికాయ రకాలు :

జలాల్ : పచ్చడి రకం. కాయ పెద్దది. ఆమని, తెల్లగులాబి, తంబ్వి, చిన్నరసం.

మెగ్నీషియం మామిడి పంటకు చాలా అవసరం. ముఖ్యంగా బోరాన్ ధాతువు, పూతలో ఆడపుష్పాలు ఎక్కువ వచ్చుటకు, పూత ఎక్కువ రోజులు నిలుచుటకు, ఫలదీకరణ బాగా జరుగుటకు తోడ్పడును. కనుక బోరాక్స్ రూపంలో ఒక చెట్టుకు 50-75 గ్రా భూమిలో కలిపివేయడం మంచిది.

జింక్ సల్ఫేట్ 150 గ్రా. మరియు మెగ్నీషియం సల్ఫేట్ 150 గ్రా. ఒక చెట్టుకు పాదుల్లో వేసి మట్టితో కలిపి నీరు పెట్టాలి.

చెదపుట్టలు :

నిర్లక్ష్యం చేసిన కొన్ని తోటల్లో చెదపుట్టలు వచ్చి కాండంపై మరియు వేర్లలో కూడా చెదగూళ్ళు వ్యాపించి, చెట్లు క్షీణించి క్రమేపి చనిపోతాయి. కాండంపై ఉన్న చెదగూళ్ళను గోనెసంచితో రుద్ది తొలగించాలి. తర్వాత కాండంపై ఒక మీటరు ఎత్తువరకు ఇంజన్ ఆయిల్ మడ్డిని పూతగా పూయవచ్చు లేదా క్లోరిపైరిఫాస్ 5 మి.లీ. లేదా వేపనూనె 50 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పూతగా పూయాలి.

కాండం చుట్టూ మొదళ్ళలో క్లోరిపైరిఫాస్ 5 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపిన ద్రావణాన్ని మట్టి తడియున్నట్లుగా (5.10లీ) పోయాలి. తోటలో వున్న చెదపుట్టలను త్రవ్వి భూమిలో ఉన్న రాణి చెదపురుగులను నాశనం చేయాలి. తక్కిన చెదపుట్టల్లో కూడా క్లోరిపైరిఫాస్ ద్రావణం చల్లాలి.

పై సూచనలను తగు సమయంలో పాటించి, ఆకు పురుగులు, తేనెమంచు లేదా రాతిమంగు, ఆకుమచ్చ తెగుళ్ళు లేకుండా ఆరోగ్యమైన, నాణ్యమైన మామిడిపండ్లను పండించవచ్చును. ✧

అరటి

కర్పూర : కాయలు పసుపు, రవాణా తట్టుకొనును.

తెల్లచక్కెరకేళి : తోలు మందం, గుజ్జు పసుపు, తీపి, రవాణాకు అనుకూలం అమృతపాణి (రస్తాలి) : చెట్టు పొడవు, కాయలు పసుపు. పనామా తెగలు సోకును. వామనకేళి, డార్ఫ్ కేవెండిష్, చిన్న పచ్చ అరటి, చీటావాలా, శిద్ధ వామనకేళి, డార్ఫ్‌కేవెండిష్, చిన్న పచ్చఅరటి, చీటావాలా, శిద్ధ వామనకేళి, పొట్టి రకాలు, ఆకుపచ్చకాయలు, నిల్వకు పనికిరావు.

పచ్చబొంత : కూరఅరటి, కాయ అంచులు కన్పిస్తాయి.

కొవ్వూరి బొంత : కూరరకం. పెద్దకాయలు, కాయ అంచులు కన్పించవు. యం.సి. 90-01 : కూర అరటి, అంచులు కన్పిస్తాయి.

ద్రాక్ష

అనాబ్ -యి-షాహి : పెద్ద గెల, పండ్లు లేత ఆకుపచ్చ, గింజలుండును.

దిల్‌కుష్ : పండ్లు పొడవు, గింజలుండును. కాలిసాసెబి :పండ్లు నలుపు, పెద్దవి, గింజలుండును. తాంసన్ సీడ్‌లెస్ : పండ్లు చిన్నవి. కోల విత్తనాలు వుండవు.

తాస్-ఎ-గణేష్ : తాంసన్ సీడ్‌లెస్ మ్యుంటెంట్.

కిస్‌మిస్ చర్ని: నల్లరంగు గింజలేని రకం. గుత్తి మధ్యస్థం.

కిస్‌మిస్ రోజ్‌విజ్ : గింజలు లేని రకం. ఆకర్షణీయమైన రంగు.

పుచ్చ

చారలు కాయలు : BSS 2000, సెమినిస్ అపూర్వ, నమ్‌హెన్స్, మధుబాల, అంకూర్ కషిష్, నాంధీరి NS. 295, జె.కె.లేఖ, నూజివీడు 117, ఈస్ట్ వెస్ట్ టైగర్, యుపిఎల్ సాగర్.

నీలి నలుపు కాయలు : బి.ఎస్.ఎస్. 408, ఈస్ట్ వెస్ట్ అండమాన్, యుపిఎల్ రస్‌బహార్, నూజివీడు స్వీట్‌బేబి.

ఖర్బూజా

తెల్లకండ రకాలు : అర్కరాజహంస్ (కోల, పండుపై సన్నని గీతలు), అర్కజీత్ (చిన్నవి, బల్లపరుపుపై పొర నారింజరంగు).

నారింజరంగు కండగల రకాలు : పూసా షర్బత్ (గుండ్రని) పూసా మధురస్ (గుండ్రని, బల్లపరుపు), పంజాబ్ సునహరి (పైతొక్క లేత ఆకుపచ్చ).

ఆకుపచ్చ కండగల రకాలు : హరమధు (గుండ్రని, చదును), దుర్గాపుర మధు (కోల)

రేగు : గోల (గుండ్రని, పసుపురంగు) కైధిలి (కోల, నారింజరంగు) సెబ్ (యాపిల్ ఆకారం పళ్ళు), టెకడి (అండాకారం, ఎరుపు), ఉమ్రాన్ (కోల ఆకారం పళ్ళు)

ఉసిరి

బలవంత్ (కాయలు పెద్దవి గుండ్రని, లేత ఆకుపచ్చ, పింకువర్ణం (మిళితం)

నీలం : పెద్దవి, ఆకుపచ్చ కలిసిన తెలుపురంగు, కాంచన్ (పసుపురంగు, ఆకుపచ్చ మిళితం) బి.ఎన్.ఆర్-1 (పింక్ రంగు, చిన్నవి)

అనాస : సింహాచలం (చిన్నవి, కాయగుజ్జు లేతపసుపురంగు, పులుపు, క్యూ (పెద్దవి, పెద్దకన్నులు, గుజ్జు, పసుపురంగు)

ఆయిల్‌పామ్ : టెనెరా

కాఫీ : కావేరి, సెలెక్షన్ -5,6,9

కోకో : క్రయిల్లో : చిన్నకాయ, ఎరుపు రంగు కాయ

ఫొడాస్టెరో : పెద్దసైజు కాయ, ఆకుపచ్చరంగు

పనస : బురద పనస (మెత్తనికండ), కొబ్బరి పనస (గట్టికండ), తేనెపనస (మధ్యస్థ గట్టి కండ, గట్టి కండలో సింగపూర్, పాలూరు ప్రాచుర్యంలో వున్నాయి.

బంతిపూలు : ఆఫ్రికన్ రకాలు (ట్యాజిటస్ ఎరెక్టా) పొడవు మొక్కలు పెద్దపూలు పూసా నారంగిగైండా (ముదురు నారింజరంగు) పూసా బసంతిగైండా (నిమ్మపసుపు రంగుపూలు) ఫ్రెంచి రకాలు (ట్రాజిటస్ ఫ్యాటులా) పొట్టి మొక్కలు, చిన్న పూలు ఈ రకాలు వాణిజ్యపరంగా సాగులో లేవు.

ప్రయివేటు రకాలు : ఈస్ట్ వెస్ట్ ఎల్లాడాలర్ (పసుపురంగు), ఐ & బి.సియానా (ఆరంజి రంగు), రాశి ఎల్లో గోల్డ్ (పసుపురంగు) టొకిటా ఎల్లో (పసుపురంగు)


గులాబి పూలు : కాకినాడ గులాబి ఎడ్వర్డ్

కట్‌ఫ్లవర్ రకాలు: సూపర్‌స్టార్, గ్లాడిఏటర్, పూసాషర్బత్, ప్యారడైస్

మల్లె : పారిమల్లె, కో1, కో2, గుండుమల్లె, ఖోయా

కనకాంబరం : అర్కకనక, అర్క అంబర్, ఆరెంజి, బాటియా ఎల్లో, సెబాక్యులస్ రెడ్

చామంతి : లోకల్ రకాలు - నక్షత్ర చామంతి (చిన్నపూలు), పట్నం (మధ్యస్థ, పెద్దపూలు) పూస అనమోల్, పూసా సెంటినరి, పూసా ఆదిత్య, పూసా చిత్రాక్షి, పూసా కేసరి, ఎల్లో గోల్డ్. ✧



పశు పోషకులు ఈ దిగువ పేర్కొన్న అంశాలపై అవగాహన పెంచుకుంటే

పశువుల ఆరోగ్య సంరక్షణతోపాటు అధిక లాభార్జన

వర్షాభావ పరిస్థితులలో పశుగ్రాస యాజమాన్యం :

వర్షాభావ పరిస్థితుల్లో పటిష్టమైన ప్రణాళికలతో పశుగ్రాస పెంపకము, వాడకము, ఆదా చేయుటకు మొదలగు చర్యలు చేపట్టి సాధారణ పరిస్థితులు ఏర్పడే వరకు పశుగ్రాస కొరత రాకుండా చూసుకోవాలి.

నీటి వసతి గల ప్రాంతాల్లో పశుగ్రాస పెంపకం ప్రోత్సహించి అవకాశం ఉన్న చోట చెరువులు, వాగులు, లోతట్టు ప్రాంతాల్లో సామూహిక పశుగ్రాస పెంపకం చేపట్టాలి.

అదే విధంగా ప్రతి సంవత్సరం వర్షాభావ పరిస్థితులు ఏర్పడుచున్నచో సైలేజి (పాతర గడ్డి) పద్ధతిపై రైతులు అవగాహన ఏర్పరచుకోవాలి.

పచ్చిమేతను పాతర వేసి నిలువ చేయుట (సైలేజి) :

పచ్చిమేతలోని పోషక విలువలు తగ్గకుండా గుంటలలో గాలి చొరబడకుండా, పాతర వేసి, పులియబెట్టి నిలువ చేసిన మేతను సైలేజి అంటారు. దీనినే వాడుక భాషలో మాగుడు గడ్డి లేదా పాతర గడ్డి అని పిలుస్తారు. ఈ పద్ధతిలో తక్కువ స్థలంలో ఎక్కువ గడ్డిని నిలువ చేసుకోవచ్చు. సంవత్సరం పొడవున ఒకే విధమైన నాణ్యమైన పచ్చి మేతలను పాడిపశువులకు అందుబాటులో ఉంచగలగటం వలన కరువు సమయాలలో మరియు ఎండా కాలంలో కూడా పాల ఉత్పత్తి తగ్గకుండా చూసుకోవచ్చు.

సైలేజి తయారికి అనువైన పశుగ్రాసాలు :

పాలదశ కంకులతో ఉన్న మొక్కజొన్న, జొన్న మరియు సజ్జ లాంటి ధాన్యపు జాతికి చెందిన ఏక వార్షికాలు సైలేజి తయారికి బాగా అనువైనవి. లెగ్యూమ్ జాతి పశుగ్రాసాలలో లూసర్న్, బొబ్బర లాంటి మిశ్రమ సైలేజి తయారీకి (ఒక పాలు లెగ్యూమ్ మూడు పాళ్ళ ధాన్యపు జాతి పశు గ్రాస మిశ్రమం) బాగా అనువైనది.

మూడు టన్నుల పచ్చిమేత నిలువ చేసుకొనుటకు పాతర సైజు :

2.75 మీటర్ల పొడవు, 2.75 మీటర్ల వెడల్పు, 1.5 మీటర్ల లోతు. శాశ్వత నిర్మాణం కొరకు పాతర యొక్క గోడలను ఇటుకలతో నిర్మించుకోవాలి. లోపల పాలథీన్ షీట్ వేసి గడ్డి నింపుకోవచ్చు.

కావలసిన పదార్థాలు :

పచ్చిమేత (ముక్కలుగా కత్తిరించినది), మొలాసిస్ (టన్నుకు 3 కేజీలు), ఉప్పు (టన్నుకు 10 కేజీలు), సైలాల్ (టన్నుకు 10 గ్రాములు)

సైలేజి తయారు చేయు విధానం :

జొన్న పశుగ్రాస రకాలలో ఏదో ఒక రకాన్ని ఎన్నుకొని 85 నుండి 90 రోజుల పంట దశలో కోసుకుని చాఫ్ కట్టర్ ద్వారా చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించుకోవాలి. ముందుగానే తయారు చేసుకున్న గోతిలో ఈ కత్తిరించిన మొక్క జొన్న గ్రాసాన్ని ఒకటిన్నర అడుగుల మందం వచ్చే వరకు నింపి గాలి జొరబడకుండా బాగా అణగదొక్కాలి. దీనిపై సైలాన్ ద్రావణం, మొలాసిన్ కలిపిన నీళ్ళు చల్లాలి. ఇలా ముక్కులు ముక్కలుగా కత్తిరించిన మొక్క గ్రాసాన్ని పొరపొరలుగా నింపుతూ గాలి చొరబడకుండా అణగద్రొక్కుతూ పాతర నింపుకోవాలి. నిండిన పాతరను ప్లాస్టిక్ షీటుతో కప్పి గాలి చొరబడకుండా మట్టితో లేదా ఇసుక బస్తాలతో మూసి వేయాలి. మూసిన తరువాత 45 రోజులు మగ్గనిచ్చి ఆ తరువాత వాడుకోవచ్చు. ఇది మగ్గిన పాతర గడ్డి తియ్యని వాసన వస్తుంది కావున పశువులు ఇష్టంగా తింటాయి.

పాటించాల్సిన జాగ్రత్తలు :

వర్షం నీరు పాతరలోకి ఇంకకుండా సరైన ప్రదేశంలో పాలరను ఏర్పాటు చేసుకోవాలి. గడ్డిపాలర గాలి రాకుండా బాగా అణగద్రొక్కాలి. గాలి ఉన్నచో పాతరలో బూజు పట్టి గడ్డి తినడానికి పనికిరాకుండా పోతుంది.

ఒక పాతరలోని గడ్డి వాడటం మొదలు పెడితే ఒక నెలలోనే పూర్తిగా వాడి వెయ్యాలి. పశుగ్రాసంలో బాగా తేమ ఉన్నప్పుడు గడ్డి కోసిన తరువాత ఒక రోజు నిలువ వుంచి పాతర తయారు చేయడానికి వాడుకోవాలి. పాతర గడ్డి తయారు చేయడానికి పశు గ్రాసంలో 65% తేమ ఉంటే చాలు.

అజోల్లా తయారీ విధానం :

పశువు దాణాలో వాడే వేరుశనగ చెక్క ప్రత్తి చెక్కలు ఖర్చుతో కూడుకున్నవి కావటం వలన వాటి ప్రత్యామ్నాయంగా 25% ప్రోటీన్లు గల అజోల్లా వాడటం వలన దాణా ఖర్చు తగ్గించుకోవచ్చు.

అజోల్లా ఆకుపచ్చ ఫెర్న్ జాతికి చెందిన మొక్క ఇది. నీటిపై తేలియాడుతూ ఉంటుంది.

ఎండబెట్టిన అజోల్లాలో 20% నుంచి 30% మాంసపు కృత్తులు 10 నుంచి 15% మినరల్సు మరియు కెరోటిన్, బి 12 విటమిన్లు ఎక్కువగా ఉంటాయి.

రోజూ 1 నుండి 2 కేజీలు అజోల్లాలను పాడి పశువులకు మేపటం వలన పాల దిగుబడిలో 15 నుండి 20% వృద్ధి సాధించవచ్చు.

తాజా అజోల్లాను 1:1 నిష్పత్తిలో పశువుల దాణాల్లో కలిపి వాడటం వలన దాణా ఖర్చులు తగ్గటమే కాక వెన్న శాతము

మరియు ఎస్.ఓన్.ఎఫ్. పెరుగుట వలన ప్రతి లీటరు పాలకు 1 నుంచి 2 రూపాయలు అధిక ఆదాయం పొందవచ్చును.

అజోల్లా ఉత్పత్తి విధానం :

రోజూ 2 కిలోల అజోల్లా ఉత్పత్తి చేయుటకు 3.25×2 మీటర్లు సైజులో తొట్టి తయారు చేసుకోవాలి. ముదంఉగా భూమిపై కలుపును పూర్తిగా తొలగించి సమానముగా చదును చేసుకోవాలి.

కొలతల ప్రకారం 15 సెం.మీటర్లు లోతు గొయ్యి తీసుకుని చుట్టూ ఇటుకలు పేర్చుకోవాలి. ఇలా తీసుకున్న గోతిమీద మందమైన సిల్పాలిన్‌షీట్ వేసి షీట్ చివరన ఇటుకలపై అంచుల వరకు వచ్చేటట్లు చూడాలి. ఇలా తయారు చేసుకున్న తొట్టె లోతు షుమారు 1 అడుగు లోతు ఉండేటట్లు చూసుకుని అందులో 30 నుండి 35 కేజీల భూసారం గల మట్టిని జల్లెడ పట్టిన తరువాత సమానంగా పరుచుకోవాలి.

దీని తర్వాత 4 నుండి 5 కిలోల పరిమాణం గల 2 నుంచి 5 రోజుల పశువుల పేడను 15 నుంచి 20 లీటర్ల నీటిలో కలిపి దీనికి 40 గ్రాముల మినరల్ మిక్చర్‌ను కలిపి తొట్టెలోని మట్టి మీద పొయ్యాలి. తరువాత దీని మీద నీటిని 10 సెం.మీటర్లు లెవల్ ఉండేటట్లు నింపుకొని కలియ తిప్పాలి. ఇలా తయారు చేసుకున్న అజోల్లా తొట్టెలో 1 నుంచి 2 కిలోల తాజా అజోల్లా మదర్ కల్చర్‌ను సమానంగా చల్లాలి.

అజోల్లా పెంపకానికి డైరెక్టుగా సూర్యకాంతి పడే చోటుగాని మరియు ఎక్కువ నీడ గల ప్రదేశం గాని అనుకూలంగా ఉండదు. అంతే కాకుండా చెట్ల ఆకులు ఈ తొట్టెలో పడితే అవి కుళ్ళిపోయి అజోల్లా చనిపోయే ప్రమాదం ఉంది. కావున ఈ తొట్టెపై కర్రల సాయంతో 50% షేడ్ నెట్‌ను ఏర్పాటు చేసుకొనవచ్చును.

అజోల్లాతొట్టె తయారు చేసుకొనుటకు కావలసిన వస్తువులు వాటి షుమారు ఖరీదు

250 జిఎస్ఎమ్ టార్పాలిన్ షీట్ (12×9 అ.) రూ॥ 480

షేడ్ నెట్ (3×4 మీటర్లు) రూ॥ 160

50 ఇటుకలు రూ॥ 250

అజోల్లా తీసుకొనుటకు గరిటె రూ॥ 90

1 కేజీ మినరల్స్ మిక్చర్ రూ॥ 70

షేడ్ నెట్ ఏర్పాటు చేసుకొనుటకు కర్రలు, తాడు రూ॥ 500

షుమారు 1,600లలో 2 కేజీల అజోల్లా ఉత్పత్తి చేయుటకు కావలసిన తొట్టెను నిర్మించుకోవచ్చు.

తీసుకోవలసిన జాగ్రత్తలు :

గుంటలోని నీటి మట్టం 5 సెం.మీటర్లు తగ్గకుండా 4 మూలల సమానంగా నీరు ఉండేటట్లు చూసుకోవాలి.

10 రోజులకు ఒకసారి బెడ్‌లో నాలుగోవంతు నీటిని తీసివేసి కొత్త నీటితో నింపాలి. 60 రోజుల కొకసారి బెడ్‌లోని మట్టిని తొల గించి కొత్త మట్టి పేడ మరియు మినరల్ మిక్చర్‌తో నింపుకోవాలి.

అజోల్లా ఫంగస్ లేదా తెగుళ్ళ బారిన పడినపుడు పూర్తిగా తొలగించి తాజా కల్చర్‌ను వేసుకోవాలి.

మొలకగడ్డి పెంపకం (హైడ్రోఫోనిక్స్ గడ్డి) :

పాడికి ఆధారం పచ్చి మేత, సాంప్రదాయ పద్ధతిలో పశు గ్రాసం సాగు చెయ్యాలంటే నీటి వసతికల భూమి అవసరం. భూ వసతి లేకుండానే అతి తక్కువ నీటి వినియోగంతో తక్కువ ఖర్చుతో పచ్చి మేతను సాగుచేసే పద్ధతే ఈ హైడ్రోఫోనిక్స్ విధానం.

షెడ్ నిర్మాణం :

5 పశువులకు అవసరమయ్యే మొలక గడ్డిని ప్రతి రోజు తయారు చేసుకోవటానికి వీలుగా 8×8×8 అడుగుల కొలతలతో యాంగ్లర్‌తో పందిరి ఏర్పాటు చేసుకోవాలి. ఈ పందిరి చుట్టూ 75% షేడ్ నెట్‌ను గదిలాగా ఏర్పాటు చేసుకోవాలి. దీనిలోపల ట్రేలను పెట్టుకొనుటకు ఇనుము స్టాండ్‌లను చిత్రంలో చూపిన విధంగా ఏర్పాటు చేసుకోవాలి. ఈ స్టాండ్‌పై ప్లాస్టిక్ ట్రేలను పెట్టుకోవాలి.

షెడ్ లోపల 25 నుంచి 30 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత మరియు 60 నుంచి 65 శాతం తేమ ఉండేటట్లు చూసుకోవాలి.

నాణ్యమైన 100 శృతం మొలకెత్తే 5 కేజీల విత్తనాలను ఎంపిక చేసుకొని 100 గ్రాముల సున్నం కరగపెట్టిన 5 లీటర్ల నీటిలో 2 సార్లు శుద్ధి చేసుకోవాలి. ఆ తర్వాత 12 గంటలకు మంచి నీటిలో నానబెట్టాలి. ఆ తర్వాత మరో 12 గంటలు గోనె సంచిలో మొలక కట్టాలి. ఈ విధంగా మొలకెత్తటం ప్రారంభించిన విత్తనాలను 4 నుండి 5 చదరపు అడుగులు కల ప్లాస్టిక్ ట్రేలలో చక్కగా ఉన్నట్లు పరచాలి.

తరువాత 7 రోజుల పాటు 2 నుండి 3 గంటలకొకసారి మైక్రో స్పింక్లర్స్ ద్వారా 1 నిమిషం పాటు నీరు పిచికారి అయ్యేటట్లు చూడాలి.

6వ రోజు మరియు 7వ రోజు 1 లీటరు నీటిలో 100 గ్రాముల యూరియా కలిపి రోజులో 1 సారి స్ప్రే చేసినట్లైతే అధిక పశుగ్రాస ఉత్పత్తి పొందవచ్చును.

ఈ పద్ధతి ద్వారా 8 రోజులలో 1 కిలో విత్తనము నుండి షుమారు 10 కేజీల పచ్చి మేత పొందవచ్చు. 8వ రోజు వేర్లతో సహా మొలకగడ్డిని పశువులకు మేపుకోవచ్చు.

మొలక పద్ధతిలో ఉత్పత్తి చేసిన గడ్డిలో 15 నుంచి 17 శాతం మాంసపు కృత్తులు 25% పీచు పదార్థాలు ఉంటాయి. దీని వలన పాల ఉత్పత్తి 15 నుండి 20 శాతం పెరగటమే కాకుండా పశువుల వ్యాధి నిరోధక శక్తిని పొంది ఆరోగ్యంగా ఉంటాయి.

గడ్డిని చాఫ కట్టర్‌తో ముక్కలుగా చేసి మేపటం వలన ఉపయోగాలు: మేత వృధాను అరికట్టవచ్చు. అనేక రకాల పశుగ్రాసాలను కలిపి వృధాకాకుండ వినియోగించవచ్చు.

పశుగ్రాసాల కాండాలు, చొప్పలను అంగుళం సైజు కత్తిరించి మేపటం వలన పశువులు సులభంగా ఇష్టంగా పూర్తిగా తింటాయి. పాలల్లో వెన్నశాతం కూడా పెరుగుతుంది. ✧

కూరగాయ పంటలు - అనువైన వంగడాలు

(గత సంచిక తరువాయి)

కూర మిరప (బెంగుళూరు మిర్చి)

కాలిఫోర్నియా వండర్ - కాయలు ఆకుపచ్చ రంగు - 10-150 రో॥ దిగుబడి 6-7 ట/ఎక

అర్కబసంత్ : కాయలు లేత పసుపు రంగు, 125-140 రో॥ దిగుబడి 7 ట/ఎక

అర్కగౌరవ్ : లేత కాయలు ముదురు ఆకుపచ్చరంగు. పూర్తిగా పెరిగాక నారింజరంగుకు మారును. దిగుబడి 7-8 ట/ఎక

అర్కమోహిని - కాయలు ముదురు ఆకుపచ్చ, పండిన తర్వాత ఎరుపు, చాలాపెద్దవి 180-200 గ్రా॥, 120 రో॥

గ్రీన్ గోల్డ్ హైబ్రిడ్ : కాయలు ఆకుపచ్చ, అన్ని రుతువులకు అనువైనది.

భరత్ హైబ్రిడ్ : కాయలు ముదురు ఆకుపచ్చ

ప్రయివేటు హైబ్రిడ్‌లు :

బిజోసీతల్ ఐశ్వర్య : కాయలు ఆకుపచ్చ

బిజోసీతల్ 399 : కాయలు పసుపు రంగు

ఇండో అమెరికన్ ఇంద్ర : కాయలు ఆకుపచ్చ, అధిక దిగుబడి

వివిఎన్ఆర్ 602 : కాయలు ఆకుపచ్చ

చిక్కుడు

ఓపి రకాలు : పందిరిరకాలు :

పూసా ఎర్లీ ప్రొలిఫిక్ (పి.ఇ.పి) : కాయ సన్నం, కొడవలి ఆకారం, 200-215 రో॥ కాయ 9.3 సెం.మీ. పొడవు.

దీపాలీవాల్ : కాయలు చాలా పొడవు (18.4 సెం.మీ) లేత ఆకుపచ్చ, గింజల దగ్గర ఉబ్బెత్తు 200-210 రో॥

పూసాసెమ్-2 : విత్తిన 120 రోజులకు కాపు. కాయలు గుత్తుల్లా ఆకులపై కనపడును. 15-17 సెం.మీ. పొడవు. పేనుబంక, కాయపుచ్చు చలిని తట్టుకొనును. దిగుబడి 22 ట/ఎక

పూసాసెమ్ - 3 : గుత్తికి 10-12 కాయలు, పొడవు 15 సెం.మీ. ఆకుమచ్చ, పేనుబంక కాయపుచ్చు, తేనెమంచు తెగుళ్ళను తట్టుకొనును. దిగుబడి 27 ట/ ఎక

ఆర్ఎన్‌డి - 1 : పొడవు కాయలు 15-20 సెం.మీ. 130-150 రో॥లకు పూత. రవాణాకు నిల్వకు అనువైన రకం. దిగుబడి 18 ట/ఎక. పంటకాలం 210-250 రో॥

పొద రకాలు :

అర్కజయ : లేత ఆకుపచ్చ, కొద్దిగా వొంపు వుండు కాయలు, 55 రో॥ కోత మొదలు. దిగుబడి / 5ట/ ఎక

అర్క విజయ : కాయలు పొట్టి, ముదురు ఆకుపచ్చ 50-60 రో॥ కోత, దిగుమతి 5 ట/ఎక

సింజెంటా ఫ్లోరా : మార్కెట్ గిరాకీ ఓపి రకం.

రావులపాలెం స్పెషల్ : మార్కెట్ గిరాకీ గల లోకల్ రకం.

ఎస్.ఆర్.ఐ. గణేష్ : ప్రయివేట్ రకం.

కొంకణి భూషణ్ : ప్రయివేటు రకం.

గోరు చిక్కుడు

1. పూసా మౌసమి : 70-80 రో॥ కోత మొదలు, కాయలు 10-12 సెం.మీ.
2. పూసా సదాబహర్ : 45-50 రో॥ కోత మొదలు కాయలు 12-13 సె.మీ.
3. పూసానవబహార్ : కాయలు 10-12 సెం.మీ. పొడవు.

ప్రయివేటు రకాలు : 1) నీలం 2) నమ్రత (నిర్మల్‌కంపెనీ) 3) స్పిక్ పిఎన్‌బి, 4) గౌరి, 5) అంకూర్ రాణి 6) వ్యాగ్రో చిత్రగోల్డ్.

ఫ్రెంచి చిక్కుడు

కంటెండర్ : కాయ గుండ్రన, ముదురు ఆకుపచ్చ, 55 రో॥ కోత మొదలు.

బౌంటిపుల్ : కండ ఎక్కువ, 75 రో॥ కోత మొదలు

అర్కకోమల్ : కాయపొడవు, ముదురు ఆకుపచ్చ.

పూసా పార్వతి : కండ ఎక్కువ, ముదురు ఆకుపచ్చ, 45-50 రో॥ కోత మొదలు.

ప్రీమియర్ : కాయచదును, లేత ఆకుపచ్చ, 45 రో॥ కోత మొదలు

కూర అలసంద

1) పూసాబర్సాతి, 2) అర్కగరిమ 3) ఎవర్‌గ్రీన్ (వెస్టర్న్ సీడ్స్), 4) బాలి (ఈస్ట్‌వెస్ట్ సీడ్స్)

బఠాని

స్వల్పకాలిక రకాలు :

1. ఎర్లీ బాడ్జర్ : ముడత గింజల్లు, 55 రో॥ కోత మొదలు
2. ఆర్కెల్ : ముడత గింజలు, 60 రో॥ కోత మొదలు
3. జవహర్‌మీటర్ (జె.యం.4) - ముడత గింజలు, ఆకుపచ్చన
4. మీటియార్ : గింజలు నునుపు, 60 రో॥ కోతలు మొదలు

మధ్యకాలిక రకాలు :

1. బాన్‌విల్లీ : గింజలు ముడతగలవి, తీపి, 85 రో॥ కోత మొదలు,
2. జవహర్‌మీటర్ (జె.యం.1) గింజలు పెద్దవి 3) ఐ.పి.3 (పంత్ ఉపాహర్) : గింజలు మధ్యస్థం.

దీర్ఘకాలిక రకాలు :

1. ఎన్.పి.29 : గింజలు ముడత గలవి. కోత 100 రో॥ మొదలు.


(ఇంకా వుంది)

రైతు ఉద్యమ వార్తలు

తక్షణం జీవో నెం. 271ని రద్దు చేయాలని కోరుతూ

రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు

కర్నూలు : భూమిపై రైతులకుగల యాజమాన్య హక్కులు హరించే జీవో 271ను వెంటనే రద్దుచేయాలని అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కర్నూలుజిల్లా పత్తికొండలో రైతులు ఆగస్టు 3న స్థానిక చదువులరామయ్య భవనం నుంచి ర్యాలీగా వెళ్లి నాలుగు స్తంభాల మంటపంవద్ద ధర్నా నిర్వహించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి. రామ చంద్రయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఈ పాస్ పుస్తక విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. జీఓ నెంబర్ 271ని వెంటనే రద్దుచేయాలని, ఎన్‌టీఆర్ ప్రవేశపెట్టిన పట్టాదార్ పాస్ పుస్తకం, టైటిల్‌డీడ్‌లను యధావిధిగా ఉంచాలన్నారు. చంద్రబాబు ఆన్‌లైన్లో ఈపాస్ పుస్తకాలను పెట్టడం వల్ల రైతులు పంట రుణాలు, బ్యాంకులో అప్పులు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే 271 జీఓను రద్దు చేసి రైతులకు పాతపద్ధతిలో పాస్‌బుక్‌లు, వన్ బి,ఆర్‌ఓఆర్, టైటిల్ డీడ్ ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో అన్ని రైతుసంఘాల ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజాసాహేబ్, రైతుసంఘం అఖిలపక్షం కమిటీ నాయకులు రంగారెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీరంగడు, మల్లికార్జున, మోహన్ కృష్ణలు పాల్గొని మాట్లాడారు. అనంతరం తహశీల్దార్ నాగభూషణ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తిమ్మయ్య, కారెన్న, గాంధీ రెడ్డి, బజారప్ప,బ్రహ్మయ్య, నాగిరెడ్డి, పెద్ద ఈరన్న, మోహన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జి.ఓ నెం 271ని రద్దుచేయాలని కోరుతూ అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.




ఈ ధర్నా కార్యక్రమానికి ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి. సోమన్న అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె జగన్నాథం, వైకాపా రైతు విభాగం నాయకులు పి. ప్రతాప్‌రెడ్డి, భరత్‌రెడ్డి, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎ కృష్ణా, రైతుసంఘం జిల్లా నాయకులు సి వీరన్న, హంద్రీనీవా పరిరక్షణ సమితి జిల్లా నాయకులు ఎం.రామకృష్ణారెడ్డి, రైతుసంఘం జిల్లా నాయలు జి. ఆంజనేయులు తదితరులు పాల్గొని ఈ జీవో వల్ల కలిగే నష్టాల గురించి మాట్లాడారు. పక్కీరయ్య, జి రామకృష్ణ, పర్లమద్దిలేటి, పుల్లన్న, వైకాపా నాయకులు ఖాన్, శేషగిరి, మహేష్, తదితరులు పాల్గొన్నారు. .

ఆదోని : ప్రభుత్వం ఈ పాస్ పుస్తకాల అమలు విధానాన్ని ఎత్తివేయాలని అఖిల పక్ష రైతుసంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పాస్ పుస్తకాల అమలును వ్యతిరేకిస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతుసంఘం జిల్లా నిర్వాహక అధ్యక్షులు లక్ష్మిరెడ్డి అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. రైతుసంఘం నియోజకవర్గ అధ్యక్షులు నర్సప్ప, నాయకులు రాము, సుదర్శన్, ప్రకాష్, గుడిసె ఈరన్న, సిపిఐ(ఎం) శేఖర్, లక్ష్మన్న, సిపిఐ(ఎంఎల్) ఎంకప్ప, తిక్కన్న, రైతు కూలీసంఘం జిల్లా కార్యదర్శి ప్రసాద్, వైసిపి నాయకులు గోపాల్‌రెడ్డి,

శేషిరెడ్డి,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం రైతులు డిప్యూటి తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. గోనెగండ్ల రూరల్, నందవరం, దేవనకొండ, ఎమ్మిగనూరు టైన్, పెద్ద కడుబూరు, ఆస్పరి, నందికొట్కూరు, రుద్రవరం, ఆలూరు, కౌతాళం రూరల్ తదితరు మండల కేంద్రాలలో తహశీల్దార్ కార్యలయాల వద్ద ధర్నాలు నిర్వహించి సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా కోరుతూ వినతిపత్రాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా మండల కేంద్రాల రైతుసంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది..

ప్రకాశం - త్రిపురాంతకం : భూమిపై రైతుకు గల యాజమాన్య హక్కులు హరించే జీవో 271ని నిలుపుదలచేయాలని త్రిపురాంతకం మండల తహశీల్దారు కార్యాలయంవద్ద రైతులు, రైతు సంఘాల సభ్యులు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ 1971 ఆర్‌ఓఆర్ చట్టానికి 1989లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు సవరణ చేసి భూమిపై హక్కులు నిర్ధారిస్తూ యాజమాన్య హక్కుపత్రం టైటిల్‌డీడ్‌ను రైతులకు అందజేశారన్నారు. దీంతో రైతుకు భూమిపై భద్రతతో పాటు భరోసాకల్గిందని, జీవో 271 ప్రకారం వన్‌బి కంప్యూటర్‌లో ఎవరిపేరు నమోదు అయితే వారిదే ఆ భూమి. దానికి ఏ ఆధారం అవసరం లేదన్నారు. తరతరాలుగా సంపాదించే హక్కులు పొంది భూ యాజమాన్య హక్కుపత్రం కలిగిస్వాధీనంలో ఉండి సాగు చేస్తున్నా కూడా వన్‌బీలో ఆ రైతు పేరు లేకపోతేఆ భూమిపై హక్కు లేనట్టే ఇది జీవో సారాంశం. వన్‌బీ నమోదులో అనేక తప్పు నమోదులు వున్నాయి. పాసుపుస్తకాల్లో వున్న సర్వే నెంబర్ వన్‌బీలో నమోదు కాలేదు. పట్టా భూములు,ప్రభుత్వ దేవాదాయభూములు మురుకు కాలువలుగా, కుంట డొంకలుగా నమోదు అయ్యాయి. తండ్రి లేక భర్తపేర్లులేక 80 శాతం వరకు ఖాళీగా వున్నాయి. ఇలా అనేక తప్పులు వున్నాయనికావున జీవో 271ని నిలుపుదల చేయాలని అఖిలపక్ష రైతు సంఘాలుఆందోళన చేసి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా రైతుసంఘ అధ్యక్షులు డి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రామయ్య, దాసరి మల్లికార్జునరావు, కిలారు సుబ్బారావు, కేవీ రమణారెడ్డిఇతరులు పాల్గొన్నారు.

అద్దంకి : అద్దంకి తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న ఆంధ్ర ప్రదేశ్‌రైతుసంఘం నాయకులు మానం వెంకటనారాయణ మాట్లా డుతూ రైతులు తమ భూములకు సంబంధించి రెవెన్యూ రికార్శులలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. తమ స్వాధీనంలో వున్న భూములకు రెవెన్యూ రికార్శులలో వున్న భూములకు పొంతన లేకుండా పోయిందన్నారు. ధర్నా అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ అశోకవర్ధన్‌కు రైతుసంఘాల నాయకులు అందజేశారు. ఈ ధర్నాలో ఆంధ్రప్రదేశ్



రైతుసంఘం అద్దంకి నియోజక వర్గ కార్యదర్శి యడ్లపల్లి శింగయ్య, గౌరవ అధ్యక్షులు గొల్లపూడి వెంకటేశ్వర్లు కెఎల్‌డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జె.వంగలూరు మండలంలో అద్దంకి నియోజకవర్గ రైతుసంఘ గౌరవాధ్యక్షులు నాయకులు గొల్లపూడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించబడింది.

శ్రీకాకుళం : శ్రీకాకుళం ఎంఆర్‌వో కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు సంబంధించి భూమి హక్కులను ప్రభుత్వం హరించిందన్నారు. తక్షణం ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలు మానుకోవాలని, లేనిపక్షంలోఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన అన్నారు. అనంతరం ఎమ్మార్వో కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మూకల్ల తాతబాబు, గొండురఘురాం, చిట్టి జనార్ధన, ముంజేటి కృష్ణమూర్తి, చల్లా రవి, కైపాడ రాజు, టి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం : భూమిపై రైతుకు గల యాజమాన్య హక్కులు హరించే జీవో 271ను తక్షణమే నిలుపుచేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి పి.గంగాభవాని, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎల్.లక్ష్మిలు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పాస్‌బుక్‌లో ఉన్న సర్వే నెంబర్లు నమోదుకాలేదని,1వి నమూనాలో అనేక తప్పులు నమోదై ఉన్నాయని పట్టా భూములు, ప్రభుత్వ దేవాదాయ భూములుగా, పంటకాలువులుగా, కుంట డొంకలుగా నమోదై ఉన్నాయని ఈ విధంగా తప్పులు ఉండటంతో జీవో నెంబరు 271ను అమలు చేయడం వళన నిజమైనరైతులు, భూములు హక్కుదారుల చేజారే అవకాశం ఉందన్నారు. వినతి పత్రంలో ఉన్న వాటిని కలెక్టర్ పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

రాయదుర్గం : భూమిపై రైతుకు గల యాజమాన్య హక్కులను హరించే జీ.ఓ. నెంబర్ 271ను నిలుపుదల చేయాలని కోరుతూ రైతుసంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ. కాటమయ్య స్థానిక తహసీల్దార్ ఖతీజుల్‌కుబ్రాకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో తాలుకా సిపిఐ కార్యదర్శి నాగార్జున, సిపిఐ ఉప కార్యదర్శి ఫకృద్దీన్, నరసింహులు, సిపిఎం డివిజన్ కార్యదర్శి ఎన్.నాగ రాజు, రైతు

సంఘం మండల కన్వీనర్ జయరామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయ సముద్రంలో : రైతులకు ఇస్తున్న ఈ పాస్ బుక్ విధానాన్నిరద్దు చేసి 1989లో ఎన్‌టిఆర్ ప్రవేశపెట్టినటైటిల్ పాసు పుస్తకాలను కొనసాగించాలని మండల సీపీఐ కార్యదర్శి టి.నారాయణస్వామి, రైతుసంఘం నాయకులు బండిరామకృష్ణ తహశీల్దార్ రామకృష్ణయ్యకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి రామాంజనేయులు, వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కొత్తగా ప్రవేశపెట్టిన ఈ పాస్ పుస్తకాల విధానాన్ని రద్దు చేయాలని అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు స్థానిక డిప్యూటి తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా రైతు సంఘాల నాయకులు మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఈపాస్ పుస్తకాలు అమలు వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతుల హక్కులను హరించే జివో నెం. 271,255లను తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎపి రైతు సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి వన్నారెడ్డి, వైఎస్ఆర్‌సిపి రైతు విభాగం అధ్యక్షులు కెవి చౌదరి, రైతుసంఘం నాయకులు నగేష్, సీపీఎంఅనుబంధ రైతు సంఘం నాయకులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. కణేకల్లు, యల్లనూరు తదితర మండల కేంద్రాలలో తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించి వినతిపత్రాలు సమర్పించడం జరిగింది.

నెల్లూరు జిల్లా ముత్తుకూరు : 1971 ఆర్ఓఆర్ చట్టానికి 1989లో ఎన్.టి.రామారావు సవరణ చేసి భూమిపై గల హక్కును నిర్ధారిస్తూ.. భూమి యాజమాన్య హక్కు పత్రాన్ని (టైటిల్‌డీడ్) రైతులకు అందించారని దానితో రైతులకు భూమిపై భద్రతతో పాటు భరోసా ఉందని రైతుసంఘం జిల్లా కార్యదర్శి బలిజేపల్లి వెంకటేశ్వర్లు, రైతుసంఘం సమైక్య నాయకులు పీఎస్ఆర్ కోటారెడ్డి అన్నారు. తహశీల్దారు కె.చెన్నయ్యకు జీఓ 271ను నిలిపివేయాలని వినతి పత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో షానవాజ్, ఏవీఆర్ నాయుడు, ఎస్. ఆనందరావు, సుధాకర్‌రెడ్డి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి టౌన్ : ఈ-పాస్ పాసు పుస్తకాల అమలు విధానం తగదని, పాసుపుస్తకం, టైటిల్‌డీడ్‌లు రైతుల దగ్గరే ఉండాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్రసమితి పిలుపు మేరకు రైతుసంఘం ఆధ్వర్యంలో మండల తాహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి సూపరింటెండెంట్ జయరామిరెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.భాస్కర్‌రెడ్డి, ఆర్.శ్రీనివాసులు, మణి, కృష్ణమూర్తి, వినోద్, పురుషోత్తం, శ్రీను పాల్గొన్నారు.

పలమనేరు : ఎ. ఉమాపతి నాయుడు, రవీంద్రరెడ్డి అధ్యర్యలో ఈ పాస్ పుస్తకాల అమలు విధానం తగదని తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెడుతున్న ఈ పాసుపుస్తకాల విషయంలో రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుల రుణమాఫీ జాబితాలో చనిపోయిన రైతు కుటుంబాలకు పూర్తి రుణమాఫీ భరోసా కల్పించాలని వారు డిమాండుచేశారు. అనంతరం వినతి పత్రాన్ని తహశీల్దారు శ్రీనివాసన్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ డివిజన్ నాయకుడు చెన్నకేశవులు, శంకరయ్య, వాసుదేవరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, ఎక్స్ యంపిపి వేమన్న, గుర్రప్ప, ఆనంద్ పాల్గొన్నారు. తొట్టంబేడు, ఏర్పేడు తదితర మండల కేంద్రాలలో ధర్నాలు నిర్వహించి తహశీల్దార్‌లకు వినతిపత్రాలు సమర్పించడం జరిగింది.



గుంటూరు జిల్లా : పెదకాకానిలో తహశీల్దార్ కార్యాలయంవద్ద అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి పొన్నూరు నియోజకవర్గ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు సంగుల సంగీతరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన జిల్లా రైతు సంఘం నాయకులు కొల్లి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించకుండా ఏకపక్షంగా జీవో 255, 271లను తీసుకు రావడం అమానుషమని, ఈ జీవోల వలన రైతాంగానికి తీవ్ర ఇబ్బందులు ఎదురౌతాయని వెంటనే ప్రభుత్వం ఈ జీవోలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, వెనిగండ్ల సీపీఐ కార్యదర్శి తోకల వేమారావు, సీపీఐ నాయకులు కోటిపల్లి సత్యనారాయణ, పుల్లంగుల శివయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కంత్తేటి యలమందరావు, సీపీఐ (ఎంఎల్) నాయకులు దానబోయిన భాస్కరరావు, సీపీఐ నాయకులు నాగార్జున, శ్రీనివాసరావు, కె. ప్రసాద్, సుబ్బారెడ్డి, సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జిల్లా - గుడివాడ : పాస్‌బుక్, టైటిల్ డీడ్‌లకు ఏవిధమైన విలువ లేకుండా అలంకారప్రాయంగా మారుస్తున్న 271 జీవోను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని అఖిలపక్ష రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌డీవో కార్యాలయం వద్ద

అఖిలపక్ష రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ తొందరపాటు చర్యల వల్ల ఒకరి భూమి మరొకరి పేర నమోదయ్యే అవకాశముం దన్నారు. రైతుల పాలిట శాపంగామారనున్న జివో·నెం. 271ను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి, ఉల్లంకి నాంచారయ్య, అంకం రమణ, శొంఠి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


కలిదిండి: రైతు పాస్ పుస్తకాలకు విలువ లేకుండా ఈపాస్ పుస్తకాలను మంజూరు చేసే జీఓ 271నురద్దు చేయాలని పలువురు రైతులు ముఖ్యమంత్రిని కోరుతూ తహశీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దారు రామకృష్ణకు వినతి పత్రంఅందచేశారు. టీడీపీ జిల్లా ఆర్గనైజింగు కార్యదర్శి చిట్టూరి రవీంద్రఏఎంసీ డైరెక్టర్ పాము రవికుమార్, మరో డైరెక్టర్గంగుల వెంకటేశ్వరరావు, రైతులు పోతురాజు గోపాలరావు, తుందురు సత్యన్నారాయణ తదితరులు 50మంది రైతు సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు.

కంకిపాడు : ఈ పాసు పుస్తకాల అమలును వ్యతిరేకిస్తూ, జీవో 271 రద్దు చేయాలని రైతు సంఘాల అఖిలపక్షం పిలుపు మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘాల పెనమలూరు నియోజకవర్గ కమిటీలు ధర్నా నిర్వహించి తహశీల్దార్కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు జంపాన వెంకటేశ్వరరావు, పోతురాజు నాగేశ్వరరావు, మున్నంగి నరసింహరావు, పంచకర్ల రంగారావు, దమ్ము సత్యనారాయణ, కుంచపు బాలయ్య పాల్గొన్నారు. గన్నవరం, పెనుగంచిప్రోలు, చందర్లపాడు, కంచికచర్ల, చల్లపల్లి, అవనిగడ్డ, ముసునూరు, ఏ.కొండూరు, నందిగామ తదితర మండల కేంద్రాలలో ధర్నాలు నిర్వహించిన మెమోరాండాలు సమర్పించటం జరిగింది. ✧

అనంతలో క్షేత్రస్థాయిలో వేరుశెనగ పంట పరిశీలన

వ్యవసాయ మంత్రికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ సూచన

అనంతపురం జిల్లాలో వేరుశెనగ పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పుల్లారావు, కలెక్టర్, వ్యవసాయాధికారులకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సూచించారు. గార్లదిన్నె మండలం కనుంపల్లి సమీపంలోని గుడ్డాలపల్లికి చెందిన రైతు మనోహరమ్మ పొలంలో వేరుశెనగ పంటను సీపీఐ జిల్లా కార్యదర్శి డి.జగదీష్, సహాయ కార్యదర్శి సి.జాఫర్, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.నారాయణస్వామి, శింగనమల నియోజకవర్గ కార్యదర్శి జి. గోపాల్తో కలసి ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ వేరుశెనగ విత్తనం వేసి రెండు నెలలైనా చాలా చోట్లఊడలు దిగలేదని, అక్కడక్కడ చెట్టుకు రెండు, మూడు పిందెలు మాత్రం ఉన్నాయన్నారు. దీనికి తోడు మొవ్వకుళ్ళు తెగులు సోకి సుడి ఎండిపోతోందన్నారు. బుక్కరాయసముద్రం మండలం దండువారిపల్లి, అనంతపురం రూరల్ మండలం పూలకుంట, చియ్యేడు గ్రామాలపొలాల్లో కూడా వేరుశెనగ విత్తనం వేసి 50 రోజులు అయినా ఊడలు దిగలేదని ఆ గ్రామాలకు చెందిన రైతులు తమ దృష్టికి తెచ్చారన్నారు. వేరుశెనగ పంట కాలం 110 రోజులు. సాధారణంగా విత్తనం వేసిన తరువాత 21 రోజులకు పూత వస్తుంది. 40 రోజుల్లో ఊడలు దిగుతాయి. రెండు నెలలైనా ఊడలు దిగకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని, పంట దిగుబడిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించి ఊడలు దిగకపోవడానికి కారణాలను, జిల్లా అంతటా ఇదే పరిస్థితి ఉందా అనేది కూడా తెలుసుకోవాలని జిల్లా



కలెక్టర్, వ్యవసాయ అధికారులను కోరారు. ముందస్తు వర్షాలు కురవడంతో రైతులు ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ఎంతో ఆశతో ఈ ఏడాది ఖరీఫ్లో అనంతపురం జిల్లాలో 5.9 లక్షల హెక్టార్లల్లో వేరుశెనగ పంట సాగుచేశారన్నారు. వరుస కరవులతో పంట నష్టపోతున్న రైతులను ఈ ఏడాది సకాలంలో వర్షాలు వచ్చినా ఊడలు రాకపోవడం ఆందోళనకు గురి చేస్తోందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి డి.జగదీష్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను వేరుశెనగ పంటకు వర్తింపచేయకుండా రాయలసీమ రైతులకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. వాతావరణ బీమాతో రైతులకు ప్రయోజనం లేదన్నారు. వాతావరణ బీమా కింద రైతులనుంచి ప్రీమియం వసూలు చేసి బజాజ్ అలియాంజ్ కంపెనీకి చెల్లిస్తున్నారన్నారు. ప్రయివేట్ బీమా కంపెనీలను ప్రోత్సహించడానికే ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు రామకృష్ణ, సీపీఐ జిల్లా సమితి ప్రసాద్, గార్లదిన్నె మండల కార్యదర్శి రాజశేఖర్ శెట్టి పాల్గొన్నారు. ✧

శ్రీశైలం నీటిని దిగువకు విడుదల చేయొద్దు!

కేసీ కెనాల్ చివరి ఆయకట్టు స్థిరీకరణకు, నిర్మాణానికినిధులు కేటాయించాలి!

బోర్డు సమావేశంలో స్పష్టమైన ప్రకటన చేయాలి!

.... ఏపీ రైతు సంఘం డిమాండ్ ....



39.9 టీఎంసీల నికర జలాలు కలిసిన కేసీకెనాల్ చివరి ఆయకట్టు కడప జిల్లాలోని 92 ఎకరాలకు సాగునీరు, 10 లక్షలమంది ప్రజలకు తాగునీరు అందాలంటే శ్రీశైలం కనీస మట్టం 854 అడుగులు అమలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామసుబ్బారెడ్డి, జి. చంద్ర డిమాండ్ చేశారు. తద్వారా కేసీ కెనాల్ చివరి ఆయకట్టుకు నీరందించాలని, స్థిరీకరణకు రాజోలి రిజర్వాయర్‌ను 2.9టీఎంసీల సామర్థ్యంతో నిర్మాణానికి నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని కేసీ కెనాల్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో వారు హెచ్చరించారు. బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం 39.9 టీఎంసీల నికర జలాలు కలిగిన కేసీ కెనాల్‌కు, తుంగభద్ర డ్యామ్ నుంచి 10 టీఎంసీలను, మిగిలిన 29.9 టీఎంసీలను దిగువ ప్రాంతం నుంచి కేటాయించారన్నారు. కాలక్రమంలో తుంగభద్రనుంచి ఇవ్వాల్సిన 10 టీఎంసీలను పెన్నా, అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు కేటాయించి అందుకు బదులుగా శ్రీశైలం నీటిని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా తీసుకుని చివరి ఆయకట్టు కడప జిల్లాలోని 92 వేల ఎకరాల స్థిరీకరణకు రాజోలిఆనకట్టను 2.9 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్‌ను నిర్మించాలని శంకుస్థాపన చేశారన్నారు. పరిపాలనా అనుమతులు వచ్చినప్పటికీ నిధుల కేటాయింపులో తీవ్రమైన నిర్లక్ష్యం కారణంగా నిర్మాణానికి నోచుకోక పోవడంతో చివరి ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. పంటలు లేక తిండిగింజలు కూడా అందకపోవడమేకాక జిల్లాలోని అనేక పట్టణాల, గ్రామాల లక్షలాది మందిప్రజలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వంరాయలసీమను శాశ్వతంగా కరువు నుంచి విముక్తి చేసేందుకు కృష్ణా, గోదావరి నదుల అనుసంధానం పేరుతో పట్టిసీమను నిర్మించిందన్నారు. దీనివల్ల డెల్టాకు ఇవ్వాల్సిన శ్రీశైలం నీటిని రాయలసీమకు మళ్ళించి డెల్టాకుపట్టి సీమ నుంచి గోదావరి నీటిని అందిస్తామని ప్రకటించి నప్పటికీ గతసంవత్సరం తాగునీటి అవసరాల పేరుతో, ప్రస్తుతం కృష్ణా పుష్కరాల పేరుతో శ్రీశైలంలోకి వచ్చిన నీటిని వచ్చినట్లు కిందికి విడుదల చేసుకుంటున్నారన్నారు.దీని వల్ల ఈ ఏడాది కూడా నికర జలాలుకలిగిన కేసీ కెనాల్‌కు నీరందక కరువువాతన పడాల్సి వస్తోందన్నారు.


ప్రతి ఏటా కుందూ నదిలో వచ్చే 40 టీఎంసీల నీళ్ళు పెన్నాలో కలుస్తున్నప్పటికీనిలువ చేసుకోవడానికి ఎక్కడా ఒక్క టీఎంసీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు లేవన్నారు. తక్షణం ప్రభుత్వం శ్రీశైల కనీస నీటిమట్టం 854 అడుగులు అమలు చేసి కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేయాలని, స్థిరీకరణకు రాజోలు రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేయాల్సిన సమయంలో మరమ్మ తులు చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. వేసవిలో పనులు చేస్తే పనుల నాణ్యత స్పష్టంగా అర్థమవుతుందన్నారు. నీరు విడుదల చేసినప్పుడు పూడిక పనులు తూతూమంత్రంగా చేసి కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని ఆరోపిం చారు. కర్నూలులో జరిగే ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశంలో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వినతి పత్రాన్ని జూనియర్ అసిస్టెంట్ అన్వర్‌బాషాకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. శంకర‌రెడ్డి, టి. మనోహర‌రెడ్డి, పి. చంద్రశేఖర‌రెడ్డి, మేకల జయన్న, సుబ్బారెడ్డి, జమాలయ్య, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు. ✧

రైతులను విస్మరిస్తే పతనమే!

రైతు సంఘం రాష్ట్రస్థాయి వర్క్‌షాపులో నేతల హెచ్చరిక

పాలక పార్టీలు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను విస్మరిస్తే ప్రభుత్వాల పతనం తప్పదని ఏపీ రైతు సంఘం రాష్ట్ర స్థాయి వర్క్‌షాపులో పలువురు నేతలు హెచ్చరించారు. రైతుల పక్షాన నిరంతరం పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఇందుకోసం రాష్ట్రస్థాయి వర్క్‌షాపులో కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నట్టు పలువురు నేతలు స్పష్టంచేశారు. కడప నగరం సప్తగిరి కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం (ఎపికెఎస్) రాష్ట్రస్థాయి వర్క్‌షాపును జూలై 29 నుండి 31 వరకు జరిగింది. కౌలు రైతులు - చట్టాలు - రుణాలు, ప్రకృతి వైపరీత్యాలు, సమాజ పరిణామక్రమం - వ్యవసాయం, వ్యవసాయ పరపతి విధానం - భారతీయ సహకార బ్యాంకుల పాత్ర తదితర అంశాలపై మొదటి రోజు సమావేశం కొనసాగింది. ఈ సందర్భంగా అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య, ఏపీరైతు సంఘం అధ్యక్షులు పి. రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్‌లు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు భూదాహం పట్టిందన్నారు. రైతుల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని ధ్వజమెత్తారు. అవసరమైన భూమికన్నా మరింతఎక్కువ సేకరించడాన్ని తప్పు పట్టారు. నదుల అనుసంధానం పేరుతో చంద్రబాబు ధనాన్ని వృథా చేస్తున్నారే తప్ప రైతాంగానికి ఉపయోగపడే చర్యలు చేపట్టడం లేదన్నారు. పెండింగ్‌లో వున్న ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. పంటలకు గిట్టుబాటు ధర రాక రైతులు అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమన్నారు. ప్రధాని మోడీ అధికారంలోకి రాకమునుపు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ఇచ్చిన మాట నీటిమూటగా మారిందన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించి ఉద్యమాలు, పోరాటాలు పెద్దఎత్తున నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కడప జిల్లా కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, రాష్ట్ర రైతు నాయకులు జగన్నాథం, గంగాభవాని,. వెంకటరత్నం, రమణయ్య, రామసుబ్బారెడ్డి, చంద్ర, సాంబిరెడ్డి తదితర రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆన్‌లైన్ విధానం ద్వారా రైతులు నష్టపోతున్నారని, ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను కాలరాస్తోందని




ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామచంద్రయ్య, కె.వి.వి.ప్రసాద్‌లు అన్నారు. వర్కుషాపులో భాగంగా 2వ రోజు ప్రకృతి, సేంద్రియ సాగు, వ్యవసాయపరపతి విధానం, జాతీయ సహకార బ్యాంకుల పాత్రపై జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1బి అడంగల్ తప్పుల తడకగా ఉందని, దీనికి వ్యతిరేకంగా గ్రామ గ్రామాన తిరిగి రైతులకు జరిగే అన్యాయాన్ని వివరిస్తామన్నారు. ప్రకృతి సేంద్రియ సాగుపై వ్యవసాయ శాస్త్రవేత్త దినేష్ కుమార్ మాట్లాడుతూ సేంద్రీయం/ప్రకృతి సాగు చేయాలంటే పశువులు కావాలన్నారు. పశుపోషణకోసం దాణాకై పచ్చగడ్డి పెంచాలన్నారు. పాలదిగుబడులతో పాటు పశువులపేడ, మూత్రం ద్వారా జీవావరణం ఎరువులతో లాభాలు చేకూరుతాయని తెలిపా రు. వెన్నెల రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు విజయ్‌కుమార్ మాట్లాడుతూ వ్యవసాయం పూర్తిగా నిర్వీర్యమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. వేల ఎకరాలు బీడు పెట్టి రుణాలు తీసుకుంటున్నారన్నారు. సెంట్రల్ హ్యూమన్‌రిసోర్స్ సెంటర్ అధ్యక్షుడు శివారెడ్డి మాట్లాడుతూ రైతులు అప్పులపాలై చనిపోతే వ్యవసాయాధికారులు చూసేందుకు కూడా రావడం లేదన్నారు. సాగు పూర్తిగా రుణాల మీద ఆధారపడి ఉందని తెలిపారు. దీనికి పరిష్కార మార్గం సేంద్రియ వ్యవసాయమేనని వారు పేర్కొన్నారు. ఏపీ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.రామచంద్రయ్య, కె.వి.వి.ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శులు కె.జగన్నాథం, ఎ. కాటమయ్య, ఉపాధ్యక్షులు గంగాభవాని, సిహెచ్ కేశవశెట్టి, కడప జిల్లా రైతుసంఘ అధ్యక్షులు పి.రామసుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.చంద్ర పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్య వైఖరి వల్ల దేశంలో వ్యవసాయరంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, రైతు నాయకులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు విమర్శించారు. కడప సప్తగిరి కళ్యాణ మండపంలో మూడు రోజులుగా జరుగుతున్న

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి కే.వి.వి. ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముప్పాళ్ళ మాట్లాడుతూ ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మారుస్తామని భరోసా ఇచ్చిన బీజేపీ అధికారంలోకి రాగానే వ్యవసాయ రంగాన్ని గాలికి వదిలేసి పెట్టుబడిదారుల కొమ్ము కాస్తోందన్నారు. పాలకుల విధానాల వల్ల వ్యవసాయ రంగం నిర్వీర్యమవుతోందన్నారు. ఒకప్పుడు రూపాయి పెట్టుబడి లేకుండానే వ్యవసాయం సాగేదని, నేడు లక్షలాది రూపాయలను సాగుకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. పండించిన పంటలకు మార్కెట్ సదుపాయం కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు శీతల గిడ్డంగులు లేకపోవడంవల్ల ప్రతి ఏడాది రూ.45 వేల కోట్ల పంటలను రైతులు నష్టపోతున్నారన్నారు. రైతుసంఘం జాతీయ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి మూలాధారమైన ప్రాజెక్టుల నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. కరవు ప్రాంతమైన రాయలసీమలోని ప్రాజెక్టులను ప్రాధాన్యతాక్రమంలో పూర్తి చేయకపోగా పట్టిసీమ రాయలసీమకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఊకదంపుడు ఉపన్యాసాలు చేయడం ఎలా సబబని ఆయన ప్రశ్నించారు. కడప జిల్లా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.నాగరాజు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు చేతికందక రైతులు తీవ్రంగానష్టపోతున్నారన్నారు. ఈ నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులకు తగ్గట్టు తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులిచ్చే పంటలను సాగు చేసే దిశగా రైతులు ముందుకు సాగాలన్నారు. వ్యవసాయరంగంలో వస్తున్న నూతన సాంకేతిక పద్ధతులను రైతులు ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని పాటించడం వల్ల ఆశించిన దిగుబడులను పొందవచ్చన్నారు. సేంద్రియ ఎరువులను విరివిగావాడాలన్నారు. తక్కువ నీటితో పంటలను సాగుచేసేలా సూక్ష్మ నీటి పద్ధతులను ఆచరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రామచంద్రయ్య, కార్యదర్శులు కె.జగన్నాథం, ఎ.కాటమయ్య,. ఉపాధ్యక్షులు గంగాభవానీ, సిహెచ్ కేశవ శెట్టి, కడప జిల్లా అధ్యక్షులు పి.రామసుబ్బారెడ్డి, కార్యదర్శి జి.చంద్ర, నగర కార్యదర్శి వెంకట శివ, వివిధ జిల్లాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ✧

143 జీవో ప్రతులు దగ్ధం


జామాయిల్, సుబాబుల్‌కు గిట్టుబాటు ధర కల్పించాలి : కె. వీరారెడ్డి



కందుకూరులోని స్థానిక ఆర్టీసీ డిపో సమీపంలో జామాయిల్, సుబాబుల్ రైతుసంఘం ఆధ్వర్యంలో జామాయిల్, సుబాబుల్ రైతులకు తీవ్రనష్టం చేకూర్చే జీవో నెంబర్ 143 ప్రతులను రైతుసంఘం నాయకులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జామాయిల్, సుబాబుల్ రైతు సంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షులు కె. వీరారెడ్డి మాట్లాడుతూ రైతుల పోరాట ఫలితంగా మార్కెటింగ్‌శాఖ, రైతులు పేపర్ మిల్లుల ప్రతినిధుల సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం జామాయిల్, సుబాబుల్ కొనుగోలు ఒప్పందం చేసుకున్నారన్నారు. ఈ ఒప్పందం ప్రకారం జామాయిల్ టన్నుకు రూ.4,600, సుబాబుల్ రూ. 4,400లకు కొనుగోలు చేయాలని నిర్ణయం జరిగినా నేటికీ అమలు జరగ లేదన్నారు. పేపర్ మిల్లుల యజమానులు దళారులను ఏర్పాటు చేసుకొని జామాయిల్ రూ. 2,500, సుబాబుల్ రూ. 3,500లకు కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రశ్నిస్తే కొనుగోలు నిలిపివేస్తామని పేర్కొనడం దురదృష్టకరమన్నారు. ముగ్గురు మంత్రుల సమక్షంలో జరిగిన ఒప్పందానికే గతిలేకపోతే మిగిలిన రైతు సమస్యలు ఏ విధంగా పరిష్కారమవుతాయన్నారు. ఈ క్రమంలో రైతులను పూర్తిగా నష్టపరిచేందుకు జీవో నెంబర్ 143ను ప్రభుత్వం తీసుకొచ్చిందని ఏ జిల్లాకు ఆ జిల్లా ధర కల్పించే లక్ష్యమే జీవో ముఖ్య ఉద్దేశమన్నారు. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోయి వ్యాపారులు లాభపడే అవకాశాలు దండిగా వున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జీవో నెంబర్ 143ను రద్దు చేసి గతంలో జరిగిన ఒప్పందం మేరకు కర్ర కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుబాబుల్, జామాయిల్ రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు చల్లా వెంకటేశ్వర్లు, నాయకులు మద్దసాని లక్ష్మీనారాయణ, డిరత్నం, గుళ్ళ కోటయ్య, నరసయ్య, ఎర్రంశెట్టి ఆనంద్ ఇతరులు పాల్గొన్నారు. ✧

వేరుశెనగ రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ....

అనంతపురం జిల్లా వ్యాప్తంగా ధర్నాలు



అనంతపురము అర్బన్ (రాప్తాడు) : అనంతపురం జిల్లాలో రైతులు వేరుశెనగ పంట సాగు చేసి రెండు నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఊడలు దిగలేదని, ఇందుకు కారణం ప్రభుత్వ నాశిరకమే విత్తనకాయల లోపమేనని, కావున రైతులను ఎకరాకు రూ. 15 వేలునష్టపరిహారం చెల్లించాలని అనంతపురం జిల్లా రైతుసంఘ అధ్యక్షులు సి. మల్లికార్జున డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహశీల్దార్కార్యాలయం ఎదుట సీపీఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కరువు జిల్లా అనంతలో రైతులు ఎక్కువగా వేరుశెనగపంటపైనా ఆధారపడి జీవిస్తున్నారని గత ఐదారేళ్ళుగా పంటలు రైతులు పెట్టిన పెట్టుబడులు రావడం లేదని, దీంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వం నాశిరకం విత్తన కాయలు పంపిణి చేయడంతోనే రెండు నెలలైనా ఊడలు దిగలేదని ప్రభుత్వం స్పందించి రైతులకు ఎకరాకు రూ. 15 వేలు నష్టపరిహారం అందించడంతో పాటు, వేరుశెనగకు ఫసల్ బీమా యోజనను వర్తింప చేయాలని డిమాండ్చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి పి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వన్నారెడ్డి, రాప్తాడు మండల కార్యదర్శి ఎస్.నాగరాజు, రూరల్ మండల కార్యదర్శి రమేష్, యువజన సంఘం నేతలు దుర్గేష్, రవీంద్ర, రైతు సంఘం నాయకులు వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయ సముద్రం : అనంతపురం జిల్లా బుక్కరాయ సముద్రం మండల కేంద్రంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ. కాటమయ్య, నియోజకవర్గ కార్యదర్శి బండి రామకృష్ణ, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, మండల కార్యదర్శి టి. నారాయణస్వామి హాజరై మాట్లాడారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితుల వల్ల ఈ ఏడాది రైతులకు అపారనష్టం వాటిల్లిందని, పెట్టిన పెట్టుబడులు నేలపాలయ్యాయని, రక్షక తడుల పేరుతో ప్రభుత్వం పెట్టిన రెయిన్గన్ల ప్రయత్నం విఫలమైందని, జూన్,జూలై నెలలు గడిచిన వేరుశెనగ మొక్కలు ఊడలు దిగలేదని, ఇందుకు కారణం ప్రభుత్వం సరఫరా చేసిన నాశిరకం వేరుశెనగ కాయలే కారణమన్నారు. సమయానికి వర్షాలు రాక రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. నాశిరకం విత్తనాలు ఇచ్చి రైతులను ప్రభుత్వం మోసం చేసిందని, అందుకే ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఎకరాకు రూ. 10వేలు నష్టపరిహారం తక్షణమే చెల్లించాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సీపీఐ నాయకులు ఆర్. రామాంజనేయులు, గోవిందు, వెంకటరాముడు, కో అప్షన్ సభ్యులు రసూల్, మహిళా సమాఖ్య నాయకురాలు అరుణమ్మ, లక్ష్మిదేవి, సీపీఐ నాయకులు తిరుపతయ్య, బండల రామాంజనేయులు, మగ్రిస్వామి, హరిక్రిష్ణలు తదితరులు పాల్గొన్నారు.


ఉరవకొండ, శింగనమల, నార్పలలో, ముదిగుబ్బ, రాయదుర్గం అర్బన్, గుత్తి, తలుపుల, ఓడిచెరువు తదితర మండల కేంద్రాలలోని తహశీల్దార్ కార్యాలయాల ముందు నష్టపోయిన వేరుశనగ పంటకు నష్టపరిహారం చెల్లించాలని, ఫసల్ బీమా యోజనను వర్తింపచేయాలని తదితర డిమాండ్స్తో ధర్నాలు నిర్వహించి మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక సిపిఐ, రైతుసంఘ నాయకులు పాల్గొన్నారు. ✧

ఉల్లికి మద్దతు ధర కల్పించాలంటూ ధర్నా

కర్నూలు జిల్లా దేవనకొండలో ఉల్లికి మద్దతు ధర కల్పించాలంటూ ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలోస్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా వున్న గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ గతంలో ఆకాశంలో వున్న ఉల్లి ధర నేడు అమాంతం పతనం కావడంతో రైతులు నష్టపోవడం జరుగుతుందన్నారు. క్వింటా ధర మూడు నుండి నాలుగు వందల లోపు వుండటంతో లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతులు ఆత్మహత్యలు చేసుకొనే పరిస్థితి వుందన్నారు. కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లికి కనీస మద్దతు ధర రూ. 2 వేలు కల్పించి రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుసంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు శాంతికుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి నర్సారావ్, రైతుసంఘం మండల కార్యదర్శి కండప్ప, నాయకులు రాజశేఖర్, పురుషోత్తంరెడ్డి ,వెంకటేశ్వరరెడ్డి, శ్రీకాంత్, వెంకటేష్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా నుంచి పీఏబీఆర్ కుడికాలువకు నీటి కోసం

జీడిపల్లి జలాశయంలో సీపీఐ, రైతుసంఘం జలదీక్ష




హంద్రీ-నీవా నుంచి పీఏబీఆర్ కుడి కాలువకు 3 టీఎంసీలు కేటాయిస్తూ జీఓ విడుదల చేయాలని, ఆ నీటితో పీఏబీఆర్ కుడికాలువ కింద ఉన్న 50 చెరువులు నింపాలని, జీడిపల్లి జలాశయం నుంచి పీఏబీఆర్‌కు లింక్‌చానెల్ ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయంలో సీపీఐ, రైతుసంఘం ఆధ్వర్యంలో జలదీక్ష నిర్వహించారు. ఈ దీక్షలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. సీపీఐ అనంతపురం జిల్లా కార్యదర్శి డి.జగదీష్, సహాయ కార్యదర్శి సి. జాఫర్, కార్యదర్శివర్గ సభ్యులు సి.మల్లికార్జున, రైతుసంఘం రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. కాటమయ్య, సీపీఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి పి.రామకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు సి.లింగమయ్య, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. పద్మావతి, జిల్లా నాయకులు ఎ. అరుణ, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వైఎల్ రామాంజనేయులు, ఏఐటీయూసి నాయకులు చియ్యేడు రామకృష్ణ, పీఎల్ నరసింహులు, పోతులయ్య, ఏఐవైఎఫ్ నాయకులు దుర్గాప్రసాద్, రవీంద్ర, సీపీఐ నాయకులు ఎస్. నాగరాజు, రామకృష్ణ, శ్రీకాంత్, రైతు సంఘం నాయకులు వెంకటనారాయణ తదితరులు ఈ దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ పీఏబీ ఆర్ కుడికాలువ ద్వారా ఉరవకొండ, శింగనమల, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల పరిధిలోని 50 చెరువులకు నీరు అందించడానికి అధికారికంగా కేటాయింపులు లేవన్నారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి రివర్స్ డైవర్షన్‌ద్వారా కేసీ కెనాల్‌కు రిజర్వ్ చేసిన 10 టీఎంసీల నీటిని హెచ్ఎల్సీ ద్వారా అనంత పురం జిల్లాకు మళ్లించాలని గతంలో ప్రభుత్వం ఉత్త ర్వులు జారీచేసిందన్నారు. తుంగభద్ర ప్రాజెక్టులో పూడిక పేరుకుపోవడంతో దామాషా ప్రకారం నీటి కేటాయింపులు చేస్తున్నారన్నారు. గడిచిన రెండు, మూడేళ్ళు తుంగభద్ర ప్రాజెక్టులో నీటిలభ్యత తగ్గిపోవడంతో పీఏబీఆర్‌కుడి కాలువ కింద చెరువులకు నీరు అందించడం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో హంద్రీనీవా నుంచి పీఏబిఆర్ కుడికాలువకు మూడు టీఎంసీలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. బైరవాణితిప్ప, పేరూరుప్రాజెక్టులకు, కుప్పంకు నీరు కేటాయిస్తున్నందున హంద్రీనీవాకు కేటాయింపులను 40 టీఎంసీల నుంచి 80 టీఎంసీలకు పెంచాలని డిమాండు చేశారు. ✧



ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం, మేడపి గ్రామంలో "అఖిల భారత కిసాన్‌సభ డిమాండ్స్‌డే" సందర్భంగా రైతుసంఘ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రకాశం జిల్లా రైతుసంఘ అధ్యక్షులు డి. శ్రీనివాస్. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి దాసరి మల్లి కార్జునరావు, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు కడియం ఆదినారాయణ, మేడపి రైతు సంఘ నాయకులు బి నాగేశ్వరరావు, జి చిన్న రామయ్య, నూతి ఆంజనేయులు, ఎం. సుబ్బారావు, మాగులూరి అచ్చయ్య, ఎన్ నాగేశ్వరరావు, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

బలవంత భూసేకరణ వెంటనే ఆపాలని కోరుతూ.....




ప్రభుత్వం పేదల భూములను బలవంతంగా సేకరించడం వెంటనే ఆపాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షులు రామిశెట్టి వెంకయ్య డిమాండ్ చేశారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. రామిశెట్టి వెంకయ్య మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో నిత్యం కరవుతో అల్లాడే ప్రాంతం తంబళ్ళపల్లి నియోజకవర్గం అని అన్నారు. ఇక్కడ ప్రభుత్వం సామాజిక అడవుల పెంపకం కార్యక్రమం పేరుతో 192 మంది రైతుల భూములను తీసుకోవడానికి నోటీసులు జారీ చేసిందన్నారు. 860 ఎకరాల భూమిలో పెద్దమండ్యం మండలం బండ్రేవు, కలిచెర్ల, మందలవారిపల్లిలో ఎక్కువ శాతం గిరిజనులు నివసిస్తున్నారన్నారు. ఈ భూసేకరణ వల్ల 60 శాతం గిరిజనులు నిరాశ్రయులుగా మారతారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి ఈ భూమి తప్ప వేరే జీవనాధారం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో చాలా చోట్ల ప్రభుత్వం అభివృద్ధి పేరిట పచ్చటి భూములను తీసుకొని కారుచౌకగా పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతోందని విమర్శించారు. దీని ఫలితంగా పరిశ్రమలు వస్తాయో..రావో తెలియదన్నారు. కానీ రాష్ట్రంలో ఆహారధాన్యాల కొరత మాత్రం వస్తుందన్నారు. ఇప్పటికే పేదలు పెరిగిన ధరలతో మూడు పూట్ల భోజనం చేసే పరిస్థితి కూడా లేదన్నారు. ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పచెప్పడానికి కుట్రపన్నుతోందని విమర్శించారు. వ్యవసాయ రంగం మీద ప్రత్యక్షంగా,పరోక్షంగా ఆధారపడిన లక్షలాదిమంది ఉపాధి కోల్పోతారని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని కూడా పరిశ్రమలుగా గుర్తించి అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా చిత్తూరు జిల్లాలో వెనుకబడిన తంబళ్ళపల్లి నియోజకవర్గ రైతుల మనోభావాలను గౌరవించి రైతులకు ఇచ్చిన నోటీసులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బలవంతభూసేకరణకు పాల్పడితే రైతుసంఘం ఆధ్వర్యంలో రైతులను సమీకరించి రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ తంబళ్ళపల్లి నియోజకవర్గ కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి, మదనపల్లె నియోజకవర్గ కార్యదర్శి తిత్తి కృష్ణప్ప, పట్టణ కార్యదర్శి మంగిరి సాంబ, రైతుసంఘం మదనపల్లె నియోజకవర్గ అధ్యక్షుడు జనార్ధనరెడ్డి, కార్యదర్శి మోహన్, ఏఐటీయూసీ నాయకులు హైదర్‌ఖాన్‌తోపాటు తంబళ్ళపల్లి నియోజకవర్గ భూములు కోల్పోతున్న మూడు గ్రామాల రైతులు 50 మందికిపైగా పాల్గొన్నారు. ✧

భూముల వేలాన్ని అడ్డుకున్న రైతుసంఘం నాయకులు

గత దశాబ్దకాలంగా వర్షాలు సకాలంలో కురవక, పంటలు పండక అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులు రుణాలు చెల్లించలేదని పేర్కొంటూ వారి భూములను వేలం వేసేందుకు వచ్చిన సహకార బ్యాంకు సిబ్బందిని కర్నూలు జిల్లా పత్తికొండ మండలంలో ఆంధ్రప్రదేశ్‌రైతు సంఘం ఆధ్వర్యాన అడ్డుకున్నారు. దూదేకొండకు చెందిన కొందరు రైతుల భూములను వేలం వేసేందుకు సహకార బ్యాంకు మేనేజర్ రామ్మోహన్ ఆధ్వర్యంలో సిబ్బంది వేలం పాట ప్రారంభించారు. ఈ వేలంపాటను రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రామచంద్రయ్య ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి రామచంద్రయ్య మాట్లాడుతూ,ఎన్నికల ముందు పాదయాత్ర సందర్భంగా రైతులు ఎవరూ బ్యాంకు రుణాలు కట్టవద్దని టీడీపీ ప్రభుత్వం వస్తే బ్యాంకులో రుణాలు ఉన్న రైతులందరికి ఎటువంటి షరతులు లేకుండా రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు రైతుల భూములను వేలం వేసేందుకు బ్యాంకు అధికారులకు ఆదేశాలు జారీచేయడం దారుణమని విమర్శించారు. దాదాపు 10 సంవత్సరాల నుండి వర్షాలు సకాలంలో పడక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. పనులు లేక రైతులు సుదూర ప్రాంతాలకు వెళ్ళి బేల్దారి పనులు, గేట్‌వాచ్‌మెన్‌లుగా పనులు చేసుకొని దుర్భరజీవితం గడుపుతుంటే అధికారులు రైతుల ఆవేదనను కొంతైనా అర్థం చేసుకోలేపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజా సాహెబ్, తాలుకా అధ్యక్షులు పెద్దవీరన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు తిమ్మయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురుదాస్, మండల కార్యదర్శి కారన్న, నెట్టెకంటెయ్య, రంగన్న, మల్లికార్జున, మస్తాన్, గ్రామ రైతులు పాల్గొన్నారు. ✧

రైతుల ప్రయోజనాలను దెబ్బతీస్తున్న ప్రభుత్వం

వినుకొండలో జీవో నెం. 143 కాపీలను దగ్ధం చేసి నిరసన



రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా రూపొందించిన జీవో 143కు వ్యతిరేకంగా ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా వినుకొండ పట్టణంలో ఆందోళన చేపట్టారు. స్థానిక శివయ్యస్థూపం సెంటర్‌లో జీవో కాపీలను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. పెద్దసంఖ్యలో రైతులు కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ నియతృత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్ మాట్లాడుతూ పెట్టుబడిదారులకు, పారిశ్రామిక వేత్తలకు ఊడిగం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రైతాంగ ప్రయోజనాలను దెబ్బతీస్తూ దారుణమైన చట్టాలను రూపొందించడం తగదన్నారు. పంటధరలను ఎక్కడికక్కడ జిల్లా స్థాయిలో నిర్ణయించే విధంగా ఏకపక్షంగా తీర్మానిస్తూ జీవోను ప్రవేశపెట్టడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కనీసం రైతుసంఘం ప్రతినిధులను చర్చలకు పిలువకుండా అభిప్రాయాలను వాస్తవాలను తెలుసుకోకుండా ఇటువంటి జీవోలను తీసుకురావటం రైతులకు తీవ్రనష్టం కలిగిస్తుందన్నారు. తక్షణమే జీవోను ఉపసంహరించుకోవాలని, గతంలో నిర్ణయించిన విధంగా సుబాబుల్ పంటకు 4400, జామాయిల్, సరుగుడు పంటలకు రూ. 4600 గిట్టుబాటు ధరలను కొనసాగించాలని కె.వి.వి.ప్రసాద్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే రైతుసంఘం ఆధ్వర్యంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నరిసేటి గురవయ్య, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎం. శ్రీనివాసరెడ్డి, ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు కంతేటి శివరామకృష్ణ, ఉలవలపూడి రాము, సీపీఐ ఏరియా కార్యదర్శి మారుతీ వరప్రసాద్, సీనియర్ నాయకులు సంద్రపాటి సైదా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ✧

ఆయకట్టు రైతులను తక్షణమే ఆదుకోవాలి!



ఆయకట్టు రైతులకు ఎల్‌ఎల్‌సి సాగునీటిని విడుదల చేయాలని స్థానిక ఎల్‌ఎల్‌సి కార్యాలయం ఎదుట రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. కె.సి.జబ్బారు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతుసంఘం కర్నూలు జిల్లా అధ్యక్షులు బి.జి.మాదన్న, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.రామచంద్రులు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా ఖరీఫ్ పంటలకు అరకొర సాగునీరు ఇవ్వడం వల్ల ఆయకట్టు రైతులు వరినాట్లు వేయలేక పోతున్నారని, తదుపరి పంటలకే నీరు స్తామని చెప్పినా ఇంతవరకు కాలువకు నీరు రావడంలేదన్నారు. కర్నూలు జిల్లాలో 5 నియోజక వర్గాలకు 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు రావాల్సి ఉంది. ఖరీఫ్ సీజనులో ఆయకట్టు క్రింద 43 వేల ఎకరాలకుపైగా రావాల్సిన సాగునీరు కనీసం 20 వేల ఎకరాలకు కూడా సాగునీరు అందడం లేదన్నారు. మనకు రావాల్సిన ఎల్‌ఎల్‌సి నీటి వాటా 24 టిఎంసిలు రావాల్సి ఉంది. 10 టిఎంసిల నీరుకూడ రావడంలేదని రైతులకు సక్రమంగా ఇరిగేషన్ అధికారులు సాగునీరు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని వారు విమర్శించారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు ఎంపిలు, ఎమ్మెల్యేలు మనకు రావాల్సిన సాగునీరు ఎల్‌ఎల్‌సి నీటకై కర్ణాటక ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, ఆయకట్టు రైతులను ఆదుకోవాలని డిమాండు చేశారు. ఇప్పటికైన ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయకట్టు రైతులకు సాగునీరు ఇచ్చి ఆదుకోవాలని డిమాండు చేశారు. లేనిపక్షంలో రైతుసంఘాల ఆధ్వర్యంలో కాలువ ఆఫీసును దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. అనంతరం రైతులకు ఎల్‌ఎల్‌సి నీటిని విడుదల చేయాలని కాలువ డి.ఇ. వెంకటేశ్వర్లకు వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం తాలుకా కార్యదర్శి ఎమ్ సత్యన్న, బి. నరసింహులు, ఎఐటియుసి అధ్యక్ష, కార్యదర్శులు బి. రాముడు, ఏసేపు, బాలరాజు, అలువాల రైతన్నలు రాముడులు పాల్గొన్నారు. ✧

సంఘటిత పోరుతోనే రైతు సమస్యల పరిష్కారం

సంఘటిత ఉద్యమాల ద్వారానే రైతు సమస్యలు పరిష్కార మౌతాయని అఖిలభారత కిసాన్‌సభ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య ఉద్ఘాటించారు. రైతాంగ కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉంగుటూరు మండలం పెద అవుటుపల్లి గ్రామంలో రావుల వెంకయ్య రైతుసంఘ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం రైతు సంఘం నాయకులు పెద్ది వెంకటరత్నం అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. అమరజీవి, ప్రముఖ రైతు నాయకులు వై.వీ. కృష్ణారావు కిసాన్‌సభ జాతీయ నాయకునిగా బాధ్యతలు నిర్వహించి, వ్యవసాయ రంగాభివృద్ధికి, రైతుసంఘం బలోపేతానికి విశేష సేవలందించారని కొనియాడారు. రైతుసంఘం జమీందారీ, జాగీర్దారీ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి పేదరైతులకు భూములను పంపిణీ చేయించిందని అన్నారు. గిట్టుబాటు ధరల కోసం, సాగునీటి ప్రాజెక్టుల కోసం పోరాడి విజయం సాధించిన ఘనత ఆంధ్రప్రదేశ్ రైతు సంఘానిదేనని కొనియాడారు. తొలుత అమర జీవి వైవీ కృష్ణారావు చిత్రపటానికి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 60 ఏళ్లు నిండిన వృద్ధులకు పింఛన్ సౌకర్యం నెలకు రూ.10వేలు




కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయ రంగానికి ప్రత్యేక బడ్జెట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించాలని, బడ్జెట్‌లో 10 శాతం నిధులు వ్యవసాయానికే కేటాయించి అమలుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. కృష్ణాజిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి మల్నీడి యల్లమందారావు, వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణాజిల్లా అధ్యక్షులు కొండా వీరాస్వామి, రైతు సంఘం నాయకులు ముక్కామల ఉమామహేశ్వరరావు, పాలకేంద్రం అధ్యక్షులు అళ్ల వెంక టేశ్వరరావు, యార్లగడ్డ లక్ష్మయ్య, మంచికంటి సాంబయ్య, పెద్ది వాసుదేవరావు, పి.వెంకటేశ్వరరావు, కె.విజయారావు, పిన్నమనేని మనోజ్, పోతురాజు నాగేశ్వరరావు పాల్గొన్నారు. ✧

Printed and Published by Kolli Nageswara Rao on behalf of Andhra Pradesh Ryotu Sangham, Ryotu Bhavan, 210 Amrutha Estates, Himayatnagar, Hyderabad-29 and printed at Nagarjuna Enterprises, Visalaandhra Building, Chuttugunta, Vijayawada-4, Published at Andhra Pradesh Ryotu Sangham, Ryotu Bhavan, 210 Amrutha Estates, Himayatnagar, Hyderabad-29 Editor : Kolli Nageswara Rao.

BCL

చదవండి - చదివించండి - చందాదారులుగా చేరండి - చేర్పించండి!

రైతులకు కరదీపిక రైతులోకం




Ryotulokam
R.N.I. 15836/68

September 2016
Date of Printing Every Month 1st

Regd.No. VJ/119/2015-17
Date of Posting : 4 & 5th

No. of
Pages : 44



మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA106M194
పుస్తకం పేరు	రైతులోకం
తారీఖు	07 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	45
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Jayalakshmi
పేజీలు విడదీసినది	Jayalakshmi
స్కాన్ చేసినది	Lakshmi
పరీక్ష చేసినది	hema
పేజీలు సరిచూసినది	Latu
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good